


సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+16+40 పేజీల ఆదివారం అనుబంధం వెల: ₹ 6.00

సంపుటి: 12
సంచిక: 120

ఆదివారం 21-7-2019

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL


SUNDAY Special



## టైటిల్‌కు విజయం దూరంలో...

ఇండోనేసియా ఓపెన్ టోర్నీ ఫైనల్లో పీవీ సింధు

– స్పోర్ట్స్‌లో



## ధైర్యే సాహసే లక్ష్మి

సీనియర్ నటి లక్ష్మితో 'సాక్షి' ఎక్స్‌క్లూజివ్ ఇంటర్వ్యూ

– ఫ్యామిలీలో

## షీలా దీక్షిత్ కన్నుమూత



- గుండెపోటుతో మృతిచెందిన కాంగ్రెస్ సీనియర్ నేత
- ఢిల్లీ సీఎంగా మూడుసార్లు పనిచేసిన ఘనత
- రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధాని సహా పలువురి సంతాపం

- 5లో



సమాధి గూళ్లలో మృతదేహాలను ఉంచేందుకు వాడిన రాతి తొట్టెలు

# కారడవిలో రాకాసి పట్టణం

**పినపాక సమీపంలో వేల సంఖ్యలో ఆదిమానవుల సమాధులు**

- దట్టమైన అడవిలో గుట్టలపై ప్రత్యేక పద్ధతిలో నిర్మాణాలు
- గోదావరి తీరంలో ఇనుపయుగం గుర్తులు
- వీటి పరిధి మరింత విస్తారంగా ఉందంటున్న తాజా రుజువులు
- వెలుగులోకి తెస్తే యునెస్కో గుర్తింపు వస్తుందంటున్న చరిత్రకారులు
- తద్వారా తెలంగాణకు అంతర్జాతీయ ఖ్యాతి దక్కుతుందని సూచన

**సాక్షి, హైదరాబాద్:** అదో పట్టణం.. విచిత్రమైన రాకాసి పట్టణం. అక్కడ మనకులాగే మనుషులు, ఇళ్లుంటాయని అనుకుంటే తప్పులో కాలేసినట్లే. ఎందుకంటే ఆ పట్టణంలో మనుషులు మచ్చుకు కూడా కనిపించరు. ఎటు చూసినా సమాధులే దర్శనమిస్తాయి. అవేవో ఈమధ్య కట్టినవి కావు. వీటి వయసు దాదాపు 3వేల ఏళ్లు. అంటే ఇనుపయుగం నాటివి. గుట్టపైకెక్కి తిరుగుతుంటే ఒక్కో రాయికి ఓ సమాధి కనిపిస్తుంది, అందుకే ఆ ప్రాంతానికి స్థానికులు పెట్టుకున్న పేరు.. 'రాకాసి పట్టణం'. భద్రాచలం దట్టమైన అడవుల్లో ఈ ప్రాంతం ఉంది. జ్యోండిగో.. దక్షిణ కొరియాలో ప్రముఖ పర్యాటక ప్రాంతం. ఇక్కడి గుట్టల్లో వేల సంఖ్యలో ఆదిమానవుల సమాధులు కనిపిస్తాయి. భారీ బండరాళ్లు చుట్టూ పేర్చి.. వాటిపై దాదాపు మిగతా 2వ పేజీలో ▶









# వీఆర్వో వ్యవస్థ రద్దు?

## త్వరలోనే అధికారిక ప్రకటనంటూ వార్తలు



- కొంతకాలంగా సీఎం నోట వీఆర్వోల అవినీతి మాట
- గ్రామస్థాయి నుంచే రెవెన్యూ ప్రక్షాళన యోచనలో ముఖ్యమంత్రి
- భూరికార్డుల ప్రక్షాళన తీరు.. తర్వాతి పరిణామాలూ కారణాలే
- కొత్త రెవెన్యూ పాలసీపై ఉద్యోగ వర్గాల్లో ఉత్కంఠ

**సాక్షి, హైదరాబాద్:** గ్రామ రెవెన్యూ అధికారుల (వీఆర్వో) వ్యవస్థ రద్దు కానుందా? వీరిని పంచాయతీరాజ్ లేదా వ్యవసాయశాఖలో విలీనం చేయాలని ప్రభుత్వం యోచిస్తోందా? ఈ రకమైన సంకేతాలే కనబడుతున్నాయి. అత్యున్నత అధికారవర్గాలు అందించిన సమాచారం ప్రకారం త్వరలోనే దీనికి సంబంధించి అధికారిక ప్రకటన వెలువడొచ్చని తెలుస్తోంది. రెవెన్యూ శాఖలో పనిచేస్తోన్న కిందిస్థాయి ఉద్యోగుల్లో అవినీతి పెరిగిపోయిందని, వీరిని సంస్కరించకపోతే రెవెన్యూ వ్యవస్థకే ప్రమాదమని సీఎం కేసీఆర్ బహిరంగంగానే వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలోనే వీఆర్వో వ్యవస్థను రద్దు చేసే అంశాన్ని కేసీఆర్ తీవ్రంగా పరిశీలిస్తున్నట్లు ఆ వర్గాలు వెల్లడించాయి. సీఎం, సీఎస్, భూ పరిపాలన ప్రధాన కమిషనర్‌కు లేని అధికారాలు వీఆర్వోలకున్నాయని శాసనసభ సాక్షిగా సీఎం వ్యాఖ్యానించడం ఉద్యోగవర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారింది. లోక్‌సభ ఎన్నికల సమయంలో ఆదిలాబాద్ రైతుతో ఫోన్‌లో మాట్లాడిన సీఎం.. స్థానిక సంస్థల ఎన్నికల అనంతరం రెవెన్యూ పని పడదామని వెల్లడించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఇప్పటికే కొత్త రెవెన్యూ చట్టంపై కసరత్తు చేస్తున్న సర్కారు.. భూ వివాదాలకు తావివ్వకుండా టైటిల్ గ్యారంటీ చట్టం తీసుకురావాలని యోచిస్తోంది. ఓవైపు కొత్త చట్టంలో పొందుపరచాల్సిన అంశాలపై మల్లగుల్లాలు పడుతూనే.. పాలనాపరమైన సంస్కరణలు చేపట్టే దిశగా నిపుణుల కమిటీతో చర్చిస్తోంది. ఇందులో భాగంగా గ్రామస్థాయిలో ఉన్న వీఆర్వోల వ్యవస్థను రద్దు చేసి.. ఉద్యోగులను పంచాయతీరాజ్ లేదా వ్యవసాయశాఖలో విలీనం చేస్తే సరిపోతుందనే ప్రతిపాదన చేస్తున్నట్టు సమాచారం.

### కొందరితో అందరికీ నష్టం!

వాస్తవానికి గ్రామస్థాయిలో ప్రభుత్వ ప్రతినిధిగా వీఆర్వోలు వ్యవహరిస్తారు. ఏ శాఖ పనిలోనైనా వీఆర్వోలే కీలక భూమిక పోషిస్తారు. అదే సమయంలో మిగతా 2వ పేజీలో ▶

# 'కేంద్ర హోం'తో పోలీస్‌స్టేషన్‌లన్నీ లింక్!

**కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కిషన్‌రెడ్డి వెల్లడి**



- ఈ నెలాఖరుకల్లా అన్ని పోలీస్‌స్టేషన్లతో ఆన్‌లైన్ కనెక్టివిటీ
- వచ్చే నెల 2 వరకు పార్లమెంట్ సమావేశాల పొడిగింపు!
- అత్యాచారం కేసుల్లో కఠిన శిక్షల అమలుకు చట్ట సవరణ
- ఉగ్రవాదం.. కేంద్రం ముందున్న ప్రధాన సవాల్
- త్వరలో సైబర్ సెక్యూరిటీ, సైబర్ టెర్రరిజం చట్టాలు

- వివరాలు 2లో

# స్పెషలిస్ట్ వైద్యులపై సర్కారు వేటు



- అనధికారికంగా గైర్హాజరవడంతో 72 మంది తొలగింపు
- షోకాజ్ నోటీసులకు బదులు ఇవ్వకపోవడంతో సర్కారు చర్యలు... ఇప్పటికే ఉత్తర్వులు జారీ!
- వైద్యవిధాన పరిషత్‌లో సంచలనం
- ప్రభుత్వ చర్యతో రోగులకే నష్టమంటున్న వైద్య సంఘాలు

4లో




సాక్షి
రౌండప్
2 నల్లగొండ | ఆదివారం | జూలై | 21 | 2019
www.sakshi.com

కోడి గాలిలో ఎగురుతూ 13 సెకన్ల కన్నా ఎక్కువ సేపు ఉండలేదు.





# అపోలో అజరామరం..!

నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ అపోలో-11 రాకెట్ సహాయంతో చంద్రుడిపై కాలుమోపి 50 ఏళ్లు గడిచాయి. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని డెవలపర్స్ షూట్‌హిల్ అనే సాఫ్ట్‌వేర్ కంపెనీ ఓ అద్భుతమైన ఫొటోను విడుదల చేసింది. అపోలో మిషన్‌కు సంబంధించి 8 వేల వేర్వేరు ఫొటోలతో ఒక చిత్రాన్ని (మొజాయిక్) రూపొందించారు. ఈ చిత్రంలో మొత్తం 50 వేల ఫొటోలను (8 వేల ఫొటోలనే మార్చి మార్చి వాడారు) పక్కపక్కన పేర్చి వ్యోమగామి ఫొటో తయారుచేశారు. ఇది ఎంత పెద్ద చిత్రం అంటే.. ఈ ఫొటోలో లక్ష కోట్ల పిక్సెల్స్ దాకా ఉన్నాయి. సాధారణంగా ఆల్బమ్ పరిమాణం ఫొటోలో మహా అయితే 3 వేల నుంచి 4 వేల పిక్సెల్స్ ఉంటాయి. దీన్ని బట్టి వ్యోమగామి ఫొటో ఎంత పెద్దగా ఉందో మీరే ఊహించుకోండి. ఇది ప్రపంచంలోనే పెద్ద ఫొటోగా షూట్‌హిల్ కంపెనీ పేర్కొంటోంది. గిన్నిస్ రికార్డు వచ్చే అవకాశం ఉందని కంపెనీ ఉద్యోగులు చెబుతున్నారు.



## కాలేజీ నచ్చలేదా.. ఆప్షన్ మార్చుకోండి

### దోస్త్‌లో వెసులుబాటు కల్పించిన కన్వీనర్

సాక్షి, హైదరాబాద్: డిగ్రీ ఆన్‌లైన్ ప్రవేశాల్లో భాగంగా తొలుత ఒక కాలేజీలో సీటును ఎంపిక చేసుకుని తర్వాత రద్దు చేసుకున్న విద్యార్థులకు దోస్త్ కన్వీనర్ మరో అవకాశం కల్పించారు. అలాంటి విద్యార్థులు వెబ్‌సైట్‌లో తిరిగి మరోమారు రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. అలాగే ఇప్పటివరకు దోస్త్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోకుండా ప్రవేశాలు పొందని విద్యార్థులు కూడా కొత్తగా రిజిస్ట్రేషన్ చేసుకునే వెసులుబాటును కల్పించారు. ఈనెల 22వ తేదీలోపు వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని 23వ తేదీన ఆప్షన్లు ఇచ్చుకోవాల్సి ఉంటుంది. ఈనెల 26వ తేదీన వారికి సీటు అలాట్ చేస్తారు. విద్యార్థులు రిపోర్టు చేసుకునేందుకు వీలుగా ఈనెల 28, 29 తేదీల్లో కాలేజీలు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలి. అదేవిధంగా 15 మంది లోపు ప్రవేశాలు పొందిన కాలేజీలు ఆయా అడ్మిషన్లను స్వచ్ఛందంగా వదులు కోవాల్సిందిగా దోస్త్ కన్వీనర్ స్పష్టం చేశారు. అలాంటి విద్యార్థులకు మరోమారు రిజిస్ట్రేషన్‌కు అవకాశం కల్పించి సీట్లు కేటాయిస్తారు. వీరితో పాటు జీరో ప్రవేశాలు నమోదైన కాలేజీలను కూడా దోస్త్ నుంచి డిసేబుల్ చేయనున్నట్లు కన్వీనర్ ప్రకటించారు.

## బీబీనగర్ ఎయిమ్స్‌లో ఎంబీబీఎస్ అడ్మిషన్లు పూర్తి

- వచ్చే నెల మొదటి వారంలో తరగతులు ప్రారంభం
- దేశవ్యాప్తంగా 50 మంది విద్యార్థులకు ప్రవేశాలు

సాక్షి, హైదరాబాద్: బీబీనగర్ ఎయిమ్స్‌లో తొలి విడత ఎంబీబీఎస్ తరగతులను ప్రారంభించేందుకు కేంద్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తిచేసింది. వచ్చే నెల మొదటి వారంలో తరగతులను ప్రారంభిస్తారని తెలంగాణ వైద్య విద్యా సంచాలకుడు (డీఎంఈ) డాక్టర్ రమేశ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి ఏడాది 50 మంది విద్యార్థులతో ఎంబీబీఎస్ తరగతులు ప్రారంభమవుతాయన్నారు. శనివారం రమేశ్‌రెడ్డి బీబీనగర్ ఎయిమ్స్ నిర్మాణ పనులను పరిశీలించారు. మిగిలిపోయిన నిర్మాణ పనులను మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. ఇప్పటికే అనాటమీ, ఫిజియాలజీ, బయోకెమిస్ట్రీ విభాగాలతోపాటు విద్యార్థినీ విద్యార్థుల కోసం ప్రత్యేకంగా హాస్టల్, డైనింగ్ హాళ్లు కూడా సిద్ధం అయ్యాయని వెల్లడించారు.

## తెలంగాణ ఎన్నారై పాలసీ ప్రవేశపెట్టండి

### సీఎంకు ప్రవాసీ కార్మిక సంఘాల వినతి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఎన్నారై పాలసీ(ప్రవాసీ విధానం)ని వెంటనే ప్రవేశపెట్టాలని, గల్ఫ్ వలస కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావును ప్రవాసీ కార్మిక సంఘాల నేతలు కోరారు. ఈ మేరకు సీఎంను కలిసి వినతిపత్రం అందజేసినట్లు మైగ్రెంట్స్ రైట్స్ కౌన్సిల్ అధ్యక్షుడు పి.నారాయణ స్వామి, ఎమిగ్రెంట్స్ వెల్ఫేర్ ఫోరం అధ్యక్షుడు మంద భీంరెడ్డిలు తెలిపారు. ప్రవాస పాలసీ కోసం సమావేశం నిర్వహించి మూడేళ్లు గడుస్తున్నా ప్రభుత్వం పాలసీని రూపొందించడంలో చర్యలు తీసుకోవడం లేదని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. గల్ఫ్ దేశాల్లో ఉన్న తెలంగాణ ప్రవాసులు ఏటా రూ.18 వేల కోట్ల విదేశీ మారకాన్ని పంపిస్తూ ఆర్థిక వ్యవస్థకు తోడ్పాటు అందిస్తున్నారని, గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి వార్షిక బడ్జెట్‌లో రూ.500 కోట్లు కేటాయించాలని కోరారు. గల్ఫ్‌లో మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు ప్రభుత్వం ద్వారా రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, సంక్షేమ బోర్డుతో కూడిన గల్ఫ్ వర్కర్స్ కార్పొరేషన్ ఏర్పాటు, విదేశీ జైళ్లలో మగ్గుతున్న కార్మికులకు న్యాయ సహాయం, వారికి జీవిత బీమా, ప్రమాద బీమా, ఆరోగ్య బీమా, పెన్షన్‌లతో కూడిన 'ప్రవాసీ యోగక్షేమ'పథకం, మానవ అక్రమ రవాణాను అరికట్టడానికి, రిక్రూటింగ్ వ్యవస్థపై నిరంతర పర్యవేక్షణ ఏర్పాటు, గల్ఫ్ నుంచి వచ్చిన వారికి ఆర్థిక సాయం అందించి పునరావాసం కల్పించడం వంటి పథకాలను ప్రవేశపెట్టాలని సీఎంను కోరినట్లు వెల్లడించారు.

## ఆగస్టు 23 నుంచి ఇంటర్నేషనల్ ప్లాస్టిక్ ఎక్స్‌పో

హైదరాబాద్: ఇంటర్నేషనల్ ప్లాస్టిక్ ఎక్స్‌పో(ఐపీఎల్‌ఎక్స్)–2019ను ఆగస్టు 23 నుంచి 25 వరకు బెంగళూరులో నిర్వహించనున్నట్లు కర్ణాటక రాష్ట్ర ప్లాస్టిక్ అసోసియేషన్ ప్రెసిడెంట్ విజయ్‌కుమార్, కన్వీనర్ హరిరామ్ ఠాకూర్ తెలిపారు. శనివారం హోటల్ ఐటీసీ కాకతీయలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. ప్లాస్టిక్ రీసైక్లింగ్ ద్వారా కళ్ల అద్దాల ఫ్రేమ్‌లు, సిమెంట్ బ్లాకులు సైతం తయారు చేయవచ్చన్నారు. ప్లాస్టిక్‌ను రీసైక్లింగ్ చేసే విధానంపై లైవ్ డెమో ఎక్స్‌పోలో ఉంటుందన్నారు. మూడు రోజులపాటు జరిగే ఎక్స్‌పోలో 200 మంది తమ ఎగ్జిబిట్స్‌ను ప్రదర్శించనున్నట్లు చెప్పారు.

## రాంప్రసాద్ హత్య కేసులో నిందితులకు కస్టడీ

హైదరాబాద్: తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన స్టీల్ వ్యాపారి తేలప్రోలు రాంప్రసాద్ హత్య కేసులో అరెస్టయిన 9 మంది నిందితులను కోర్టు ఆదేశాల మేరకు పంజగుట్ట పోలీసులు శనివారం కస్టడీలోకి తీసుకున్నారు. కేసులో ప్రధాన నిందితుడైన కోగంటి సత్యంతోపాటు టెక్కెం శ్యామ్ సుందర్ అలియాస్ శ్యామ్, బాలనాగ ఆంజనేయ ప్రసాద్, ఎమ్.ప్రీతం, పులివర్తి రాములు, చంద్రిక ఆనంద్, రమేశ్, షేక్ అజారుద్దీన్, పత్తిపాటి నరేశ్‌లను మూడు రోజులపాటు కస్టడీలోకి తీసుకున్నారు.

## అత్యధిక జీఎస్టీ చెల్లిస్తున్నాం: మేఘా

సాక్షి హైదరాబాద్: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో అత్యధికంగా ఏటా రూ. 3,000 కోట్లకుపైగా వస్తు సేవల పన్ను (జీఎస్టీ) చెల్లిస్తున్నామని మేఘా మౌలిక సదుపాయాల సంస్థ శనివారం ఓ ప్రకటనలో తెలిపింది. తెలుగు రాష్ట్రాల్లోనే అత్యధిక మొత్తంలో జీఎస్టీ చెల్లిస్తున్న తమ కంపెనీలపై జీఎస్టీ అధికారులు దాడులు చేశారంటూ వచ్చిన వార్తలను మేఘా సీఈవో టి. అశోక్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. పన్నుల చెల్లింపులోనూ, ఇతరత్రా నిబంధనలు పాటించడంలోనూ తామెప్పుడూ ముందు వరుసలో ఉంటామని ఆయన పేర్కొన్నారు.



షావోమి కొత్త మోడల్స్‌ను విడుదల చేస్తున్న మనుజైన్, వై.గురు, మురళి రేతినేని

## సెలెక్ట్ స్టోర్‌లో షావోమి నూతన మోడల్స్

సాక్షి, హైదరాబాద్: ప్రముఖ మొబైల్ రిటైల్ సంస్థ 'సెలెక్ట్'మాదాపూర్ స్టోర్‌లో షావోమి ఇండియా హెడ్ మనుజైన్ తొలిసారిగా అమోల్డ్ డిస్‌ప్లేతో కూడిన సరికొత్త మోడల్స్‌ను లాంచ్ చేశారు. ఈ సందర్భంగా సెలెక్ట్ సీఎండీ వై.గురు మాట్లాడుతూ.. అతి త్వరలో 7ఏ, కే20 ప్రో, కే20 ప్రో మోడల్ ఫోన్లను అన్ని సెలెక్ట్ స్టోర్లలో అందుబాటులో ఉంచుతామని తెలిపారు. ప్రస్తుతం 58 స్టోర్లకి సెలెక్ట్ నెట్‌వర్క్ చేరుకుందని, దీపావళి వరకు 80 స్టోర్లకు చేరుకుంటామని ఆశాభావం వ్యక్తం చేశారు.

# 'కేంద్ర హోం'తో పోలీస్ స్టేషన్లన్నీ లింక్!

- ఈ నెలాఖరుకల్లా అన్ని పోలీస్‌స్టేషన్లతో ఆన్‌లైన్ కనెక్టివిటీ
- వచ్చే నెల 2 వరకు పార్లమెంట్ సమావేశాల పొడిగింపు!
- అత్యాచారం కేసుల్లో కఠిన శిక్షల అమలుకు చట్ట సవరణ
- ఉగ్రవాదం.. కేంద్రం ముందున్న ప్రధాన సవాల్
- త్వరలో సైబర్ సెక్యూరిటీ, సైబర్ టెర్రరిజం చట్టాలు
- 'లంచ్ విత్ కిషన్‌రెడ్డి'లో కేంద్ర హోం సహాయమంత్రి వెల్లడి

సాక్షి, హైదరాబాద్: దేశ సరిహద్దు భద్రతే కాదు అంతర్గత భద్రతకు కేంద్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తుందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి జి.కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఢిల్లీలోని నార్త్‌బ్లాక్‌లోని హోం మంత్రిత్వ కార్యాలయానికి ప్రతి పోలీసు స్టేషన్‌ను అనుసంధానం చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఈ ప్రక్రియ 70 శాతం వరకు పూర్తయిందని, ఈ నెలాఖరు వరకు దేశంలోని అన్ని పోలీసు స్టేషన్లతో ఆన్‌లైన్ కనెక్టివిటీ పూర్తవుతుందన్నారు. అప్పుడు దేశంలో ఏ పోలీసు స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదైనా తెలుస్తుందన్నారు. శనివారం హైదరాబాద్‌లో ప్లాజా హోటల్‌లో ఎమ్మెల్సీ ఎన్.రాంచందర్‌రావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన 'లంచ్ విత్ కిషన్‌రెడ్డి'కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇదేమీ ప్రెస్‌మీట్ కాదని, అందరినీ కలవాలనే ఉద్దేశంతోనే వచ్చానన్న కేంద్ర మంత్రి విలేకరులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు.

### విద్యార్థిలా నేర్చుకుంటున్నా...

కేంద్ర హోంశాఖలో అత్యంత కీలకమైన విభాగాలు ఎన్నో ఉన్నాయని, ఒక స్కూల్ విద్యార్థిలా రోజూ ఆఫీస్‌కు వెళ్తూ వాటిని నేర్చుకుంటున్నానని అన్నారు. టెర్రరిజం ఇప్పుడు తమ ముందున్న ప్రధాన సవాల్ అని వెల్లడించారు. మహిళల భద్రతకు కేంద్రం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, అది రాష్ట్రాలకు సంబంధించిన అంశమే అయినా అవసరమైన చట్టాల మార్పులను చేసి కేంద్రం మార్గదర్శకాలు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. అత్యాచార కేసుల్లో కఠిన శిక్షల అమలుకు చట్ట సవరణలు చేయబోతున్నామన్నారు. బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన శిక్ష పడేలా ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్ ఫ్రమ్ సెక్సువల్ అఫెన్సెస్ యాక్ట్ (పోక్సో)లో మార్పులు చేస్తామన్నారు. ఇప్పటివరకు 12 ఏళ్లలోపు వారిపై అత్యాచారానికి పాల్పడితే ఉరి శిక్ష వేసేలా చట్టం ఉందని, ఇకపై 18 ఏళ్లు లేదా 20 ఏళ్లలోపు వారిపై అత్యాచారానికి పాల్పడినా ఇదే శిక్ష వేసేలా చట్ట సవరణ చేయనున్నామన్నారు. సైబర్ సెక్యూరిటీ, పోలీస్ ఆధునీకరణ, షీ టీమ్స్ వంటి కార్యక్రమాలకు ఆర్థిక సాయం అందిస్తున్నామన్నారు. త్వరలోనే సైబర్ సెక్యూరిటీ, సైబర్ టెర్రరిజం ప్రివెన్షన్ చట్టాలు తీసుకురాబోతున్నామని చెప్పారు. ఈ నెల 26తో పార్లమెంటు సమావేశాలు ముగియాల్సి ఉన్నా వచ్చే నెల 2 వరకు పొడిగించే అవకాశం ఉందన్నారు. దీనిపై ఈ నెల 22న బీఏసీ భేటీలో నిర్ణయం తీసుకోనున్నట్లు మంత్రి చెప్పారు.

### మజ్లిస్‌తో కలసి టీఆర్ఎస్ రాజకీయాలు..

ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, అందుకే తాము గెలిచామని కిషన్‌రెడ్డి వెల్లడించారు. తాము మతం పేరుతో గెలవలేదని, జాతీయవాదంతో గెలిచామన్నారు. ఎన్నికల్లో మతం పేరు ఎప్పుడైనా చెప్పామా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో మజ్లిస్‌ను పక్కన పెట్టుకొని టీఆర్ఎస్ రాజకీయాలు చేస్తోందన్నారు. అభివృద్ధి ఎజెండాగానే తమ కార్యక్రమాలు ఉంటాయన్నారు. హైదరాబాద్ టెర్రరిజానికి సేఫ్ జోన్‌గా మారిందని చెప్పానని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. టెర్రరిజం బ్రీడింగ్ కేంద్రాల్లో హైదరాబాద్ కూడా ఒకటని చెప్పానే తప్ప.. దేశానికి సంబంధించిన ఉగ్రవాదమంతా ఇక్కడే ఉందనలేదు అని అన్నారు. ఎన్ఐఏ అరెస్టులే తన వాదనకు సాక్ష్యమన్నారు. దేశంలో అక్రమంగా ఉన్న విదేశీయులందరినీ గౌరవంగా వారి ప్రాంతాలకు పంపిస్తామన్నారు. హైదరాబాద్‌లోనూ ఈ చర్యలు చేపడతామన్నారు. నాగాలాండ్ వంటి రాష్ట్రాల్లో ఇప్పటికీ అనుమతి తీసుకొని వెళ్లాల్సిన ప్రాంతాలు ఉన్నాయని, అలాంటి వాటిని మార్చాల్సి ఉందన్నారు. నక్సల్స్ విషయంలో రాష్ట్రాలకు అవసరమైన సహకారాన్ని కేంద్ర ప్రభుత్వం అందిస్తోందన్నారు.



శనివారం హైదరాబాద్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కిషన్‌రెడ్డి. చిత్రంలో ఎమ్మెల్సీ రాంచందర్‌రావు

### కేసీఆర్ సారు, కేటీఆర్ సారు ఉండవు

ప్రజలు మార్పు కోరుకున్నప్పుడు కేసీఆర్.. కారు.. పదహారు.. ఢిల్లీ సర్కారు.. ఇవేవీ ఉండవన్నారు. కేసీఆర్ సారు.. కేటీఆర్ సారు... అనేది ఎవరు చూడరన్నారు. రాష్ట్రంలో 2023లో బీజేపీ అధికారంలోకి రావాలని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. మిషన్ 2023లో భాగంగా రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావాలన్నదే అమిత్ షా లక్ష్యమని, అందుకోసం కృషి చేస్తున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీని యాంటీ నేషనల్ పార్టీ అని ఎక్కడా.. ఎప్పుడూ అనలేదన్నారు. కాంగ్రెస్ నేతలు రాజకీయంగా మాత్రమే తమకు ప్రత్యర్థులని, శత్రువులు అనే మాట ఎప్పుడూ మాట్లాడబోమని అన్నారు. ఎక్కడో ఒక చోట అత్యాచారం సంఘటన జరిగితే అది మొత్తం సాయుధ బలగాలకు ఆపాదించడం సరికాదని కిషన్‌రెడ్డి వివరించారు.

# కారడవిలో రాకాసి పట్టణం

▶ మొదటి పేజీ తరువాయి

15 అడుగుల మందం ఉండే పెద్ద రాయిని మూతగా పెట్టి దాని కింద ఓ గది కట్టి అందులో మృతదేహాన్ని ఉంచేవారు. ఇది వేల ఏళ్లనాటి సమాధి చేసే విధానం. ఒకే ప్రాంతంలో వేల సంఖ్యలో ఇలాంటి సమాధులు ఉండటం ప్రపంచంలో మరెక్కడా లేవనేది ఇప్పటి వరకు ఉన్న మాట. అందుకే దీన్ని యునెస్కో ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తించింది. ఈ సమాధులను చూసేందుకు నిత్యం కొన్ని వేల మంది పర్యాటకులు, పరిశోధకులు అక్కడికి వస్తుంటారు. గోదావరి తీరంలోని పూర్వపు వరంగల్– ఖమ్మం ప్రాంతం.. మల్లూరు, దామరవాయి, జానంపేట, పాండురంగాపురం.. ఇలాంటి గుట్టలతో నిండిన ప్రాంతాలెన్నో. ఈ గుట్టలపై ఆదిమానవుల కాలంనాటి గూడు సమాధులు వేలల్లో ఉన్నాయి. అలా విస్తరించిన ప్రాంతాల పరిధి ఏకంగా దాదాపు 200 కిలోమీటర్లకు పైబడే! ఆదిమానవుల గూడు సమాధులు (డోలమైన్స్, డోల్మనాయిడ్స్) ఇంత విశాలమైన ప్రాంతంలో విస్తరించి ఉండటం.. ప్రపంచంలో మరెక్కడా లేదన్న అభిప్రాయం ఉంది. కొరియాలో సమాధుల సంఖ్య ఎక్కువగా ఉన్నా, ఆ ప్రాంత విస్తీర్ణం తక్కువ. మనదగ్గర ఆ పరిధి విస్తీర్ణం ఎక్కువ. కానీ వీటికి యునెస్కో కాదు కదా, కనీసం రాష్ట్ర పురావస్తు శాఖ గుర్తింపు కూడా లేదు. ఇప్పుడు ఈ ప్రాంతంలో మరొక కొత్త గుట్ట వెలుగు చూసింది. ఇంతకాలం స్థానిక పశువుల కాపరులు తప్ప బయటి వ్యక్తులు వాటిని చూడలేదు. తాజాగా కొత్త తెలంగాణ చరిత్ర బృందం సభ్యులు వాటిని పరిశీలించారు. స్థానికులు రాకాసి పట్టణంగా పేర్కొనే ఈ ప్రాంతం పినపాక మండలంలోని బయ్యారం నుంచి పాండురంగాపురం వెళ్లేదారిలో దట్టమైన అడవిలో ఉంది.



సమాధి గూళ్లలో మృతదేహాలను ఉంచేందుకు వాడిన రాతి నిర్మాణం

### ఎందుకీ నిర్లక్ష్యం?

ప్రపంచంలో ఇలా ఒకేచోట వేల సంఖ్యలో ఆదిమానవుల సమాధులు భద్రంగా ఉన్న ప్రాంతాలు చాలా అరుదు. తెలంగాణలోని గోదావరి తీరంలో 200 కిలోమీటర్ల మేర విస్తరించిన ఈ ప్రాంతాలు ఇప్పటి వరకు యునెస్కో దృష్టికి వెళ్లలేదు. వీటిని పరిరక్షించి యునెస్కో గుర్తింపునకు యత్నించాలన్న ఆలోచన కూడా మన ప్రభుత్వానికి రాలేదు. వెంటనే ఇలాంటి అరుదైన ప్రాంతాలను ప్రపంచ పర్యాటక పటంలో ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని కొత్త తెలంగాణ చరిత్ర బృందం సభ్యులు శ్రీరామోజు హరగోపాల్ పేర్కొన్నారు. ఇక్కడికి చేరువలో ఉన్న జానంపేటలో ఆంగ్లేయుల కాలంలోనే పరిశోధనలు జరిగాయి. ఇవి చాలా అద్భుత చారిత్రక సంపద అని నాటి పరిశోధకులు తేల్చారు. రెండేళ్ల క్రితం కేంద్ర పురావస్తు సర్వేక్షణ సంస్థ (ఏఎస్ఐ) తవ్వకాలు జరిపి నాటి ఆదిమానవుల అవశేషాలు గుర్తించి డీఎన్ఏ పరీక్షలకు తరలించింది. భూపాలపల్లి జిల్లా దామరవాయి ప్రాంతానికి అమెరికాలోని శాండియాగో విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ థామస్ ఈ లెవీ ఆధ్వర్యంలో బృందం వచ్చి ప్రాథమిక పరిశోధన జరిపి ప్రపంచంలోనే ఇవి అరుదైన ప్రాంతాలుగా గుర్తించింది. ప్రభుత్వం సహకరిస్తే ఈ మొత్తం ప్రాంతాన్ని లైడార్ సర్వే చేసి ఆధునిక పద్ధతిలో పరిశోధనలు చేస్తామని ప్రకటించింది.

### పైన కప్పు.. లోపల రాతి తొట్టి!

లోహయుగంలో మానవులు చనిపోయిన తర్వాత ప్రత్యేక గౌరవాన్ని పొందేవారు. చనిపోయాక సమాధి చేయటం సాధారణ విషయమే. కానీ, ఆ సమాధిలో సంబంధీకులు ఇష్టపడే ఆహారం, ఆహార్య వస్తువులు ఉంచేవారు. ఆ ఆత్మ తిరిగి వస్తుందన్న నమ్మకంతోనే ఇలా చేసేవారు. పెద్ద బండరాళ్లను చెక్కి చుట్టూ కొంతమేర పాతి దాదాపు పదడుగుల గుహను రూపొందించేవారు. దానిపై విశాలమైన పెద్ద బండరాయిని కప్పుగా ఏర్పాటు చేసేవారు. లోనికి వెళ్లేలా చతురస్రాకారంలో మార్గాన్ని ఏర్పాటు చేసేవారు. దాదాపు ఎనిమిదడుగుల రాతి తొట్టిని రూపొందించి మృతదేహాన్ని అందులో ఉంచి ఆ గుహకు పెద్ద రాయితో మూసేసేవారు. పక్కనే వారికి ఇష్టమైన ఆహారం, అలంకరణ వస్తువులను ఆ తొట్టేలో ఉంచేవారు. కొన్ని గుహల్లో రెండు, మూడు తొట్లు కూడా ఉండేవి. పూర్తిగా భూ ఉపరితలంపై ఇలాంటి సమాధులు కొన్ని ప్రాంతాల్లో కనిపించాయి. వాటిని డోలమైన్స్‌గా చరిత్రకారులు పేర్కొంటారు. కొంతమేర భూమిలోకి పాతినట్టు ఉండేవాటిని డోల్మనాయిడ్స్‌గా పేర్కొంటారు. ఇప్పుడు తాజాగా వెలుగు చూసిన ప్రాంతంలో వందల సంఖ్యలో డోల్మనాయిడ్స్ కనిపించాయి. స్థానిక పశువుల కాపరులు ఇచ్చిన సమాచారంతో కొత్త తెలంగాణ చరిత్ర బృందం, ఔత్సాహిక పరిశోధకులు కొండవీటి గోపి, నాగులపల్లి జగన్‌మోహన్‌రావు, సింహాద్రి నారాయణలు వాటిని పరిశీలించారు. స్థానిక అమరారం గ్రామం నుంచి పదిహేను కిలోమీటర్ల పాటు దట్టమైన అడవిలోకి వెళ్తే ఇలాంటి వందల సంఖ్యలో సమాధులున్న గుట్టలు కనిపిస్తున్నాయి. గతంలో భూపాలపల్లి జిల్లా దామరవాయి అడవిలో వెలుగుచూసిన సమాధులకు కాస్త భిన్నంగా ఉన్నట్లు గుర్తించారు. గోదావరి తీరంలో ఇలా సమాధులున్న ప్రాంతం మరింత విస్తారంగా ఉందని తాజాగా గుర్తించిన సమాధులు స్పష్టం చేస్తున్నాయి.

## 24న సీపీజీఈటీ 'కీ'

సాక్షి, హైదరాబాద్: ఈ ఏడాది రాష్ట్రస్థాయి కామన్ పోస్ట్ గ్రాడ్యుయేట్ ఎంట్రన్స్ పరీక్షకు (సీపీజీఈటీ) సంబంధించిన ప్రశ్నపత్రం 'కీ'ఈ నెల 24న **www.osmania.ac.in, tscpget.com** వెబ్‌సైట్లలో అందుబాటులో ఉంటుందని కన్వీనర్ ఎన్.కిషన్ తెలిపారు. తమ తమ సబ్జెక్టుల్లో అభ్యర్థులకు 'కీ'కి సంబంధించి ఏవైనా అభ్యంతరాలుంటే రాతపూర్వకంగా, తగిన ఆధారాలతో సీపీజీఈటీ–2019 కన్వీనర్ కార్యాలయం, ఓయూలోని డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్‌లో ఈ నెల 30వ తేదీ సాయంత్రం 5గంటల్లోగా అందించాలని సూచించారు.

## 68 కొత్త బార్లకు 'ఎక్సైజ్' ప్రతిపాదన..!

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేసిన మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో బార్ల ఏర్పాటుకు రంగం సిద్ధమవుతోంది. కొత్త మున్సిపల్ చట్టాన్ని శాసనసభ ఆమోదించడం, ప్రభుత్వ గెజిట్ కూడా రావడంతో ఈ ప్రక్రియపై ఎక్సైజ్ శాఖ దృష్టి సారించింది. కొత్తగా ఏర్పాటైన పట్టణ స్థానిక సంస్థల్లో జనాభాకు అనుగుణంగా ఎన్ని బార్లు వస్తాయి? కార్పొరేషన్లలో గ్రామాల విలీనం వల్ల పెరిగే జనాభాకు అనుగుణంగా ఆయా కార్పొరేషన్లలో ఎన్ని బార్లు పెరుగుతాయి? అనే లెక్కలు కట్టిన ఎక్సైజ్ అధికారులు రాష్ట్ర వ్యాప్తంగా కొత్తగా 68 బార్లు ఏర్పాటు చేయవచ్చని సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లినట్టు సమాచారం. ఈ మేరకు ఫైలు సీఎం వద్దకు చేరిందని, ఆయన అంగీకరిస్తే కొత్త ఎక్సైజ్ విధానం రావడానికి ముందే ఈ బార్ల కోసం నోటిఫికేషన్ వస్తుందని సమాచారం. ఒకవేళ ఈ రెండు నెలల సమయంలో కొత్త బార్ల ఏర్పాటుకు సీఎం అంగీకరించకపోతే ఈ ఏడాది సెప్టెంబర్‌లో అమల్లోకి రానున్న కొత్త పాలసీ ప్రకారం ఏర్పాటు చేయనున్నారు.

# వీఆర్వో వ్యవస్థ రద్దు?

▶ మొదటి పేజీ తరువాయి

రెవెన్యూ రికార్డుల సంరక్షకుడిగా పనిచేస్తారు. అయితే, భూముల విలువలు పెరగడం.. దానికి తగ్గట్టుగానే వివాదాలు కూడా పెరగడం వీఆర్ఓలకు కల్పతరువుగా మారింది. రికార్డుల తారుమారు.. ఒకరికి బదులు మరొకరి పేరు, విస్తీర్ణం నమోదులోనూ అడ్డగోలుగా వ్యవహరించడంతో దుమారం చెలరేగింది. వీఆర్వోల వ్యవస్థ అవినీతి కేంద్ర బిందువుగా మారిందనే విమర్శలు ఎక్కువయ్యాయి. దీనికితోడు వీఆర్వోలుగా పదోన్నతులు పొందిన మరికొందరు.. చట్టంపై అవగాహన లేక తప్పులతడకగా రికార్డులు నమోదు చేయడం కూడా భూ వివాదాలకు దారితీసింది. ఈ పరిణామాలతో రెవెన్యూ వ్యవస్థపై ప్రజల్లో ఒకరకమైన దురభిప్రాయం ఏర్పడిందని కేసీఆర్ భావిస్తున్నారు. దీనికితోడు భూ రికార్డుల ప్రక్షాళన అనంతరం జరిగిన పరిణామాలు శాఖ పనితీరుపై ప్రభావం చూపాయి. సాంకేతిక సమస్యలు, మార్పుచేర్పులకు ఆప్షన్ ఇవ్వకపోవడం, రికార్డులను ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు ఎడతెగని జాప్యం కారణంగా పరిస్థితి చేయిదాటింది. పట్టాదార్ పాస్‌పుస్తకాలు రాకపోవడం.. తాతల కాలంనాడే భూముల మ్ముకున్న వారి పేర్లతో పాస్‌పుస్తకాలు జారీ కావడంలాంటి సంఘటనలు చోటుచేసుకున్నాయి. దీంతో ఆఖరికి భూ రికార్డుల ప్రక్షాళన లక్ష్యం కాస్తా పక్కదారి పట్టింది. ఈ పరిణామాలన్నింటిపై ఇంటెలిజెన్స్ విభాగంతో వివరాలు తెప్పించుకున్న సీఎం.. రెవెన్యూశాఖలో అవినీతి పెరిగిపోయిందని ఇక కఠినంగా వ్యవహరించాల్సిందేనన్న నిర్ణయానికి వచ్చినట్టు తెలుస్తోంది. దీనికితోడు ఇటీవల ఏసీబీ దాడుల్లోనూ వీఆర్వోలే ఎక్కువగా పట్టుబడుతుండడం కూడా ముఖ్యమంత్రి కేసీఆర్ ఆగ్రహానికి కారణమైందని అధికారులు అంటున్నారు. ఇలాగైతేనే ప్రజల్లో వ్యవస్థపై నమ్మకం పెరుగుతుందని సీఎం భావిస్తున్నారు.

### డేంజర్‌జోన్‌లో వీఆర్వోలు!

రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తోన్న 4,700 మంది వీఆర్వోల భవితవ్యంపై ఈ ప్రతిపాదనలతో నీలినీడలు కమ్ముకున్నాయి. రెవెన్యూశాఖ గురించి ప్రస్తావించిన సందర్భాలలో వీఆర్వోలవైపు కేసీఆర్ వేలెత్తి చూపుతుండడంతో తమ పోస్టులకు ముప్పు వాటిల్లినట్లుగానే ఉద్యోగవర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇదిలావుండగా, గతంలో భూ రికార్డుల ప్రక్షాళనకు ముందుకు సీనియర్ ఐఏఎస్ అధికారి రఘునందన్‌రావు, సిద్దిపేట, రంగారెడ్డి జిల్లా కలెక్టర్లు వెంకట్రాంరెడ్డి, లోకేశ్ కుమార్‌లతో కూడిన కమిటీ.. గ్రామస్థాయిలో కీలకంగా వ్యవహరించే వీఆర్వోల వ్యవస్థను రద్దు చేయకూడదని సిఫార్సు చేసింది. అయితే, సీఎం మాత్రం రోజుకో హెచ్చరికతో వేడిపుట్టిస్తుండడంతో కొత్త రెవెన్యూ చట్టం ఎలా ఉంటుంది? వీఆర్వోలు ఉంటారా? ఇతర శాఖల్లో విలీనం అవుతారా? అనే ఉత్కంఠ ఉద్యోగవర్గాల్లో నెలకొంది.

### సీఎం గారూ.. ఏంటిలా?

అసెంబ్లీలో సీఎం కేసీఆర్ వ్యాఖ్యలపై వీఆర్ఓ సంఘాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. తామే తప్పుచేశామని స్వయంగా ముఖ్యమంత్రే దోషులుగా చిత్రీకరిస్తే తమ బాధలు ఎవరికి చెప్పుకోవాలని ప్రశ్నిస్తున్నారు. సీఎం వ్యాఖ్యలతో తీవ్ర మనస్తాపానికి గురయ్యా మని, సీఎస్, సీసీఎల్ఏలకు లేని అధికారాలు తమకున్నాయని సీఎం వ్యాఖ్యానించారని, తమకేం అధికారాలు న్నాయో సీఎం చెప్పాలని తెలంగాణ గ్రామ రెవెన్యూ అధికారుల సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. తమను అవమానించేలా సీఎం మాట్లాడారని, 365 రోజులు ప్రజలకు అందుబాటులో ఉండి పనిచేస్తున్నామని, చిరుద్యోగులైన తమపై కక్షసాధింపునకు పాల్పడడం సరైంది కాదని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గరికె ఉపేంద్రరావు శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. సీఎం వ్యాఖ్యల కారణంగా ప్రజల్లో తమకు గౌరవం లేకుండా పోతుందని, సామాజిక భద్రత కూడా ఉండదని ఆవేదన వ్యక్తం చేశా రు. సీఎం వ్యాఖ్యలకు నిరసనగా శనివారం నుంచి ఈనెల 27వరకు వర్క్‌టు రూల్ పాటిస్తూ నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరవుతామని తెలిపారు.

ఇదం జగత్



# జన్యువ్యాధుల గుర్తింపు ఇక ఈజీ

- కేంద్రమంత్రి హర్షవర్ధన్ వెల్లడి
- సీసీఎంబీలో అత్యాధునిక జన్యుక్రమ నమోదు యంత్రాన్ని ఆవిష్కరించిన కేంద్ర మంత్రి
- ఐఐసీటీలోనూ పలు కార్యక్రమాలకు హాజరు



హైదరాబాద్‌లోని సీఎస్ఐఆర్ సీసీఎంబీలో జన్యుక్రమ నమోదు యంత్రాన్ని ఆవిష్కరిస్తున్న కేంద్ర మంత్రి హర్షవర్ధన్. చిత్రంలో సీసీఎంబీ శాస్త్రవేత్తలు

**సాక్షి, హైదరాబాద్:** అత్యంత చౌకగా ఇకనుంచి అరుదైన జన్యువ్యాధులను అతివేగంగా గుర్తించవచ్చని కేంద్ర శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞాన, వైద్య శాఖల మంత్రి డాక్టర్ హర్షవర్ధన్ తెలిపారు. హైదరాబాద్‌లోని సీఎస్ఐఆర్ సీసీఎంబీలో రూ.8 కోట్లతో ఏర్పాటు చేసిన అత్యాధునిక జన్యుక్రమ నమోదు యంత్రాన్ని కేంద్ర మంత్రి శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..జన్యువైవిధ్యత అధికంగా ఉన్న మనదేశంలో అరుదైన జన్యువ్యాధుల గుర్తింపును వేగవంతం చేసేందుకు జన్యుక్రమ నమోదు యంత్రం ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు. మరో మూడేళ్లలో సరికొత్త భారతాన్ని నిర్మించాలన్న ప్రధాని నరేంద్రమోదీ స్వప్నాన్ని సాకారం చేసేందుకు శాస్త్రవేత్తలందరూ తమవంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. మోదీ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి దేశంలోని అన్ని పరిశోధన సంస్థలు ఒకే లక్ష్యంతో పనిచేసేలా చేయగలిగామని, ఆ ప్రయత్నాల ఫలితాలు రానున్న రెండు మూడేళ్లలో ప్రస్ఫుటంగా కన్పిస్తాయని చెప్పారు. ఆ తరువాత సంస్థ ఆవరణలోనే నిర్మించే ఆడిటోరియానికి శంకుస్థాపన కూడా చేశారు. మూడోతరం ఎరువులు, క్రిమి, కీటక నాశినుల తయారీ కోసం ఐఐసీటీ ఏర్పాటు చేసిన కొత్త విభాగాన్ని గురించి ఆయన వివరిస్తూ.. ఎరువులు, క్రిమి, కీటకనాశినులను వీలైనంత తక్కువ ధరకే రైతులకు అందుబాటులోకి తెచ్చేందుకు ఐఐసీటీ విభాగం ఉపయోగపడుతుందన్నారు.

### సభలో మెడికల్ కమిషన్ బిల్లు

కేంద్ర కేబినెట్ గత బుధవారం ఆమోదించిన జాతీయ మెడికల్ కమిషన్ బిల్లును సోమవారం పార్లమెంటులో ప్రవేశపెట్టనున్నట్లు కేంద్రమంత్రి హర్షవర్ధన్ తెలిపారు. మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా స్థానంలో ఏర్పాటు కానున్న కమిషన్ దేశంలో వైద్య విద్య, నీట్, నెక్స్‌ట్ పరీక్షల నిర్వహణ బాధ్యతలు చేపట్టనుంది. ఇందుకు అనుగుణంగా కమిషన్‌లో నాలుగు విభాగాలను ఏర్పాటు చేయనున్నారు. ఎంబీబీఎస్, పీజీ కోర్సుల కోసం రెండు విభాగాలు ఉంటాయి. ప్రైవేట్ వైద్య కళాశాలల్లో 50% కన్వీనర్ కోటా ఫీజుల నియంత్రణ బాధ్యతలను కూడా కమిషనే చేపట్టనుంది. ఎంసీఐని ఇప్పటికే బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ తన ఆధీనంలోకి తీసుకుందని, కమిషన్ అందుబాటులోకి వస్తే వైద్య విద్యలో విప్లవాత్మక మార్పులు వస్తాయని చెప్పారు.

### వ్యాధుల నిర్ధారణ ఇక చౌక: డాక్టర్ తంగరాజ్

ఇల్యూమినా కంపెనీ తయారు చేసిన జన్యుక్రమ నమోదు యంత్రంతో ఎన్నో ఉపయోగాలున్నాయని, దీని సేవలను సామాన్యులూ ఉపయోగించుకోవచ్చునని సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ తంగరాజ్ తెలిపారు. 'సాక్షి'తో ఆయన మాట్లాడుతూ..పూర్తిస్థాయి జన్యుక్రమ నమోదుకు రూ.లక్ష వరకూ ఖర్చు కావొచ్చని..నిర్దిష్ట వ్యాధుల నిర్ధారణకు మాత్రం ఇంతకంటే తక్కువ ఖర్చు అవుతుందని వివరించారు. దేశ జనాభాలో మూడొంతుల మందికి మాత్రమే జన్యు సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశం ఉందని, జన్యుక్రమ విశ్లేషణ ద్వారా ఈ వ్యాధులకు కారణాలు గుర్తిస్తే భవిష్యత్తులో ఆయా వ్యాధుల నిర్ధారణ కేవలం కొన్ని వందల రూపాయలతోనే పూర్తవుతుందని తెలిపారు.

### 8 నిమిషాల్లో 80 వేల కణాలు

సీసీఎంబీలో శనివారం ఏర్పాటైన జన్యుక్రమ నమోదు యంత్రం కేవలం ఎనిమిది నిమిషాల్లోనే 80 వేల కణాల్లోని జన్యుక్రమాలను, బార్‌కోడింగ్ పద్ధతిలో వేర్వేరుగా గుర్తించగలదని సంస్థ డైరెక్టర్ రాకేశ్ మిశ్రా తెలిపారు. ఈ పరికరాన్ని వైద్యులు, ఆస్పత్రులు, పరిశోధన సంస్థలు కూడా ఉపయోగించుకోవచ్చునని తెలిపారు. వ్యాధులు వాటి చికిత్సలకు సంబంధించిన పరిశోధనలు మొత్తం ప్రస్తుతం కాకేసియన్ జాతి జనాభా ఆధారంగా జరుగుతున్నాయని.. భారతీయుల అవసరాలకు తగ్గ జన్యు సమాచారం సేకరించేందు కు ఈ యంత్రం ఉపయోగపడుతుందని చెప్పారు.

## ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలపై మొండి వైఖరి వద్దు

### ఎస్టీయూ మహాధర్నాలో ఉద్యోగ సంఘం నేతలు

**సాక్షి, హైదరాబాద్:** ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం మొండివైఖరిని ప్రదర్శిస్తోందని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బి.భుజంగరావు, జి.సదానంద్‌గౌడ్ పేర్కొన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం ముందుకు రావాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారాన్ని కోరుతూ శనివారం ఇందిరా పార్కు వద్ద ఎస్టీయూ మహాధర్నా నిర్వహించింది. ఈ కార్యక్రమంలో దాదాపు వెయ్యిమంది ఉద్యోగ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ.. కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని తక్షణమే రద్దు చేయాలన్నారు. సీపీఎస్ నిర్ణయంపై రాష్ట్ర ప్రభుత్వాలే నిర్ణయం తీసుకోవాలని కేంద్రం స్పష్టం చేసిందని, దీంతో సీపీఎస్ రద్దు బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని తెలిపారు. అలాగే ఉద్యోగుల పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలని, కనీసం మధ్యంతర భృతి ఇచ్చి పీఆర్‌సీపై స్పష్టత ఇవ్వాలని కోరారు. ఉపాధ్యాయ ఖాళీల భర్తీ, ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న అక్రమ బదిలీల తంతును నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు, 33 జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

**రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు సికింద్రాబాద్**
సౌత్ లాలాగూడ, సికింద్రాబాద్-500017
www.rrbsecunderabad.nic.in, ఇ-మెయిల్ ID-asrrb@scr.railnet.gov.in
**సెంట్రలైజ్డ్ ఎంప్లాయ్‌మెంట్ నోటీసు: 03/2014 Jr. Stenographer (ఇంగ్లీష్)**
సెంట్రలైజ్డ్ ఎంప్లాయ్‌మెంట్ నోటీసు: 03/2014లోని జూనియర్ స్టెనోగ్రాఫర్ (ఇంగ్లీష్) ఉద్యోగానికి సంబంధించి 11-01-2015న జరిగిన వ్రాత పరీక్షలోని సామర్థ్యాల ఆధారంగా వ్రాత పరీక్ష ఫలితాలు (సప్లిమెంటరీ-I) 21-05-2019న ప్రకటించబడినవి. త్వరలో జరిగే నైపుణ్య పరీక్షలో పాల్గొనేందుకు అర్హులుగా 41 మందిని గుర్తించడం జరిగింది.
ఉత్తర ప్రత్యుత్తరాల కోసం అభ్యర్థులు RRB వెబ్‌సైట్ www.rrbsecunderabad.nic.in లో ప్రచురించబడిన అక్నాలెడ్జ్‌మెంట్ ఫారంలో తమ చిరునామా అప్‌డేట్ చేయవలసిందిగా సూచించడమైనది.
మరిన్ని వివరాలకు మా వెబ్‌సైట్ www.rrbsecunderabad.nic.in
RRB/SC/RT/Advt./04/CEN-03/2014 — చైర్మన్, RRB సికింద్రాబాద్

**కొబ్బరి అభివృద్ధి బోర్డు**
**Coconut Development Board**
(MINISTRY OF AGRICULTURE & FARMERS WELFARE, GOVERNMENT OF INDIA), Kochi, Kerala. Ph: 0484 - 2377266, 67; Website: www.coconutboard.gov.in
బహుళ బాధ్యతలు నిర్వహించే ఉద్యోగాల నియామక ప్రకటన
బహుళ బాధ్యతలు నిర్వర్తించే ఉద్యోగాలలో నియమింపబడటానికి అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నాం. ఈ ఉద్యోగాలు 1వ వేతన స్థాయిలో వుంటాయి. వేగివాడలోని డి.ఎస్.పి వ్యవసాయ క్షేత్రంలోని కొబ్బరి అభివృద్ధి బోర్డు వారు నేరుగా నియామకాలు చేస్తారు. మరిన్ని వివరాలకు మా వెబ్‌సైట్ www.coconutboard.nic.in చూడండి లేదా ఎంప్లాయిమెంట్ పత్రికలో నియామక ప్రకటన చూడండి.
(ఆర్. మధు) సెక్రటరీ

**MSME-TOOL ROOM, HYDERABAD**
**CENTRAL INSTITUTE OF TOOL DESIGN**
(Ministry of MSME - A Government of India Society)
Balanagar, Hyderabad-500 037, (TS), INDIA. Phone No: 040 - 2377 2749
Website: www.citdindia.org, E-Mail : citdcadcam@citdindia.org
**ADMISSION INTO M.TECH MECHATRONICS-2019-20**
Last date for submission of applications is extended to 02.08.2019
Date of Entrance Examination 07-08-2019.
Applications are invited in the prescribed format for admissions into the M.Tech Mechatronics (2 Years Course) conducted in collaboration with JNTU, Hyderabad and CITD, Approved by AICTE, commencing from August' 2019.
For further details visit us at: www.citdindia.org or CAD / CAM Department (Admission Room)
Telephone No. : 040-23772749.
E-mail: citdcadcam@citdindia.org
Sd/-
PRINCIPAL DIRECTOR
(An ISO 9001:2015, ISO 29990:2010, ISO 14001:2004, 50001:2011 Certified Institutions)

# నిండైన పదజాలం గోరా శాస్త్రి సొంతం

- శతజయంతి ఉత్సవాల్లో ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు
- నిజాన్ని నిర్భయంగా రాశారు
- ఆయన సంపాదకీయాలు జ్ఞానసంపాదనామార్గాలు
- జర్నలిస్టులకు ఆయన జీవితం పాఠం కావాలి



శనివారం హైదరాబాద్‌లో గోరా శాస్త్రి రచించిన వినాయకుడి వీణ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు

**హైదరాబాద్:** సంపదను ప్రతిఒక్కరూ రూపాయల్లోనే లెక్కిస్తారని, కానీ దానిని నిండైన పదజాలంతో అక్షరాల్లో లెక్కించిన సాహితీమూర్తి గోవిందు రామశాస్త్రి(గోరా శాస్త్రి) అని ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు కొనియాడారు. సంపదను అక్షరాలతో లెక్కించేవారిని ప్రపంచం గుర్తిస్తుందని, అదేమార్గంలో గోరా శాస్త్రిని నేటికీ స్మరించుకుంటున్నామని అన్నారు. సాహిత్యఅకాడమీ, వయోధిక పాత్రికేయ సంఘం సంయుక్తంగా శనివారం ఇక్కడి డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో నిర్వహించిన గోరా శాస్త్రి శతజయంతి ఉత్సవాలకు వెంకయ్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ 'గోరా శాస్త్రి అంటే సంపాదకీయాలు, సంపాదకీయాలంటే గోరా శాస్త్రి'అన్నంతగా పేరు సంపాదించుకున్నారని, అలాంటివారిని గౌరవించుకోవడం భారతీయ సంస్కృతిలో ఒక భాగమని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగం మీద మక్కువ చూపించే పరిస్థితుల్లో ఉద్యోగాన్ని వదిలి జర్నలిజం, సాహిత్యం మీద ఆయన ఆసక్తి కనబరిచారని, తెలుగు, ఆంగ్ల భాషల్లో ఏకకాలంలో సంపాదకీయాలు రాసి సాహితీ సవ్యసాచిగా పేరు సంపాదించుకున్నారని అన్నారు. ఆయన సంపాదకీయాలను పాఠకులు జ్ఞానసంపాదనామార్గాలుగా భావించేవారని గుర్తుచేశారు. ఈ తరం జర్నలిస్టులకు ఇలాంటి ఆదర్శప్రాయుడి జీవితాన్ని, సంపాదకీయాలను పాఠాలుగా బోధించాల్సిన అవసరం ఉందన్నారు. తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో స్వతంత్ర పత్రికకు పనిచేసిన ఆయన ఆ తర్వాత ఆంధ్రభూమి సంపాదకుడిగా తెలుగు ప్రజలకు చేరువయ్యారని పేర్కొన్నారు. ఆయన సంపాదకీయాల కోసమే ఆ రోజుల్లో పత్రికలను కొనేవారన్నారు. నిజాన్ని నిష్కర్షగా రాయడం ఆయన ప్రత్యేకత అని, హాస్యాన్ని, వ్యంగాన్ని, విమర్శను సమపాళ్లలో కలుపుతూ రాయడం ఆయనకే సాధ్యమైందని అన్నారు. కలగూరగంప పార్టీలు ఓ విచిత్రమైన సమాఖ్య అని గోరా శాస్త్రి ఏనాడో చెప్పారని, అది నేటి రాజకీయ పరిస్థితులకు అద్దం పడుతోందన్నారు.

### అమ్మమ్మ ఇంటికి వచ్చినట్టుగా ఉంది...

తెలుగు పాత్రికేయులందరినీ ఇలా ఒకేచోట కలవడం ఆనందంగా ఉందని, అమ్మమ్మ ఇంటికి వచ్చినట్లుగా అనుభూతి కలుగుతోందని వెంకయ్యనాయుడు అన్నారు. ఇలాంటి కార్యక్రమాలు తెలుగుభాషకు, పాత్రికేయవృత్తికి మరింత గౌరవం తెచ్చిపెడతాయని అభిప్రాయపడ్డారు. సమాజాన్ని సన్మార్గంలో నడిపించే శక్తి సాహిత్యానికే ఉందని, ముఖ్యంగా మాతృభాషాసాహిత్యం మనగతాన్ని తెలియజేస్తుందని, ఇప్పుడు పత్రికల్లో సాహిత్యం కరువైందని అన్నారు. ఈ సందర్భంగా గోరా శాస్త్రి సంపాదకీయాల సంకలనం 'వినాయకుడి వీణ'పుస్తకం, మోనోగ్రాఫ్ పుస్తకాలను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో సాహిత్యఅకాడమీ కార్యదర్శి కె.శ్రీనివాసరావు, వయోధిక పాత్రికేయ సంఘం అధ్యక్షుడు జి.ఎస్.వరదాచారి, కె.లక్ష్మణ్‌రావుసహా పలువురు సీనియర్ పాత్రికేయులు పాల్గొన్నారు.

- మహారాష్ట్రలోని విదర్భ తాగునీటి సమస్యను తీర్చేందుకు మిషన్ భగీరథ లాంటి పథకాన్ని తమ ప్రభుత్వం త్వరలోనే మొదలు పెడుతుందని ఆ రాష్ట్ర తాగునీటి అధికారి శ్యామ్‌లాల్ చెప్పారు. వికారాబాద్ జిల్లా రాఘవాపూర్ వద్ద ఉన్న నీటిశుద్ధి కేంద్రాన్ని ఆయన నేతృత్వంలోని ఇంజనీర్లు సందర్శించారు.

## కేసీఆర్ కొత్తగా సీఎం అయినట్లు మాట్లాడుతున్నారు: దత్తాత్రేయ

**సాక్షి, హైదరాబాద్:** కేసీఆర్ ఇప్పుడే కొత్తగా సీఎం అయినట్లుగా మాట్లాడుతున్నారని బీజేపీ నేత బండారు దత్తాత్రేయ ఎద్దేవాచేశారు. వచ్చేనెల 15 తర్వాత అసలు పాలన ఉంటుంది అంటే మరి ఐదేళ్ల 6 నెలల పాలన నకిలీ పరిపాలనా? అని ప్రశ్నించారు. మున్సిపల్ చట్టంలో రాజ్యాంగ స్ఫూర్తికి తూట్లు పొడిచేలా చాలా అంశాలున్నాయన్నారు. 'మున్సిపల్ శాఖలో అవినీతి పెరిగి పోయిందని సీఎం అన్నారు. ఒక్క మున్సిపల్ శాఖలో కాదు అన్నింటిలోనూ అవినీతి ఉంది'అని శనివారం విలేకరులతో మాట్లాడుతూ స్పష్టంచేశారు. ఈఎస్ఐలో జరిగిన అవినీతిపై సీఎం ఎందుకు నోరు విప్పడం లేదని, ఏసీబీకి పూర్తి అధికారాలు ఇవ్వడానికి ఎందుకు వెనకాడుతున్నారని దత్తాత్రేయ ప్రశ్నించారు. దీనిపై సీబీఐ విచారణకు ఆదేశించే ధైర్యం సీఎంకి ఉందా అని సవాలు విసిరారు. టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అహంకార పూరితంగా మాట్లాడుతున్నారని, లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి 20 శాతం ఓట్లు వచ్చిన విషయాన్ని ఆయన మరిచిపోయినట్లున్నారని ఎద్దేవా చేశారు.

## 'డిగ్రీ' ఫలితాల జాప్యంతో విద్యార్థులకు అన్యాయం

### తెలంగాణ ప్రభుత్వ కాలేజీల గెజిటెడ్ అధ్యాపక సంఘం

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీల్లోని డిగ్రీ ఫైనల్ ఇయర్ ఫలితాల జాప్యం వల్ల విద్యార్థులకు అన్యాయం జరుగుతోందని తెలంగాణ ప్రభుత్వ కాలేజీల గెజిటెడ్ అధ్యాపక సంఘం అధ్యక్షుడు సంజీవయ్య, ప్రధాన కార్యదర్శి కె.సురేందర్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. డిగ్రీ ఫలితాల జాప్యంతో కేంద్రీయ యూనివర్సిటీల్లో అర్హత పొందిన విద్యార్థులు పీజీ కోర్సుల్లో చేరే అవకాశం కోల్పోకుండా ఉన్నత విద్యా మండలి న్యాయం చేయాలని కోరారు. ఉన్నత విద్యా మండలి కేంద్రీయ యూనివర్సిటీ అధికారులతో చర్చించి గడువు తేదీని పొడిగించే విధంగా వారిని ఒప్పించాలని, మన రాష్ట్రం నుండి అర్హత పొందిన ప్రతి విద్యార్థికి కేంద్ర యూనివర్సిటీల్లో ప్రవేశం కల్పించేలా చూడాలన్నారు. చాయిస్ బేస్డ్ క్రెడిట్ సిస్టం అమల్లోకి వచ్చిన తర్వాత విద్యా సంవత్సరం నిర్వహించడంలో రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీలు పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించారు. తరగతుల ప్రారంభం నుంచీ పరీక్షల నిర్వహణ వరకు యూనివర్సిటీ అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించడం లేదని, అందుకే ఇలాంటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని ఆరోపించారు. ఉన్నత విద్యా మండలి కూడా యూనివర్సిటీలు నిర్వహిస్తున్న తీరు పట్ల చూసీచూడనట్లు వ్యవహరించడం వల్లనే ఈ రోజు ఎంతోమంది విద్యార్థులు వారికి వచ్చినటువంటి ఒక మంచి అవకాశాన్ని కోల్పోయే ప్రమాదం ఏర్పడిందని వాపోయారు. యూనివర్సిటీ అధికారులు ఇప్పటికైనా బాధ్యతాయుతంగా వ్యవహరించి ఫలితాలను తొందరగా ప్రకటించాలని, విద్యార్థులకు భవిష్యత్తు నష్టపోకుండా చూడాలని కోరారు. కేవలం యూనివర్సిటీ అధికారులు తమకు స్వయంప్రతిపత్తి ఉందని, ఎవరు తమ విషయాల్లో జోక్యం చేసుకోవద్దని, ఎవరి విజ్ఞప్తులకు స్పందించాల్సిన అవసరం లేదనే మొండి వైఖరి ప్రదర్శించకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.

भारतीय डाक विभाग
DEPARTMENT OF POSTS : INDIA
मुख्य पोस्टमास्टर जनरल कार्यालय, तेलंगाना सर्किल, हैदराबाद – ५००००१
O/o the Chief Postmaster General, Telangana Circle, Hyderabad – 500001

**Deen Dayal SPARSH Yojana for 2019-20**
**(Scholarship for Promotion of Aptitude & Research in Stamps as a Hobby)**
**for students of Class VI to IX**

- **"Philately"** is the study of stamps and postal history and other related items. It also refers to the collection, appreciation and research activities on stamps and other philatelic products.
- Reinforcing the efforts aimed towards increasing the reach of Philately, the Department of Posts has introduced a philately scholarship scheme **Deen Dayal SPARSH Yojana** (Scholarship for Promotion of Aptitude & Research in Stamps as a Hobby) for generating interest regarding Philately amongst students.
- **Students of class VI to IX** from a recognized School within India having good academic record and pursuing philately as a hobby are eligible for Scholarship. At the time of selection for award of scholarship, the candidate should have scored atleast 60% marks or equivalent grade/grade point in the recent final examination. There will be 5% relaxation for SC/ST.
- A Level-1 Screen Test (Philately Written Quiz) for 1 hr will be conducted on Current Affairs, History, Geography, Science, Sports, Culture, Local Philately & National Philately for the eligible candidates and @ 40 candidates per class will be allowed to submit the Philately Project Work (Level-2).
- SPARSH Scholarships will be awarded solely on the basis of the marks secured in Philately Project. Students who are eligible from Level 1 should submit their Project work in 4 to 5 pages and using not more than 16 stamps (original/image).
- The amount of Scholarship per awardee is **Rs.6,000/-** and will be paid @ Rs.1500/- on quarterly basis @ 10 students in each class for 1 year.
- The student should be a member of School Philately Club. In case the School Philately Club hasn't been established, a student having his own Philately Deposit Account may also be considered. To open a new Philately Deposit Account, visit the nearby Head Post Office/Hyderabad GPO.
- Interested candidates may submit their application form at the nearest O/o Sr/Supdt. of Post Office(s) **by 23.08.2019**. Details are also available at www.indiapost.gov.in & http://telanganapostalcircle.in.
- Applications can be downloaded from "http://telanganapostalcircle.in". Sample of Project is also made available in the same website.

Sd/-
Asst. Postmaster General (Philately)
for Chief Postmaster General, Telangana Circle.

## ప్రియాంక అరెస్ట్ నియంత పాలనకు నిదర్శనం

### ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌చార్జి ఆర్.సి.కుంతియా

**సాక్షి, హైదరాబాద్:** ఉత్తరప్రదేశ్‌లో ఆదివాసీల హత్యాకాండ నేపథ్యంలో బాధితులను పరామర్శించేందుకు వెళ్తున్న ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీని అరెస్ట్ చేయడం నియంత పాలనకు నిదర్శనమని ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌చార్జి ఆర్.సి కుంతియా విమర్శించారు. శనివారం ఆయన గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ నియంతలా పాలిస్తున్నారని ధ్వజమెత్తారు. బీజేపీ పాలకులకు ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కాంగ్రెస్ సీనియర్ నేత, ఢిల్లీ మాజీ సీఎం షీలా దీక్షిత్ మృతి పార్టీకి తీరని లోటని, ఆమె మరణం పట్ల ప్రగాఢ సంతాపం తెలియజేశారు.

## నారాయణ, శ్రీచైతన్యలపై విచారణకు ఆదేశాలివ్వండి

### హైకోర్టులో పిల్ దాఖలు

**సాక్షి, హైదరాబాద్:** ఇంటర్మీడియట్ బోర్డు నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న నారాయణ, శ్రీచైతన్య కాలేజీల అక్రమాలపై దర్యాప్తునకు ఆదేశాలివ్వాలని కోరుతూ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం(పిల్) దాఖలైంది. మేడ్చల్ ప్రాంతానికి చెందిన డి.రాజేశ్ ఈ పిల్‌ను దాఖలు చేశారు. ఆయా కాలేజీలతో అధికారులు కూడా కుమ్మక్కు అయ్యారని, చట్టాన్ని ఖాతరు చేయకుండా కాలేజీలను నిర్వహించడంపై విచారణకు ఆదేశాలివ్వాలని పిల్‌లో కోరారు. విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి, ఇంటర్ బోర్డు కార్యదర్శి, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల కలెక్టర్లను ప్రతివాదులుగా చేర్చారు.



ఆస్ట్రిచ్ పక్షి కన్ను.. దాని మెదడు కన్నా పెద్దదిగా ఉంటుంది.



# వేడితో కరెంటు



నేటి కాలంలో ప్రతి ఒక్కరి చేతిలో సెల్‌ఫోన్ ఉంటోంది. ఫోన్‌ను ఎక్కువ సేపు వాడితే వేడి అవుతుంటుంది. అయితే ఆ వేడి ఏమవుతుంది..? వృథా అవుతుంది. కానీ ఆ వేడిని వృథా కానీయకుండా.. విద్యుత్ తయారుచేస్తే..! సెల్‌ఫోన్లే కాదు ఫ్రిజ్‌లు, కార్లు, కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌ల నుంచి వెలువడే వేడితో విద్యుత్‌ను తయారుచేస్తే.. చాలా అద్భుతమైన ఐడియా కదా..? అయితే ఇలాంటివన్నీ అనుకోవడానికే బాగుంటుంది కానీ.. నిజ జీవితంలో ఎలా సాధ్యమవుతుందని మూతి విరవకండి. ఎందుకంటే ఆ ఆలోచనను నిజం చేశారు.. అమెరికాలోని ఉటా యూనివర్సిటీ పరిశోధకులు. సిలికాన్ చిప్పులను ఉపయోగించి ఉష్ణం నుంచి విద్యుత్‌ను పుట్టించి చూపించారు. ఇందుకు 5 మి.మీ.ల పరిమాణంలోని రెండు సిలికాన్ చిప్‌లను 100 నానోమీటర్ల దూరంలో ఉంచి.. ఒకదాన్ని చల్లబరిచి.. మరో దాన్ని వేడి చేశారు. దీంతో ఉష్ణం వెలువడి.. దాని నుంచి విద్యుత్ తయారైంది. సిలికాన్ చిప్‌ల మధ్య ఎంత దూరం తక్కువగా ఉంటే.. అంత ఎక్కువగా విద్యుత్ ఉత్పత్తి చేయొచ్చని పరిశోధనల్లో పాలుపంచుకున్న ప్రొఫెసర్ మాథ్యూ ఫ్రాంకోయెర్ పేర్కొన్నారు. ఈ సాంకేతికతతో భవిష్యత్తులో ఎలక్ట్రానిక్ వస్తువులు వేడి కావడాన్ని తగ్గించొచ్చు. వాటి బ్యాటరీ సామర్థ్యం కూడా మెరుగుపరచవచ్చు. సౌర ఫలకాల పనితీరు కూడా మెరుగుపరచవచ్చని, వాహనాల ఇంజిన్ నుంచి వెలువడే ఉష్ణ శక్తితో ఎలక్ట్రానిక్ వస్తువులు పనిచేసేలా, కంప్యూటర్లలో వాడే ప్రాసెసర్ల పని తీరు మెరుగుపర్చేలా దీన్ని వాడుకోవచ్చని పరిశోధకులు చెబుతున్నారు.

# జలుబు మంచిదే..!



ఇప్పటివరకు మందు కనిపెట్టని వ్యాధి ఏంటి అంటే చాలా మంది ఎయిడ్స్ అనో.. కేన్సర్.. ఎబోలా అనో చెబుతారు. కానీ అదేదో రుషి అనే సినిమాలో ఓ డాక్టర్ చెప్పే సమాధానం ఏంటో తెలుసా.. జలుబు..! నిజమే జలుబుకు ఇప్పటివరకు ఎలాంటి మందు కనిపెట్టలేదు. అందరూ అంటుంటారు కూడా.. జలుబు మందులు వేసుకుంటే వారంలో తగ్గుతుంది.. వేసుకోకపోతే ఏడు రోజుల్లో తగ్గుతుంది అని. అయితే ఇదంతా ఎందుకంటే జలుబు మంచిదే అంటున్నారు కొందరు పరిశోధకులు. అదెలా అంటే.. జలుబుకు కారణమయ్యే వైరస్.. మూత్రాశయ కేన్సర్‌ను తగ్గిస్తుందట. కేన్సర్ కణాలకు ఈ వైరస్ సోకి వాటిని చంపేస్తుందట. బ్రిటన్‌లోని యూనివర్సిటీ ఆఫ్ సర్రేకు చెందిన పరిశోధకులు ఈ విషయాన్ని చెబుతున్నారు. ఈ పరిశోధనల ద్వారా మూత్రాశయ కేన్సర్‌కు సరికొత్త చికిత్స అందుబాటులోకి రానుందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కాక్స్‌సాకీవైరస్ (సీవీఏ21) మూత్రాశయ కేన్సర్ సోకిన 15 మందికి కణతులను తొలగించే శస్త్రచికిత్సకు వారం రోజుల ముందు మూత్రాశయంలోకి ఎక్కించారు. శస్త్రచికిత్స చేసిన తర్వాత కేన్సర్ కణాలను పరిశీలిస్తే ఆశ్చర్యకరమైన ఫలితాలు వచ్చాయి. ఈ వైరస్ కేన్సర్ కణాలకు సోకి వాటిని నాశనం చేశాయని పరిశోధకులు పేర్కొన్నారు. ఒక్కరిలో కేన్సర్ కణాలు పూర్తిగా అదృశ్యమయ్యాయని చెబుతున్నారు. మరో 14 మందిలో కేన్సర్ కణాలు చనిపోతున్నట్లు తేలింది. బ్రిటన్‌లో మూత్రాశయ కేన్సర్ ఏటా 10 వేల మందికి సోకుతుందట. అయితే దీని చికిత్సకు వాడే మందుల వల్ల చాలా సైడ్ ఎఫెక్ట్‌లు వస్తాయట.

## మున్సిపోల్స్‌పై నేడు కాంగ్రెస్ కసరత్తు

### 33 జిల్లాల నేతలతో టీపీసీసీ ముఖ్యుల సమావేశం

**సాక్షి, హైదరాబాద్:** కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఎన్నికల కసరత్తు ముమ్మరం చేసింది. ఇప్పటికే జిల్లా, మున్సిపాలిటీల స్థాయిలో ఒకటికి రెండు సార్లు సన్నాహక సమావేశాలు నిర్వహించుకున్న ఆ పార్టీ రాష్ట్ర స్థాయి సమీక్షను ఆదివారం చేయనుంది. సంగారెడ్డి జిల్లా కేంద్రంలో జరగనున్న ఈ సమీక్ష సమావేశాల్లో జిల్లాలు, మున్సిపాలిటీల వారీగా అనుసరించాల్సిన వ్యూహాలు, పొత్తులపై చర్చించనుంది. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 వరకు సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట, రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, గద్వాల్ జిల్లాల సమావేశం, మధ్యాహ్నం 1 నుంచి 3.30 వరకు ఆసిఫాబాద్, మంచిర్యాల, ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి, జగిత్యాల, పెద్దపల్లి, కరీంనగర్, సిరిసిల్ల జిల్లాలలో, మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం 6 వరకు సూర్యాపేట, నల్లగొండ, యాదాద్రి భువనగిరి, జనగాం, మహబూబాబాద్, వరంగల్ రూరల్, ములుగు, భూపాలపల్లి, కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల సమీక్ష సమావేశాలు జరుగుతాయని టీపీసీసీ వర్గాలు వెల్లడించాయి. ఈ సమావేశంలో డీసీసీ అధ్యక్షులు, మున్సిపల్ అధ్యక్షులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తదితరులు పాల్గొననున్నారు.

## మున్సిపల్ చట్టం అధ్వానంగా ఉంది

### మాజీ ఎమ్మెల్యే కోదండరెడ్డి



**సాక్షి, హైదరాబాద్:** మున్సిపల్ చట్టం లోపభూయిష్టంగా, అధ్వానంగా ఉందని మాజీ ఎమ్మెల్యే, హుడా మాజీ చైర్మన్ ఎం. కోదండరెడ్డి విమర్శించారు. శనివారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఇప్పటికే కలెక్టర్లపై చాలా పని ఒత్తిడి ఉందని, అదనంగా మున్సిపాలిటీల బాధ్యతలు వారిపై ఉంచడం సమంజసం కాదని వ్యాఖ్యానించారు. చట్టంలో ఎక్కడా హెచ్ఎండీఏ ప్రస్తావన లేదని, మాస్టర్ ప్లాన్ మాటే రాలేదన్నారు.

## 'బీసీలకు 53 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలి'

**సాక్షి, హైదరాబాద్:** కొత్తగా తీసుకొచ్చిన మున్సిపల్ చట్టంతో బీసీలపై రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న శ్రద్ధ ఏమిటో స్పష్టమైందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ విమర్శించారు. బీసీ రిజర్వేషన్లు తగ్గించి వారిని రాజకీయంగా ఎదగకుండా చేస్తున్నారని శనివారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే ఆధారంగా బీసీ రిజర్వేషన్లు అమలు చేయవచ్చని, కానీ ప్రభుత్వానికి బీసీల పట్ల చిత్తశుద్ధి లేదన్నారు. పట్టణ ప్రాంతాల్లో బీసీ జనాభా 53 శాతంగా ఉందని, ఆ మేరకు బీసీ రిజర్వేషన్లు అమలు చేస్తే ఇబ్బంది ఉండదని, దీనికి న్యాయస్థానం కూడా సమ్మతిస్తుందని పేర్కొన్నారు.

## ఆర్టీసీని పరిరక్షించండి: నాగేశ్వరరావు

**సాక్షి, హైదరాబాద్:** చరిత్రలో ఎన్నడూ లేనంత దయనీయంగా మారిన రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థను ప్రభుత్వం పట్టించుకుని బాగు చేయాలని ఆర్టీసీ బోర్డు మాజీ డైరెక్టర్, సీనియర్ కార్మిక నాయకుడు నాగేశ్వరరావు సీఎం కేసీఆర్‌ను కోరారు. ఐదేళ్ల కాలంలో సంస్థ రూ.3,500 కోట్ల నష్టాలను మూటగట్టుకుందని, మూడేళ్ల కాలంలో రూ.700 కోట్ల మేర డీజిల్ భారం పెరిగిందని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 14 నెలలుగా పూర్తిస్థాయి ఎండీ లేనందున జవాబుదారీ తనం లోపించి సంస్థ తీవ్ర గందరగోళంలో పడిపోయిందని పేర్కొన్నారు. ఇలాగేఉంటే పునరుద్ధరణకు వీలుకానంతగా సంస్థ నష్టపోతుందన్నారు.

## వారసత్వ భవనాలు కూల్చడమేమిటి?

### సర్కార్‌పై మాజీ ఎంపీ విజయశాంతి ఆగ్రహం



**సాక్షి, హైదరాబాద్:** కొత్త మున్సిపల్ చట్టం ద్వారా అక్రమ కట్టడాలు కూలుస్తామని చెబుతున్న రాష్ట్ర ప్రభుత్వం ఎర్రమంజిల్ గెస్ట్‌హౌజ్ భవనం వారసత్వ సంపదని తెలిసి కూడా కూలగొట్టడంలో ఆంతర్యమేమిటని మాజీ ఎంపీ విజయశాంతి ప్రశ్నించారు. ఏది సక్రమమో, ఏది అక్రమమో, ఏ భవనం కూలగొట్టాలో, దేన్ని కూలగొట్టకూడదో అర్థం కాని పరిస్థితుల్లో ప్రభుత్వం పనిచేస్తోందని శనివారం ఓ ప్రకటనలో ఆమె ఎద్దేవా చేశారు. అసెంబ్లీలో ఆగస్టు 15 నుంచి అసలైన పాలన మొదలవుతుందన్న సీఎం కేసీఆర్, ఇన్నాళ్లూ తెలంగాణలో సరైన పాలన జరపలేదన్నది స్పష్టంగా తెలుస్తోందని విమర్శించారు. మూడేళ్లలో అద్భుతం జరగబోతోందని కేసీఆర్ అంటుంటే మరోపక్క మూడేళ్ల తర్వాత అద్భుతం జరుగుతుందని బీజేపీ నేతలు చెబుతున్నారన్నారు.

## ప్రియాంక అరెస్టుకు నిరసనగా ఆందోళన

**సాక్షి, హైదరాబాద్:** ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ అరెస్టును నిరసిస్తూ యూత్ కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్ నేతలు ఆందోళన నిర్వహించారు. శుక్రవారం గాంధీభవన్ ఎదుట ఆందోళనకు దిగిన యూత్ కాంగ్రెస్ నాయకులు యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఆయన దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఆ తర్వాత మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో కూడా యోగి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమాల్లో ఏఐసీసీ కార్యదర్శి బోసురాజు, కాంగ్రెస్ సీనియర్ నేత కోదండరెడ్డి, యూత్, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు అనిల్‌కుమార్ యాదవ్, నేరెళ్ల శారద తదితరులు పాల్గొన్నారు.

## 'రిజర్వేషన్లపై సుప్రీంలో పోరాటం'



**హైదరాబాద్:** బీసీ, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లపై 50 శాతం సీలింగ్ విధిస్తూ మున్సిపల్, పంచాయతీ రాజ్ చట్టాలపై రాష్ట్ర ప్రభుత్వం చేసిన సవరణలను సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో కేసు వేసి పోరాడతామని బీసీ సంక్షేమ సంఘం నేత ఆర్.కృష్ణయ్య తెలిపారు. శనివారం బీసీ భవన్‌లో జరిగిన కోర్ కమిటీ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. దీనికోసం త్వరలో న్యాయవాదులను కూడా కలుస్తామని చెప్పారు. మున్సిపల్ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను తగ్గిస్తూ అసెంబ్లీలో చట్టం చేస్తుంటే టీఆర్ఎస్ పార్టీలో ఉన్న ఎమ్మెల్యేలు, మంత్రులు నోరు మెదపకుండా కూర్చోవడం సిగ్గుచేటన్నారు.

## షీలా దీక్షిత్ మృతి పట్ల కేసీఆర్ సంతాపం

**సాక్షి, హైదరాబాద్:** కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి షీలా దీక్షిత్ మృతి పట్ల సీఎం కేసీఆర్ సంతాపం వ్యక్తం చేశారు. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

## పార్టీకి ఆమె లేని లోటు తీరనిది: టీపీసీసీ

**సాక్షి, హైదరాబాద్:** ఢిల్లీ మాజీ సీఎం షీలా దీక్షిత్ మృతి పట్ల టీపీసీసీ నేతలు సంతాపం వ్యక్తం చేశారు. టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, కేంద్ర మాజీ మంత్రి జైపాల్‌రెడ్డి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ పొన్నం ప్రభాకర్, మల్లురవి వేర్వేరు ప్రకటనల్లో తమ సంతాపాన్ని తెలియజేశారు. షీలా దీక్షిత్ మృతి తమ పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు.



## ఎన్నాళ్లీ కావడి కష్టాలు..

అధునాతన పరిజ్ఞానం ఎంత వృద్ధి చెందినా.. ప్రభుత్వాలు ఎన్ని మారినా.. ఏజెన్సీ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు లేక గిరిజనులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు, రవాణా సౌకర్యం లేక.. రోగమొస్తే కావడిపై మోసుకెళ్లే దృశ్యాలు ఇంకా కనిపిస్తూనే ఉన్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం రాళ్లాపురం గ్రామానికి చెందిన ముసికి సోమడ (60) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. శనివారం ఆరోగ్యం విషమించి ప్రాణాపాయస్థితిలోకి చేరుకున్నాడు. రవాణా సదుపాయం లేకపోవడంతో అతడిని కావడిలో పడుకోబెట్టి నాలుగు కిలోమీటర్ల దూరంలోని తాలిపేరు ప్రాజెక్టు వద్దకు మోసుకొచ్చారు. అక్కడి నుంచి అంబులెన్స్‌లో చర్ల ప్రభుత్వాస్పత్రికి, అక్కడి నుంచి భద్రాచలం ఏరియా వైద్యశాలలో చేర్పించారు. ప్రస్తుతం సోమడ ఆరోగ్యం కొంత మెరుగైందని కుటుంబ సభ్యులు తెలిపారు. – చర్ల



## పురిటిపాట్లు

పురిటి నొప్పులతో బాధపడుతున్న ఓ గిరిజన మహిళ ప్రసూతి కోసం ఆస్పత్రికి వెళ్లేందుకు అష్టకష్టాలు పడింది. ములుగు జిల్లా సమ్మక్క–సారలమ్మ తాడ్వాయి మండలం బయ్యక్కపేట సమీప అటవీ ప్రాంతంలోని నీలతోగు గొత్తికోయగూడెంకు చెందిన ఎట్టి విజ్జి శనివారం పురిటి నొప్పులతో బాధపడుతుండగా.. కొడిశాల పీహెచ్‌సీ ఎఎన్ఎం ఆదిలక్ష్మి, ఆశ వర్కర్ పార్వతి ఆమెకు తాత్కాలికంగా వైద్యం అందించారు. ప్రసవం కోసం ఆస్పత్రికి తీసుకెళ్లాలని చెప్పగా గూడెంకు 108 వాహనం వచ్చేందుకు రోడ్డు సౌకర్యం లేకపోవడంతో మంచాన్ని కావడిగా కట్టి విజ్జిని అందులో పడుకోబెట్టి గూడెం వాసులు 7 కిలోమీటర్లు కాలినడకన బయ్యక్కపేట వరకు మోసుకొచ్చారు. అక్కడి నుంచి 108 వాహనంలో ములుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తమకు ఇంకెన్నాళ్లు ఈ కావడి కష్టాలు అని గిరిజనులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. – ఎస్ఎస్ తాడ్వాయి

# స్పెషలిస్ట్ వైద్యులపై వేటు

- అనధికారికంగా గైర్హాజరవడంతో 72 మంది తొలగింపు
- షోకాజ్ నోటీసులకు బదులివ్వకపోవడంతో సర్కారు చర్యలు
- ఇప్పటికే ఉత్తర్వులు జారీ! వైద్యవిధాన పరిషత్‌లో సంచలనం
- ప్రభుత్వ చర్యతో రోగులకే నష్టమంటున్న వైద్య సంఘాల నేతలు



**సాక్షి, హైదరాబాద్:** గత కొంతకాలంగా అనధికారికంగా విధులకు గైర్హాజరవుతున్న 72 మంది స్పెషలిస్టు వైద్యులపై రాష్ట్ర ప్రభుత్వం కొరడా ఝుళిపించింది. షోకాజ్ నోటీసులు జారీ చేసినా వారు స్పందించకపోవడంతో ఉద్యోగాల నుంచి శాశ్వతంగా తొలగించింది. ఈ మేరకు ఉత్తర్వులు కూడా జారీ చేసినట్లు వైద్య ఆరోగ్యశాఖ వర్గాలు తెలిపాయి. ఈ వ్యవహారం ఇప్పుడు వైద్య ఆరోగ్యశాఖలో పెను సంచలనం రేపుతోంది. గతేడాదే 128 మంది స్పెషలిస్టు వైద్యులు దూరాభారం అంటూ ఉద్యోగాలు వదులుకోగా తాజాగా 72 మందిని ప్రభుత్వం ఇంటికి పంపించింది. స్పెషలిస్టు వైద్యులు ఇప్పటికే ఏదో ఒక చోట ప్రైవేటు ప్రాక్టీసుతో బిజీగా ఉన్నారు. కాబట్టి వారిలో ఏమాత్రం చింత లేదని, సర్కారు చర్య వల్ల ఆసుపత్రులకు వచ్చే రోగులకే నష్టమని కొందరు వైద్య సంఘాల నేతలు వ్యాఖ్యానిస్తున్నారు. వైద్య విధాన పరిషత్ అధికారుల నిర్ణయం వల్ల భవిష్యత్తులో స్పెషలిస్టు వైద్యులు ఉద్యోగం చేయడానికి ముందుకురారని, ఈ నిర్ణయం వైద్యులను భయభ్రాంతులకు గురిచేసిందని నాయకులు అభిప్రాయపడుతున్నారు.

### గెజిట్ ద్వారా షోకాజ్ నోటీసులు ఇచ్చి...

రాష్ట్రంలోని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రులు, ఏరియా ఆసుపత్రులు, సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో ఇప్పటికే స్పెషలిస్టు వైద్యుల్లేక గ్రామీణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్, రేడియాలజీ, డెర్మటాలజీ, ఫోరెన్సిక్, హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్, పల్మనరీ, ఆప్తాల్మాలజీ, సైకియాట్రిక్, అనస్తీషియా, ఈఎన్‌టీ, పాథాలజీ, జనరల్ సర్జన్స్, ఓబీజీ, పీడియాట్రిక్స్ వైద్యుల్లేక ఆయా ఆసుపత్రులు కునారిల్లుతున్నాయి. వైద్య విధాన పరిషత్ ఆధ్వర్యంలో 125 ఆసుపత్రులుంటే అందులో 31 జిల్లా ఆసుపత్రులు, 22 ఏరియా ఆసుపత్రులు, 58 సామాజిక ఆరోగ్య కేంద్రాలు, 14 ఫస్ట్ రిఫరల్ యూనిట్లు (హైదరాబాద్‌లో) ఉన్నాయి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో (పీహెచ్‌సీ) నయంకాని రోగులు జిల్లా ఆసుపత్రులకు స్పెషలిస్టు వైద్యులకు చూపించుకోవడం కోసం వస్తుంటారు. దీంతో స్పెషలిస్టుల కొరతను అధిగమించేందుకు సర్కారు గతేడాది టీఎస్‌పీఎస్సీ, తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఆధ్వర్యంలో 919 మంది స్పెషలిస్టు వైద్యులను నియమించింది. అయితే పోస్టింగ్‌లు తమకు అనుకూలమైన ప్రాంతాల్లో ఇవ్వలేదని, భార్యాభర్తలకు ఒకచోట పోస్టింగ్‌లు రాలేదనే కారణాలతో చాలా మంది విధులకు వెళ్లడం మానేశారు. కొందరికి అప్పటికే ప్రైవేటు ప్రాక్టీసులు ఉండటంతో సుదూర ప్రాంతాలకు వెళ్లడానికి విముఖత చూపారు. అధికారుల తనిఖీల్లో 91 మంది అనధికారికంగా గైర్హాజరయ్యారని తేలింది. దీంతో వారందరికీ ప్రభుత్వ గెజిట్ ద్వారానే షోకాజ్ నోటీసులు జారీ చేశారు. షోకాజ్ నోటీసులపై వివరణకు గడువు ముగియడంతో తొలగింపు ఉత్తర్వులు జారీ చేసినట్లు వైద్య విధాన పరిషత్ కమిషనర్ కార్యాలయ వర్గాలు వివరించాయి.

# రాష్ట్రాన్ని ముంచెత్తిన వర్షాలు

- ఈ సీజన్‌లోనే అత్యధికంగా వర్షపాతం నమోదు
- కామారెడ్డి, తాడ్వాయిల్లో ఏకంగా 14 సెంటీమీటర్లు నమోదు
- నేడు రేపు పలుచోట్ల భారీ వర్షాలు

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో రుతుపవనాలు ఊపందుకున్నాయి. పశ్చిమ మధ్య బంగాళాఖాతం, దాన్ని ఆనుకుని ఉన్న వాయువ్య బంగాళాఖాతం, ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా తీర ప్రాంతాలలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం దక్షిణ ఛత్తీస్‌గఢ్, దాని పరిసర ప్రాంతాలలో కొనసాగుతోంది. ఇది ఎత్తుకు వెళ్లేకొద్దీ నైరుతి వైపునకు వంపు తిరిగి ఉంది. మరోవైపు ఆగ్నేయ బంగాళాఖాతం దాన్ని ఆనుకుని ఉన్న దక్షిణ అండమాన్ సముద్ర ప్రాంతాలలో ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. దీంతో రాష్ట్రంలో వర్షాలు ముంచెత్తుతున్నాయి. ఈ సీజన్‌లోనే అత్యధికంగా అనేకచోట్ల అధిక వర్షపాతం నమోదైంది. గత 24 గంటల్లో కామారెడ్డి, తాడ్వాయిల్లో ఏకంగా 14 సెంటీమీటర్ల వంతున అతి భారీ వర్షపాతం నమోదైంది. నిజామాబాద్ జిల్లా బోధన్, ధర్పల్లి, కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి, మెదక్ జిల్లా పాపన్నపేటల్లో 13 సెంటీమీటర్ల వంతున వర్షపాతం రికార్డు అయింది. రంజల్, జైనూర్, నవీపేట్‌లలో 12 సెంటీమీటర్ల చొప్పున నమోదైంది. నాగారెడ్డిపేటలో 11, నిజాంసాగర్, భీంగల్, మక్లూర్, లింగంపేట, ఘన్‌పూర్, నారాయణఖేడ్‌లలో 9 సెంటీమీటర్లు, భీమదేవరపల్లి, వేములవాడ, ఆర్మూర్, పిట్లం, సదాశివనగర్, నందిపేటలో 8 సెంటీమీటర్లు, వేల్పూరు, జక్రాన్‌పల్లి, మిర్యాలగూడ, ఉట్నూరు, నిజామాబాద్, దోమకొండ, వర్ని, గంభీరావుపేట, మేడ్చల్, మోర్తాడ్, మెదక్, లక్ష్మణ్‌చంద, తల్లాడకోటగిరి, ముధోల్‌లలో 7 సెంటీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది. అలాగే కరీంనగర్, నిర్మల్, నాగర్‌కర్నూల్, భువనగిరి, జగిత్యాల, వరంగల్ అర్బన్, సిద్దిపేట, రాజన్న సిరిసిల్ల, సంగారెడ్డి, నల్లగొండ, కొమురంభీం, సూర్యాపేట, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మంచిర్యాల, రంగారెడ్డి, జయశంకర్ భూపాలపల్లి, వరంగల్ రూరల్, ఆదిలాబాద్, వికారాబాద్, గద్వాల, పెద్దపల్లి, మహబూబాబాద్, హైదరాబాద్ జిల్లాల్లోనూ వర్షాలు కురిశాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఇదిలావుంటే ఆది, సోమవారాల్లో రాష్ట్రంలో పలుచోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొంది. తాజా వర్షాలతో రైతుల్లో ఆనందోత్సాహాలు రేకెత్తుతున్నాయి. రుతుపవన ద్రోణి హిమాలయాల నుంచి తెలంగాణ వైపు వచ్చే పరిస్థితి నెలకొంది. దీంతో రానున్న రోజుల్లో భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు చెబుతున్నారు. ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదవుతుందని తెలిపింది.

## రోడ్డు ప్రమాద బాధితులకు సత్వర న్యాయం

### హైకోర్టుకు డీజీపీ నివేదన

**సాక్షి, హైదరాబాద్:** రోడ్డు ప్రమాద బాధితులకు సత్వర న్యాయం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని హైకోర్టుకు తెలంగాణ డీజీపీ తెలియజేశారు. ప్రమాద సమాచార నివేదిక (ఏఐఆర్) ఇతర వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపర్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. క్రైం అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ సిస్టం ద్వారా మొత్తం వివరాల్ని అప్‌లోడ్ చేయడం ప్రారంభమైతే సుప్రీం మార్గదర్శకాల్ని పూర్తిస్థాయిలో అమలు చేసే ప్రయత్నాల్లో రాష్ట్రం ఉందన్నారు. మోటారు వాహన చట్టంలోని సెక్షన్ 158(6) అమలును సుప్రీం విచారించిన నేపథ్యంలో రాష్ట్రంలోని పరిస్థితులపై హైకోర్టు సుమోటోగా విచారణ జరుపుతోంది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, న్యాయమూర్తి జస్టిస్ షమీమ్ అక్తర్‌ల ధర్మాసనం ఇచ్చిన గత ఆదేశాల మేరకు ప్రభుత్వ న్యాయవాది పైవివరాల్ని ఇటీవల తెలిపారు. నెట్‌వర్క్ సిస్టం ఏర్పాటును హైకోర్టు అభినందించడంతోపాటు దాన్ని ఎప్పటిలోగా అమల్లోకి తెస్తారో చెప్పాలని కోరింది. గత ఆరు నెలల్లో రాష్ట్రంలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 3,795 మంది దుర్మరణం చెందారని, 10,980 మంది గాయాలపాలయ్యారని, అత్యధికంగా రాచకొండ కమిషనరేట్ పరిధిలో 422 మంది మరణించారని చెప్పారు.

## సర్పంచ్, ఉప సర్పంచ్‌లకు చెక్‌పవర్

- వీటితోనే పంచాయతీ నిధుల వినియోగం
- 14వ ఆర్థిక సంఘం నిధులకూ ఇదే వర్తింపు
- డీపీఆర్ శాఖ ఆదేశాలు





**సాక్షి, హైదరాబాద్:** సర్పంచ్, ఉప సర్పంచ్‌ల ఉమ్మడి సంతకాలతోనే గ్రామాభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన అన్నిరకాల నిధులను వినియోగించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. 14వ ఆర్థిక సంఘం నిధులతో సహా అన్నింటికి ఇదే వర్తిస్తుందని స్పష్టం చేసింది. ఈ ఆదేశాలను తు.చ తప్పకుండా పాటించేలా అన్ని గ్రామపంచాయతీల్లో చర్యలు తీసుకునేలా స్పష్టమైన ఉత్తర్వులు జారీచేయాలని జిల్లా పంచాయతీ అధికారుల (డీపీవో)ను పంచాయతీరాజ్ కమిషనర్ నీతూ కుమారీ ప్రసాద్ ఆదేశించారు. వీటిని అమలుచేయడంలో విఫలమైతే తీవ్రంగా పరిగణించడంతోపాటు ఉల్లంఘించే వారిపై నిబంధనలకు అనుగుణంగా క్రమశిక్షణ చర్యలు తీసుకోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. శనివారం ఈ మేరకు డీపీవోలకు పీఆర్ కమిషనర్ మెమో పంపించారు. 14వ ఆర్థిక సంఘం గ్రాంట్ల వినియోగం విషయంలో పబ్లిక్ ఫైనాన్స్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (పీఎఫ్ఎంఎస్)ను ఉపయోగించాలని, ఇందులో భాగంగా సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి డిజిటల్ సర్టిఫికెట్ (డీఎస్) తీసుకోవాలని గతంలో కేంద్ర ప్రభుత్వం ఆదేశించిన నేపథ్యంలో పీఆర్‌శాఖ వివరణనిచ్చింది. రాష్ట్రంలో కొత్త పంచాయతీరాజ్ చట్టానికి అనుగుణంగా గ్రామపంచాయతీ నిధుల వినియోగానికి సర్పంచ్, ఉపసర్పంచ్ ఉమ్మడి సంతకాలతో ఉన్న చెక్కులు జారీచేయాలన్న ఆదేశాలతో గత నెల (జూన్)19న పీఆర్‌శాఖ మరో మెమో జారీచేసింది. ఈ నేపథ్యంలో 14వ ఆర్థిక సంఘం నిధులకు సంబంధించి పీఎఫ్ఎంఎస్ ఉపయోగించాలని కేంద్రం పట్టుబడుతున్నందున నిధుల నిర్వహణ ప్రక్రియకు సంబంధించి స్పష్టతనివ్వాలని కేంద్రానికి లేఖ రాసినట్టు పీఆర్ కమిషనర్ నీతూ ప్రసాద్ ఈ మెమోలో తెలిపారు. అందువల్ల సర్పంచ్, ఉప సర్పంచ్ ఉమ్మడి సంతకాలతోనే గ్రామ పంచాయతీ నిధులతో సహా, 14 వ ఆర్థిక సంఘం నిధుల వినియోగం చేపట్టేలా స్పష్టమైన ఉత్తర్వులివ్వాలని డీపీవోలను పీఆర్ కమిషనర్ ఆదేశించారు.

# ఈడబ్ల్యూఎస్ మెడికల్ సీట్లకు కౌన్సెలింగ్

- మూడో విడత కౌన్సెలింగ్‌తో పాటు నిర్వహించాలని నిర్ణయం
- కేవలం ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లోని 190 సీట్ల భర్తీకే పరిమితం
- ప్రైవేటులో ఈడబ్ల్యూఎస్‌కు ఎంసీఐ నిరాకరణతో పుంజుకున్న వేగం



**సాక్షి, హైదరాబాద్:** ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో అగ్రవర్ణ పేదలకు కేటాయించిన సీట్లకు కౌన్సెలింగ్ నిర్వహించాలని కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం శనివారం నిర్ణయించింది. మూడో విడత కన్వీనర్ కోటా సీట్లతో పాటే వీటికి కౌన్సెలింగ్ నిర్వహించాలని సూత్రప్రాయంగా నిర్ణయించింది. దీంతో ఇన్నాళ్లుగా అగ్రవర్ణ పేదల రిజర్వేషన్ల అమలుపై నెలకొన్న ఉత్కంఠకు తెరపడిందని ఆరోగ్య విశ్వవిద్యాలయం వర్గాలు చెబుతున్నాయి. వాస్తవంగా ప్రభుత్వంలోని సీట్లు, ప్రైవేటు మెడికల్ కాలేజీల్లోని కన్వీనర్ కోటా సీట్లకు మొదటి విడత కౌన్సెలింగ్‌తోపాటే అగ్రవర్ణ పేదల (ఈడబ్ల్యూఎస్)కు రిజర్వేషన్ అమలుచేయాల్సి ఉంది. ఆ మేరకు ఏర్పాట్లు కూడా జరిగాయి. అప్పటికే ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో ఈడబ్ల్యూఎస్ కోటా కింద మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎంసీఐ) 190 సీట్లు అదనంగా కేటాయించింది. అంతలోనే ప్రైవేటు మెడికల్ కాలేజీల్లోని కన్వీనర్ కోటా సీట్లకు కూడా ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు అమలు చేయాలని, ఆ మేరకు సంబంధిత కాలేజీలు అదనపు సీట్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎంసీఐ ఆదేశించింది. దీంతో రాష్ట్రంలో 10 ప్రైవేటు మెడికల్ కాలేజీలు ఈడబ్ల్యూఎస్ సీట్ల కోసం దరఖాస్తు చేసుకున్నాయి. కాలం గడుస్తున్నా ప్రైవేటు కాలేజీల్లో ఈడబ్ల్యూఎస్ కోటా సీట్లపై ఎంసీఐ స్పష్టత ఇవ్వలేదు. అయితే అప్పటికే వైద్య విద్య ప్రవేశాల గడువు ఆలస్యమైంది. అందువల్ల ప్రభుత్వంలోని ఈడబ్ల్యూఎస్ సీట్లను కూడా పక్కనపెట్టి, మిగిలిన కన్వీనర్ కోటా సీట్లకు ఆరోగ్య విశ్వవిద్యాలయం కౌన్సెలింగ్ ప్రక్రియ చేపట్టింది. ఇప్పటికే రెండు విడతల కౌన్సెలింగ్ పూర్తయింది. ఇప్పుడు ప్రైవేటు మేనేజ్‌మెంట్ కోటా సీట్లకు కౌన్సెలింగ్ ప్రక్రియ నడుస్తోంది. ఇంత జరిగినా ఎంసీఐ నుంచి ప్రైవేటు మెడికల్ సీట్లలో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లే అమలు, సీట్ల కేటాయింపుపై స్పష్టత రాలేదు. వస్తాయన్న నమ్మకం లేకపోయినా ఎందుకైనా మంచిదని ఆరోగ్య విశ్వవిద్యాలయం ఇప్పటివరకు వేచిచూసింది. అయితే తాజాగా శుక్రవారం శాసనమండలిలో సభ్యులు ఈడబ్ల్యూఎస్ కోటాపై ప్రశ్న సందర్భంగా వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల అమలుకు ఎంసీఐ అదనపు సీట్లకు అనుమతి ఇవ్వలేదని స్పష్టం చేశారు. ఈ ప్రకటనతో ఆరోగ్య విశ్వవిద్యాలయం ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లోని 190 సీట్లకు మూడో విడత కన్వీనర్ కోటా సీట్లతో కలిపి కౌన్సెలింగ్ నిర్వహించాలని నిర్ణయించినట్లు విశ్వవిద్యాలయం వర్గాలు తెలిపాయి. ఆగస్టు మొదటి వారంలో వీటికి కౌన్సెలింగ్ నిర్వహిస్తామని విశ్వవిద్యాలయానికి చెందిన ఒక ఉన్నతాధికారి తెలిపారు.

### ఆగస్టు 1 నుంచి తరగతులు..

ఆగస్టు 1 నుంచి ఎంబీబీఎస్, బీడీఎస్ తరగతులు ప్రారంభమవుతాయని ఆరోగ్య విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ డాక్టర్ కరుణాకర్‌రెడ్డి తెలిపారు. ఆ తేదీ లోపే కన్వీనర్ కోటా కింద చాలా సీట్లు భర్తీ అవుతాయని, మేనేజ్‌మెంట్ కోటాలోని బీ, సీ కేటగిరీ సీట్లు కూడా చాలావరకు భర్తీ అవుతాయని ఆయన పేర్కొన్నారు. ఒక అంచనా ప్రకారం 90 శాతం సీట్లల్లో విద్యార్థులు చేరతారన్నారు. మూడో విడత కన్వీనర్ కోటా సీట్లకు మొదటి వారంలో కౌన్సెలింగ్ జరుగుతుందని చెప్పారు. అప్పుడు జాతీయ స్థాయి కోటాకు తెలంగాణ ప్రభుత్వ మెడికల్ కాలేజీల నుంచి కేటాయించిన 15 శాతం సీట్లల్లో కొన్ని మిగిలిపోయాయని, అవి మూడో విడత కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేస్తామని తెలిపారు. వాటితోపాటు ప్రభుత్వంలోని ఈడబ్ల్యూఎస్ కోటా సీట్లకు కూడా అప్పుడే కౌన్సెలింగ్ నిర్వహిస్తామని పేర్కొన్నారు.

# షీలా దీక్షిత్ కన్నుమూత

- గుండెపోటుతో మృతిచెందిన కాంగ్రెస్ సీనియర్ నేత
- ఢిల్లీ సీఎంగా వరుసగా మూడుసార్లు పనిచేసిన ఘనత
- రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధాని సహా పలువురి సంతాపం





షీలా పార్థివదేహం వద్ద నివాళులర్పిస్తున్న ప్రధాని మోదీ, కాంగ్రెస్ నాయకురాలు సోనియా గాంధీ

**న్యూఢిల్లీ:** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, సుదీర్ఘ కాలం ఢిల్లీ సీఎంగా పనిచేసిన షీలా దీక్షిత్(81) గుండెపోటుతో కన్నుమూశారు. ఢిల్లీలోని ఫోర్టిస్ ఎస్కార్ట్స్ హార్ట్ ఇన్‌స్టిట్యూట్‌లో శనివారం మధ్యాహ్నం ఆమె తుదిశ్వాస విడిచారని వైద్యులు ప్రకటించారు. షీలా మృతికి రాష్ట్రపతి కోవింద్, ప్రధాని మోదీ, కాంగ్రెస్ నేత రాహుల్‌సహా పలువురు ప్రముఖులు సంతాపం ప్రకటించారు. షీలా భౌతిక కాయాన్ని ఈస్ట్ నిజాముద్దీన్ ప్రాంతంలో ఉన్న ఆమె నివాసంలో అభిమానుల సందర్శనార్థం ఉంచారు. అంత్యక్రియలు నిగమ్‌బోధ్ ఘాట్‌లో ఆదివారం ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించనున్నారు. ఢిల్లీ ప్రభుత్వం రెండు రోజులు సంతాప దినాలుగా ప్రకటించింది. షీలా దీక్షిత్ శనివారం ఉదయం తీవ్ర గుండెపోటుకు గురి కావడంతో కుటుంబసభ్యులు వెంటనే ఫోర్టిస్ ఇన్‌స్టిట్యూట్‌లో చేర్పించారు. ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ అశోక్ సేథ్ నేతృత్వంలోని వైద్య బృందం ఆమెకు అత్యాధునిక వైద్య చికిత్స అందించింది. దీంతో ఆమె ఆరోగ్య పరిస్థితి తాత్కాలికంగా కుదుటపడింది. కొద్ది సేపటి తర్వాత మరోసారి గుండెపోటు రావడంతో వైద్యులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు.

### ప్రముఖుల సంతాపం

ఢిల్లీ సీఎంగా షీలా నగర రూపురేఖలనే మార్చేశారని, ఆమె ప్రజల మదిలో కలకాలం గుర్తుండిపోతారని రాష్ట్రపతి కోవింద్ తన సంతాపం సందేశంలో పేర్కొన్నారు. షీలా మంచి పరిపాలనాదక్షురాలని ఉపరాష్ట్రపతి వెంకయ్య పేర్కొన్నారు. ఢిల్లీ అభివృద్ధిలో షీలా సేవలు శ్లాఘనీయమని ప్రధాని మోదీ అన్నారు. అనంతరం మోదీ షీలా నివాసానికి వెళ్లి పార్థివ దేహానికి నివాళులర్పించారు. షీలా మరణ వార్త తనను షాక్‌కు గురిచేసిందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. షీలా దీక్షిత్‌ను ఆయన..అత్యంత ఆత్మీయురాలు, కాంగ్రెస్ పార్టీ అభిమాన పుత్రికగా పేర్కొన్నారు. అంకితభావం కలిగిన ప్రజా నేతలను కాంగ్రెస్ కోల్పోయిందని మాజీ ప్రధాని మన్మోహన్ తన సందేశంలో పేర్కొన్నారు. ఢిల్లీ ప్రజలకు ఆమె మరణం తీరని నష్టమని, ఆమె సేవలను ప్రజలు కలకాలం గుర్తుంచుకుంటారని సీఎం కేజ్రీవాల్ పేర్కొన్నారు. షీలా దీక్షిత్ కుమార్తె, కుమారుడికి యూపీఏ చైర్‌పర్సన్ సోనియా గాంధీ రాసిన లేఖను కాంగ్రెస్ అధికార ప్రతినిధి రణ్‌దీప్ సూర్జేవాలా ట్విట్టర్‌లో ఉంచారు. 'మీ తల్లికి నా హృదయంలో గొప్ప స్థానముంది. నా భర్త రాజీవ్‌తో షీలాజీకి మంచి అనుబంధం ఉండేది. ఈ క్రమంలో ఆమెతో నాకూ స్నేహం ఏర్పడింది. షీలాజీకి ఉన్న అనేక సుగుణాలను నేను అభిమానించడం ప్రారంభించాను. ఆమె ఢిల్లీ ముఖ్యమంత్రిగా, డీపీసీసీ చీఫ్‌గా, ఇందిరాగాంధీ మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్‌గా ఉన్నకాలంలో ఎలాంటి అరమరికలు లేకుండా కలిసి పనిచేశాం' అని సోనియా పేర్కొన్నారు.

### సమర్థురాలైన పాలకురాలు: ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

**సాక్షి, అమరావతి:** సీనియర్ రాజకీయవేత్త, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి షీలా దీక్షిత్ మృతి పట్ల ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. విషాదంలో మునిగి ఉన్న ఆమె కుటుంబీకులకు ఆయన తన ప్రగాఢ సానుభూతిని తెలియ జేశారు. ఆమె మరణంతో దేశం ఒక సమర్థురాలైన పాలకురాలిని కోల్పోయిందని జగన్ తన సందేశంలో పేర్కొన్నారు. షీలా దీక్షిత్ పోరాట పటిమకు, సాహసానికి, చురుకుదనానికి పెట్టింది పేరని జగన్ కొనియాడారు.

### షీలా చివరి ఆదేశాలు

ఉత్తరప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ పర్యటనలో ప్రతిష్టంభన తొలగని పరిస్థితుల్లో ఢిల్లీలోని బీజేపీ ప్రధాన కార్యాలయం వద్ద శనివారం ఆందోళనకు దిగాలని పార్టీ కార్యకర్తలను షీలా దీక్షిత్ కోరినట్లు తెలుస్తోంది. యూపీలో పర్యటిస్తున్న ప్రియాంకను అక్కడి బీజేపీ ప్రభుత్వం నిర్బంధంలో ఉంచిన విషయం తెలిసిందే. శనివారం కూడా ఆమె నిర్బంధం కొనసాగినట్లయితే బీజేపీ ప్రధాన కార్యాలయం ఎదుట నిరసన తెలపాల్సిందిగా ఢిల్లీ కాంగ్రెస్ చీఫ్ హోదాలో షీలా దీక్షిత్ కార్యకర్తలకు శుక్రవారం ఆదేశాలిచ్చినట్లు సీనియర్ నేత ఒకరు తెలిపారు. అవసరమైతే ఆదివారం కూడా నిరసన కొనసాగించాలని కూడా ఆమె చిట్టచివరి ఆదేశాలు జారీ చేశారని పార్టీ నేత కిరణ్ వాలియా వివరించారు.



## హస్తిన హ్యాట్రిక్ విజేత

ఢిల్లీ పీఠాన్ని వరసగా మూడు సార్లు దక్కించుకున్న విజేత ఆమె. పదిహేనేళ్లపాటు ఢిల్లీని పరిపాలించి ఢిల్లీ రూపురేఖలను మార్చి నగరం స్థాయిని పెంచిన నాయకురాలు. ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రజల్ని భాగస్వామ్యుల్ని చేసే భాగిదాని వ్యవస్థను ప్రవేశపెట్టి మంచి పరిపాలనా దక్షురాలిగా తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకున్నారు.పెద్ద భవంతులు, ఫ్లై ఓవర్లు, ఢిల్లీ మెట్రో ఆమె హయాంలోనే వచ్చాయి.

### 81 ఏళ్ల వయసులోనూ అదే ఉత్సాహం

వయసుతో రాజకీయాలకు పని లేదని నిరూపిస్తూ ఇటీవల లోక్‌సభ ఎన్నికల్లో ఈశాన్య ఢిల్లీ నుంచి పోటీ పడుతూ కాంగ్రెస్ ప్రచారాన్ని ముందుండి నడిపించారు. బీజేపీ అభ్యర్థి మనోజ్ తివారీ చేతిలో ఓటమి పాలైనప్పటికీ 81 ఏళ్ల వయసులో ఆమెలో ఉన్న ఉరిమే ఉత్సాహం కాంగ్రెస్ కార్యకర్తల్లో ఉత్తేజాన్ని నింపింది. పంజాబ్‌లోని కపుర్తలాలో 1938, మార్చి 31వ తేదీన జన్మించారు. ఢిల్లీ యూనివర్సిటీ నుంచి ఫిలాసఫీలో డాక్టరేట్ సాధించారు. ఆమె భర్త దివంగత వినోద్ దీక్షిత్ ఐఏఎస్ అధికారి. వీరికి ఇద్దరు పిల్లలు. కొడుకు సందీప్ దీక్షిత్ కాంగ్రెస్ సభ్యుడే. కుమార్తె లతికా సయ్యద్.

### ఆసక్తికరం...షీలా ప్రేమాయణం!

ఢిల్లీ విశ్వద్యాలయంలో చరిత్ర చదివే సమయంలో షీలా కపూర్‌కు వినోద్ దీక్షిత్‌తో పరిచయమైంది. వినోద్ దీక్షిత్ కాంగ్రెస్ నేత ఉమా శంకర్ కొడుకు. వినోద్ చురుకైన వాడు, మంచి క్రికెటర్ అని షీలా తన ఆత్మకథలో రాశారు. ఇద్దరు మిత్రుల మధ్య ప్రేమ వ్యవహారంలో ఏర్పడిన వివాదంలో మధ్యవర్తిత్వం వహించిన షీలా, వినోద్ ఆతర్వాత దగ్గరయ్యారు. అయితే, తాను బ్రాహ్మణ కులస్తురాలు కాకపోవడంతో వినోద్ తల్లిదండ్రులు పెళ్లికి గట్టిగా అభ్యంతరం చెప్పారని పంజాబీ ఖత్రీ అయిన షీలా తెలిపారు. ఆతర్వాత వినోద్ సివిల్ సర్వీసెస్ పరీక్షలో ఆలిండియా స్థాయిలో 9వ ర్యాంకు సాధించడంతో తమ పెళ్లికి అడ్డుచెప్పలేదని షీలా పేర్కొన్నారు.

### అనూహ్యంగా రాజకీయ ప్రవేశం

షీలా మామ ఉమా శంకర్ స్వాతంత్ర్య పోరాటయోధుడు. తర్వాత ఆయన ఇందిర కేబినెట్‌లో మంత్రి అయ్యారు. ఆయన రాజకీయాల్లో ఎదగడానికి షీలా తెరవెనుక సహకారం అందించారు. ఇందిరాగాంధీని తరచూ కలిసేవారు. షీలాలోని పాలనా నైపుణ్యాన్ని గుర్తించిన ఇందిర ఆమెను ఐక్యరాజ్యసమితిలో మహిళా అంశంపై జరిగే సదస్సుకు భారత్ తరపున ప్రతినిధిగా పంపారు. అదే షీలా రాజకీయ జీవితానికి పునాది వేసింది. 1984–89 సంవత్సరాల మధ్య ఐక్యరాజ్య సమితిలో భారత్ రాయబారిగా సేవలు అందించారు. రాజీవ్ హయాంలో కేంద్ర మంత్రిగా పనిచేశారు. 1998 నుంచి వరసగా మూడు ఎన్నికల్లో ఢిల్లీ ముఖ్యమంత్రిగా ఎన్నికై తిరుగులేని నేతగా ఎదిగారు. 2014లో కేరళ గవర్నర్‌గా అయిదు నెలలు కొనసాగారు.

### వివాదాలు, పురస్కారాలు

జర్నలిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా బెస్ట్ చీఫ్ మినిస్టర్ అవార్డు, 2009లో బెస్ట్ పొలిటీషియన్ ఆఫ్ ది ఇయర్‌గా ఎన్డీటీవీ పురస్కారం, అసోచామ్ సంస్థ నుంచి ఢిల్లీ వుమెన్ ఆఫ్ ది డికేడ్ అచీవర్స్ అవార్డు వంటివి అందుకున్నారు. రూ.3.5 కోట్ల కేంద్ర నిధుల్ని ఆమె తన సొంత రాజకీయ ప్రకటనల కోసం ఖర్చు చేశారని బీజేపీ కోర్టుకెక్కింది. 2010లో ఢిల్లీలో కామన్‌వెల్త్ క్రీడల్లో వీధి దీపాల సామగ్రి కొనుగోలులో అవకతవకలు జరిగాయని కాగ్ వేలెత్తి చూపించింది.



## మహారాష్ట్రలో ఘోర రోడ్డు ప్రమాదం

**9 మంది విద్యార్థుల దుర్మరణం**

**పింప్రి:** మహారాష్ట్రలోని పుణే–సోలాపూర్ జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కారు–ట్రక్కు ఢీకొన్న ఘటనలో 9 మంది కాలేజీ విద్యార్థులు దుర్మరణం చెందారు. పుణే జిల్లా కదంవక్ వస్తీ సమీపంలో శుక్రవారం రాత్రి 1.30 గంటల సమయంలో ప్రమాదం చోటుచేసుకుంది. 'మృతులంతా 19 నుంచి 23 ఏళ్ల మధ్య వయసు వారే. వీరు పుణే జిల్లా యావత్మాల్‌కు చెందినవారు. శుక్రవారం ఉదయం రాయ్‌గఢ్ పర్యాటక ప్రాంతానికి వెళ్లారు. అక్కడ రోజంతా ఆహ్లాదంగా గడిపి వస్తుండగా అర్ధరాత్రి ప్రమాదం జరిగింది'అని సీనియర్ ఇన్‌స్పెక్టర్ సూరజ్ బండ్గార్ తెలిపారు. వారు ప్రయాణిస్తున్న కారు కదంవక్ వస్తీ సమీపంలో మితిమీరిన వేగంగా వెళ్తూ అదుపుతప్పి మొదట డివైడర్‌ను ఢీకొని తర్వాత ఎదురుగా వస్తున్న ట్రక్కులోకి దూసుకెళ్లిందని ఆయన వెల్లడించారు.

## నాలుగు రాష్ట్రాలకు కొత్త గవర్నర్లు

**బెంగాల్‌కు జగ్దీప్ ధంకర్.. యూపీకి ఆనందీబెన్ పటేల్**



ధంకర్



ఆనందీబెన్



రమేశ్ బైస్



లాల్జీ టాండన్

**న్యూఢిల్లీ:** కేంద్రం నాలుగు రాష్ట్రాలకు కొత్త గవర్నర్లను నియమించడంతోపాటు ఉత్తరప్రదేశ్, బిహార్ గవర్నర్లకు స్థానచలనం కలిగించింది. పశ్చిమ బెంగాల్ గవర్నర్‌గా మాజీ ఎంపీ, ప్రముఖ సుప్రీంకోర్టు న్యాయవాది జగ్దీప్ ధంకర్(68)ను నియమిస్తూ శనివారం రాష్ట్రపతి భవన్ ఒక సర్క్యులర్ జారీ చేసింది. వచ్చే వారం పదవీ విరమణ చేయనున్న కేసరీనాథ్ త్రిపాఠీ స్థానంలో ధంకర్ బాధ్యతలు చేపడతారని రాష్ట్రపతి భవన్ పేర్కొంది. బెంగాల్‌లో రాజకీయ ఆధిపత్యం కోసం బీజేపీ, మమతా బెనర్జీల మధ్య పోరు కొనసాగుతున్న సమయంలో ఈ నియామకం చేపట్టడం గమనార్హం. ధంకర్ 1990–91 సంవత్సరాల మధ్య పార్లమెంటరీ వ్యవహారాల సహాయ మంత్రిగా పనిచేశారు. 2003లో కాంగ్రెస్‌ను వీడి బీజేపీలో చేరి ఎంపీగా ఎన్నికయ్యారు. అలాగే, 2018 జనవరి నుంచి మధ్యప్రదేశ్ గవర్నర్‌గా పనిచేస్తున్న ఆనందీబెన్ పటేల్‌ను కీలక రాష్ట్రం ఉత్తరప్రదేశ్‌కు గవర్నర్‌గా నియమించింది. ఆనందీ బెన్ స్థానంలో బీజేపీ కురువృద్ధ నేత, బిహార్ గవర్నర్ లాల్జీ టాండన్‌ను మధ్యప్రదేశ్ గవర్నర్‌గా నియమించినట్లు రాష్ట్రపతి భవన్ పేర్కొంది. టాండన్ స్థానంలో బిహార్ గవర్నర్‌గా బీజేపీ సీనియర్ నేత ఫగు చౌహాన్ బాధ్యతలు చేపడతారని ఆ సర్క్యులర్ వెల్లడించింది. త్రిపుర గవర్నర్‌గా ఛత్తీస్‌గఢ్‌కు చెందిన బీజేపీ సీనియర్ నేత రమేశ్ బైస్ బాధ్యతలు స్వీకరించనున్నారు. ప్రస్తుత గవర్నర్ కప్తాన్ సింగ్ సోలంకి పదవీ కాలం 27న ముగియనుంది. నాగాలాండ్ గవర్నర్‌గా ఇంటెలిజెన్స్ బ్యూరో రిటైర్డు స్పెషల్ డైరెక్టర్ ఎన్.రవి నియమితులయ్యారు. 1976 బ్యాచ్ ఐపీఎస్ అధికారి అయిన రవి నాగా వేర్పాటువాదులతో కేంద్రం ఒప్పందం కుదుర్చుకోవడంలో కీలకపాత్ర పోషించారు. వీరు పదవీ బాధ్యతలు చేపట్టిన రోజు నుంచి ఈ నియామకాలు అమల్లోకి వస్తాయని రాష్ట్రపతి భవన్ తెలిపింది. 1950లో యూపీ ఏర్పడిన తర్వాత మొదటి మహిళా గవర్నర్ ఆనందీబెన్. అంతకు ముందు ఉన్న యునైటెడ్ ప్రావిన్సుకు 1947లో సరోజినీ నాయుడు గవర్నర్‌గా నియమితులయ్యారు.

## ఆ బిల్లు సమాచార హక్కుకు మరణ శాసనం

**సమాచార కమిషన్ మాజీ కమిషనర్ మాడభూషి శ్రీధర్**



**సాక్షి, న్యూఢిల్లీ:** సమాచార హక్కు (సవరణ) బిల్లు–2019 సమాచార హక్కు చట్టానికి మరణ శాసనమని, కేంద్ర సమాచార కమిషన్(సీఐసీ)కు ఇది వెన్నుపోటు అని సీఐసీ మాజీ కమిషనర్ మాడభూషి శ్రీధర్ ఆచార్యులు అన్నారు. తాజా బిల్లును తిరస్కరించాలని పార్లమెంటు సభ్యులకు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. 'సమాచార కమిషన్ల స్వయం ప్రతిపత్తిని ఈ బిల్లు తీవ్రంగా బలహీనపరుస్తుంది. కమిషనర్ల స్థాయిని తగ్గిస్తుంది. ప్రస్తుతం ఎన్నికల కమిషనర్, సుప్రీంకోర్టు జడ్జి హోదాతో సమానంగా సీఐసీ కమిషనర్ హోదా ఉంది. ఆర్టీఐ చట్టం కింద సమాచారాన్ని బహిర్గతం చేయడానికి సంబంధించి క్యాబినెట్ కార్యదర్శి సహా ఎవరినైనా ఆదేశించేందుకు తగిన అధికారముంది. గరిష్ట వయో పరిమితి 65కు లోబడి ప్రస్తుతం సమాచార కమిషనర్‌కు ఐదేళ్ల స్థిర పదవీకాలముంది. తాజా బిల్లు ఆమోదించినట్లయితే ఐదేళ్ల కాలపరిమితి ఉండదు. అంటే కమిషనర్ పదవికి శాసన భద్రత రద్దవుతుంది. ఇది కమిషనర్ల ప్రస్తుత స్వతంత్రతను తీవ్రంగా దెబ్బతీస్తుంది. వారిని ప్రభుత్వ విభాగాలకు లోబడి ఉండేలా చేస్తుంది.

## 8 కొత్త మార్గాల్లో విమాన సేవలు

**సాక్షి, న్యూఢిల్లీ:** ఉడాన్ పథకం ద్వారా మరో 8 మార్గాల్లో విమాన సేవలు అందుబాటులోకి వచ్చాయి. హైదరాబాద్–మైసూర్, మైసూర్–హైదరాబాద్, మైసూర్–గోవా, గోవా–మైసూర్, మైసూర్–కొచ్చిన్, కొచ్చిన్–మైసూర్ మార్గాల్లో ఈనెల 19 నుంచి విమాన సేవలు అందుబాటులోకి వచ్చినట్టు కేంద్ర పౌర విమానయాన శాఖ వెల్లడించింది. కోల్‌కతా–షిల్లాంగ్, షిల్లాంగ్–కోల్‌కతా మార్గంలో శనివారం నుంచి విమాన సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఇప్పటి వరకు ఉడాన్ పథకం ద్వారా మొత్తంగా 194 కొత్త మార్గాల్లో విమాన సర్వీసులు అందుబాటులోకి వచ్చాయి.

ఇరాన్ స్వాధీనంలో ఉన్న స్టెనా నౌక ఇదే




## ఆధిపత్యపోరులో భారతీయులు బందీలు

**బ్రిటన్ చమురు నౌకను ఇరాన్ స్వాధీనం చేసుకోవడంతో బందీలైన వైనం**

**న్యూఢిల్లీ/లండన్:** బ్రిటన్–ఇరాన్‌ల మధ్య సాగుతున్న ఆధిపత్యపోరులో భారతీయులు చిక్కుకున్నారు. తమ చమురునౌకను బ్రిటన్ స్వాధీనం చేసుకోవడంతో ప్రతీకారంగా హోర్ముజ్ జలసంధిగుండా వెళుతున్న బ్రిటిష్ చమురు నౌక 'స్టెనా ఇంపెరో'ను ఇరాన్ శుక్రవారం స్వాధీనం చేసుకుంది. ఈ నౌకలో మొత్తం 23 మంది సిబ్బంది ఉండగా, వీరిలో కెప్టెన్ సహా 18 మంది భారతీయులే. ఈ నేపథ్యంలో రంగంలోకి దిగిన భారత విదేశాంగ శాఖ ఈ 18 మందిని విడిపించేందుకు ఇరాన్‌తో చర్చిస్తోంది. చెరలోని భారతీయ సిబ్బందిని త్వరలో స్వదేశానికి తీసుకొస్తామని విదేశాంగ కార్యదర్శి రవీశ్ తెలిపారు. ఈ విషయమై హోర్ముజ్‌గన్ ప్రావిన్సు నౌకాశ్రయాలు, మారిటైమ్ డైరెక్టర్ జనరల్ అల్హామొరాద్ మాట్లాడుతూ..'బ్రిటన్ కేంద్రంగా పనిచేస్తున్న 'స్టెనా ఇంపెరో' నౌక ఇరాన్‌కు చెందిన చేపల బోటును ఢీకొట్టింది. అంతర్జాతీయ నిబంధనల్ని ఉల్లంఘించింది. ఈ నౌకలో మొత్తం 23 మంది సిబ్బంది ఉన్నారు. వీరిలో కెప్టెన్ సహా 18 మంది భారతీయులు కాగా, రష్యా, ఫిలిప్పీన్స్, లాత్వియా, ఇతర దేశాలకు చెందిన ఐదుగురు ఉన్నారు' అని తెలిపారు. స్వీడన్‌కు చెందిన స్టెనా బల్క్ అనే కంపెనీ ఈ నౌకను బ్రిటన్ కేంద్రంగా నిర్వహిస్తోంది. ఈ విషయమై స్టెనా బల్క్ ప్రెసిడెంట్ ఎరిక్ హనెల్ మాట్లాడుతూ..'మా నౌక హోర్ముజ్ జలసంధిలో ఉండగానే మరో చిన్నపాటి నౌక, హెలికాప్టర్ దాన్ని సమీపించాయి. అంతర్జాతీయ జలాల్లోకి 'స్టెనా ఇంపెరో' ప్రవేశించిన కొద్దిసేపటికే సౌదీఅరేబియాలోని జుబైల్ నగరంవైపు కాకుండా దిశను మార్చుకుని ఇరాన్‌వైపు వెళ్లింది' అని చెప్పారు. ఈయూ ఆంక్షలను ఉల్లంఘించి సిరియాకు ముడిచమురు సరఫరా చేస్తున్నారన్న ఆరోపణలతో ఇరాన్‌కు చెందిన చమురు నౌకను బ్రిటిష్ మెరైన్లు జీబ్రాల్టర్ జలసంధి వద్ద ఇటీవల స్వాధీనం చేసుకున్నారు.

## సోన్‌భద్ర బాధితులను కలిసిన ప్రియాంక

**మీర్జాపూర్/లక్నో:** కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ, ఉత్తరప్రదేశ్ ప్రభుత్వాల మధ్య నెలకొన్న వివాదం శనివారంతో సమసిపోయింది. యూపీలోని సోన్‌భద్ర జిల్లాలో జరిగిన కాల్పుల ఘటన బాధితులను పరామర్శించేందుకు వెళ్తున్న ప్రియాంకను పోలీసులు మధ్యలోనే అడ్డుకున్న విషయం తెలిసిందే. అనంతరం ఆమెను అదుపులోకి తీసుకుని ఓ ప్రభుత్వ అతిథి గృహానికి తరలించారు. బాధిత కుటుంబాలను కలిసే వరకు తాను వెళ్లేది లేదని ప్రియాంక అక్కడే భీష్మించుకు కూర్చున్నారు. ఈ నేపథ్యంలో బాధిత కుటుంబాలకు చెందిన 15 మంది శనివారం గెస్ట్‌హౌస్‌కు వచ్చి ప్రియాంకను కలిశారు. 'బాధిత కుటుంబాలకు కాంగ్రెస్ ఎప్పుడు అండగా నిలుస్తుంది' అని తర్వాత ప్రియాంక అన్నారు.



బాధితులను పరామర్శిస్తున్న ప్రియాంక

## సీపీఐ కొత్త సారథి డి.రాజా

**ఆరోగ్య సమస్యలతో వైదొలిగిన సురవరం**



**సాక్షి, హైదరాబాద్:** సీపీఐ జాతీయ స్థాయి నాయకత్వంలో మార్పు చోటు చేసుకుంది. సురవరం సుధాకర్‌రెడ్డి స్థానంలో పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా డి.రాజా ఎన్నికయ్యారు. ఈ మేరకు శనివారం సీపీఐ జాతీయ సమితి ఆమోద ముద్ర వేసింది. ఢిల్లీలో జరుగుతున్న జాతీయ కార్యవర్గ, జాతీయ సమావేశాలు ఆదివారంతో ముగుస్తున్నాయి. ఈ సందర్భంగా ఆదివారం సీపీఐ ప్రధానకార్యదర్శిగా పార్టీ అత్యున్నత బాధ్యతలను సురవరం సుధాకర్‌రెడ్డి నుంచి డి.రాజా స్వీకరిస్తారు. పార్టీ అత్యున్నత పదవి కోసం డి.రాజాతో పాటు సీనియర్ నేతలు అతుల్ కుమార్ అంజాన్, అమర్‌జిత్ కౌర్ పేర్లను నాయకత్వం పరిశీలించింది. తమిళనాడు నుంచి ఎంపీగా కొనసాగుతున్న రాజా రాజ్యసభ సభ్యత్వం త్వరలోనే ముగియనుంది. దళిత వర్గ నేతగా, రెండు పర్యాయాలు రాజ్యసభ ఎంపీగా ఉండడంతో జాతీయస్థాయిలో రాజకీయ పార్టీల అగ్రనేతలతో ఆయనకు పరిచయాలున్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో పార్టీలో కొత్త రక్తం నింపడంతో పాటు వినూత్న కార్యక్రమాలతో ప్రజలకు చేరువ కావాలనే వ్యూహంలో భాగంగానే రాజా వైపు జాతీయ సమితి మొగ్గు చూపినట్లు సమాచారం. లోక్‌సభ ఎన్నికల్లో రెండు సీట్లు మాత్రమే గెలుపొందడంతో పాటు దేశవ్యాప్తంగా పార్టీని బలోపేతం చేయడం, క్రియాశీలంగా మార్చడం వంటివి రాజాకు సవాళ్లేనని పరిశీలకులు అంటున్నారు.

### సురవరం ఎందుకు వైదొలిగారంటే..

ఆరోగ్యం సహకరించని కారణంగా ప్రధాన కార్యదర్శి బాధ్యతల నుంచి తనను తప్పించాలని మేలో జరిగిన జాతీయ కార్యవర్గ సమావేశంలో సురవరం సుధాకర్ రెడ్డి(77) కోరినట్టు పార్టీ వర్గాల సమాచారం. 2019 లోక్‌సభ ఎన్నికల వరకే పదవిలో ఉంటానని పార్టీకి ఆయన స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలోనే ప్రస్తుతం ఢిల్లీలో జరుగుతున్న ఆ పార్టీ జాతీయ సమితి సమావేశాల్లో ఈ అంశాన్ని ప్రధానంగా చర్చించి, నిర్ణయం తీసుకున్నారు. జాతీయ ప్రధాన కార్యదర్శిగా 2012లో బాధ్యతలను చేపట్టిన సురవరం, వరసగా మూడు పర్యాయాలు జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఆయన ప్రస్తుత పదవీకాలం 2021 వరకు ఉంది.

# కర్ణాటకలో రాష్ట్రపతి పాలన?

**సాక్షి, బెంగళూరు:** కర్ణాటక రాజకీయం ప్రస్తుతం అనూహ్య మలుపులతో సాగుతోంది. అసెంబ్లీలో మెజారిటీని నిరూపించుకోవాలని గవర్నర్ వజూభాయ్‌వాలా రెండుసార్లు లేఖలు రాసినా సీఎం కుమారస్వామి పట్టించుకోకపోవడం, స్పీకర్ రమేశ్ కుమార్ సభను సోమవారానికి వాయిదా వేయడంతో ఏం జరగబోతోందో అని సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ సందర్భంగా కర్ణాటకలో రాష్ట్రపతి పాలన విధించాల్సిందిగా గవర్నర్ వజూభాయ్‌వాలా కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సుచేసే అవకాశముందని రాజకీయవర్గాల్లో జోరుగా చర్చ సాగుతోంది. కర్ణాటక అసెంబ్లీలో జరుగుతున్న పరిణామాలు, రాష్ట్రంలో పరిస్థితులపై గవర్నర్ ఇప్పటికే కేంద్ర హోం శాఖ కార్యదర్శికి నివేదిక పంపినట్లు విశ్వసనీయవర్గాలు తెలిపాయి. ఒకవేళ సోమవారం కూడా అసెంబ్లీలో బలపరీక్ష జరగకపోతే వజూభాయ్‌వాలా నేరుగా రాష్ట్రపతి పాలనకు సిఫార్సు చేయొచ్చని వెల్లడించాయి. ఈ విషయమై ప్రముఖ రాజ్యాంగ నిపుణుడు సుభాష్ కశ్యప్ మాట్లాడుతూ..'ఇలాంటి పరిస్థితుల్లో గవర్నర్ నిర్ణయమే శిరోధార్యం. ప్రభుత్వానికి సభలో మెజారిటీ లేదని గవర్నర్ భావిస్తే, రాజీనామా చేయమని ముఖ్యమంత్రికి చెప్పే అధికారం గవర్నర్‌కు ఉంది. ఇక చట్టపరంగా కూడా కాంగ్రెస్–జేడీఎస్ కూటమికి మార్గాలన్నీ మూసుకుపోయినట్లే' అని అభిప్రాయపడ్డారు.

### రాష్ట్రపతిపాలన ఎప్పుడు పెట్టొచ్చు?

రాజ్యాంగంలోని ఆర్టికల్ 356 ప్రకారం ఏదైనా రాష్ట్రంలో సంక్షోభ పరిస్థితులు నెలకొంటే రాష్ట్రపతి పాలన విధించాలని కేంద్రానికి గవర్నర్ సిఫార్సు చేయవచ్చు. ఆ పరిస్థితులు ఏమిటంటే..

➤ రాష్ట్ర శాసనసభ ముఖ్యమంత్రిని ఎన్నుకోలేని పరిస్థితులు నెలకొన్నప్పుడు ➤ సంకీర్ణ ప్రభుత్వం మెజారిటీ శాసనసభ్యుల మద్దతు కోల్పోయినప్పుడు ➤ గవర్నర్ ఆదేశించిన సమయంలోగా సీఎం అసెంబ్లీలో మెజారిటీ నిరూపించుకోలేకపోతే ➤ అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టినప్పుడు సభలో మెజారిటీ కోల్పోతే ➤ రాష్ట్రంలో శాంతిభద్రతలకు ముప్పు వాటిల్లినా, యుద్ధ పరిస్థితులు, ప్రకృతి వైపరీత్యాలు సంభవించి పాలన గాడితప్పితే రాష్ట్రపతి పాలన విధించవచ్చు

### రాష్ట్రంలో గతంలో రాష్ట్రపతి పాలన

- **1971, మార్చి 9:** వీరేంద్ర పాటిల్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మెజార్టీ కోల్పోయింది (ఏడాది మీద ఒక్క రోజు)
- **1977, డిసెంబర్ 31:** ముఖ్యమంత్రి దేవరాజ్ (కాంగ్రెస్)కు సంపూర్ణ మెజార్టీ ఉన్నప్పటికీ గవర్నర్ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేశారు(59 రోజులు)
- **1989, ఏప్రిల్ 21:** ఎస్.ఆర్.బొమ్మై ప్రభుత్వం మెజారిటీ కోల్పోయింది(223 రోజులు)
- **1990, అక్టోబర్ 10:** వీరేంద్ర పాటిల్ ప్రభుత్వం బర్తరఫ్ (ఏడు రోజులు)
- **2007, అక్టోబర్ 9:** బీజేపీ–జేడీఎస్ సంకీర్ణ కూటమిలో అధికార మార్పిడిపై ప్రతిష్టంభనతో మెజారిటీ కోల్పోయిన ప్రభుత్వం (33 రోజులు)
- **2007, నవంబర్ 20:** అసెంబ్లీలో మెజారిటీ లేకపోవడంతో సీఎం యడ్యూరప్ప రాజీనామా(189 రోజులు)



### నేడు సీఎల్పీ భేటీ

**బెంగళూరు:** కాంగ్రెస్ నేతలు జి.పరమేశ్వర, డి.కె.శివకుమార్‌తో శనివారం బెంగళూరులో సమావేశమైన సీఎం కుమారస్వామి, సభలో అనుసరించాల్సిన వ్యూహంపై సమాలోచనలు జరిపారు. ఓటింగ్ నేపథ్యంలో ఆదివారం సీఎల్పీ భేటీకి హాజరు కావాలని కాంగ్రెస్ ఎమ్మెల్యేలను మాజీ సీఎం, సీఎల్పీ నేత సిద్దరామయ్య ఆదేశించారు. విశ్వాసపరీక్షలో తాము మెజారిటీని నిరూపించుకుంటామని మంత్రి శివకుమార్ ఈ సందర్భంగా ధీమా వ్యక్తం చేశారు. ఇటీవల రాజీనామాను వెనక్కితీసుకున్న కాంగ్రెస్ రెబెల్ ఎమ్మెల్యే రామలింగారెడ్డితో జేడీఎస్ అధినేత దేవెగౌడ సమావేశమయ్యారు. మరోవైపు, ప్రతిపక్ష నేత యడ్యూరప్ప బీజేపీ ఎమ్మెల్యేలతో చర్చించారు.

## ఆయనే కీలకం!



కర్ణాటకలో 16 మంది రెబెల్ ఎమ్మెల్యేలు రాజీనామా చేయగానే అందరి దృష్టి ఓ వ్యక్తివైపు కేంద్రీకృతమైంది. ఆయన ఏ నిర్ణయం తీసుకుంటారన్న విషయమై రాజకీయ పార్టీలతో పాటు సామాన్య ప్రజల్లో సైతం ఆసక్తి నెలకొంది. ఆయనే కర్ణాటక అసెంబ్లీ స్పీకర్ రమేశ్ కుమార్. టీవీ సీరియల్స్‌లో నటించిన రమేశ్ తన తెలివితేటలూ, పంచ్ డైలాగులతో అసెంబ్లీని నిర్వహించారు. విశ్వాసపరీక్ష నేపథ్యంలో తీవ్రమైన ఒత్తిడి నెలకొన్నప్పటికీ అటు అధికార కాంగ్రెస్–జేడీఎస్, ఇటు ప్రతిపక్ష బీజేపీ ఎమ్మెల్యేలను నియంత్రిస్తూ విధానసౌధను సజావుగా నడిపించారు. రెబెల్ ఎమ్మెల్యేలు సుప్రీంకోర్టును ఆశ్రయించినప్పటికీ, తాను రాజ్యాంగ నిబంధనల మేరకే ముందుకెళతాననీ, తప్పుడు నిర్ణయాలతో చరిత్రలో ద్రోహిగా మిగిలిపోవాలనుకోవడం లేదన్నారు. 1978లో కోలార్ జిల్లా శ్రీనివాసపుర అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ తరపున గెలవడంతో రమేశ్ రాజకీయ ప్రస్థానం మొదలైంది. అప్పటినుంచి పలు రాజకీయ పార్టీల తరపున పోటీచేసిన రమేశ్ 5సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు.

### అసెంబ్లీలో అనుచిత వ్యాఖ్యలు..

కర్ణాటకలో కాంగ్రెస్–జేడీఎస్ సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడగానే స్పీకర్‌గా ఎవరిని నియమించాలన్న ప్రశ్న తలెత్తింది. ఓవైపు బీజేపీ 105 మంది ఎమ్మెల్యేలతో అతిపెద్ద పార్టీగా అవతరించడం, మరోవైపు ఇద్దరు స్వతంత్రులు, ఓ బీఎస్పీ ఎమ్మెల్యేతో ప్రభుత్వం అతుకులబొంతగా మారిన నేపథ్యంలో సభను సజావుగా ఎవరు నడిపించగలరన్న కాంగ్రెస్ పెద్దల ప్రశ్నకు రమేశ్ కుమార్ సమాధానంగా నిలిచారు. 2018లో కర్ణాటక అసెంబ్లీ స్పీకర్‌గా బాధ్యతలు స్వీకరించిన రమేశ్.. తన నటనానుభవాన్ని ప్రదర్శిస్తూ అసెంబ్లీని సజావుగా నడుపుతూ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అయితే ఈ క్రమంలో కొన్నిసార్లు ఆయన నోరు జారారు. తాను అత్యాచార బాధితుడినని అసెంబ్లీ సాక్షిగా రమేశ్ వ్యాఖ్యానించడం పెను దుమారాన్ని రేపింది. తర్వాత సారీ చెప్పారు.

## గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం దక్షిణాయనం గ్రీష్మ ఋతువు, ఆషాఢ మాసం, తిథి బ.చవితి ఉ.8.30 వరకు తదుపరి పంచమి, నక్షత్రం పూర్వాభాద్ర పూర్తి (24గంటలు), వర్జ్యం ప.12.35 నుంచి 2.23 వరకు, దుర్ముహూర్తం సా.4.47 నుంచి 5.40 వరకు అమృతఘడియలు... రా.11.14 నుంచి 12.54 వరకు.

**సూర్యోదయం** : 5.38
**సూర్యాస్తమయం** : 6.32
**రాహుకాలం :** సా.4.30 నుంచి 6.00 వరకు
**యమగండం :** ప.12.00 నుంచి 1.30 వరకు

కె.ఆర్.రమేశ్ (కర్ణాటక స్పీకర్)

## రాయని డైరీ

మాధవ్ శింగరాజు

కుమారస్వామి మూడ్‌లో లేరు. మూడ్‌లో లేకపోతే లేకపోయారు, సిఎం సీట్‌లో కూర్చునే మూడ్ కూడా ఆయనలో కనిపించడం లేదు! ఆదివారం ఎప్పుడు పోతుందా, సోమవారం ఎప్పుడు వస్తుందా, ఎప్పుడు విశ్వాస తీర్మానంలో ఓడిపోతామా? ఎప్పుడు వెళ్లి ప్రతిపక్షంలో కూర్చుంటామా అన్నట్లుగానే ఉన్నారు. సోమవారం ఫ్లోర్ టెస్ట్.

"సోమవారమే కదా రమేశ్" అని అడిగారు కుమారస్వామి నుదుటిని చేత్తో పట్టుకుని. ఏడాదిగా ఆయన అలా నుదుటిని చేత్తో పట్టుకునే కూర్చుంటున్నారు. సభ లోపల అంతే, సభ బయటా అంతే. అసలు లోపలనీ బయటనీ కాదు.. మనిషి కనపడితే చాలు, నుదుటిపైకి ఆయన చెయ్యి వెళ్లిపోతోంది. మనుషుల మీద నమ్మకం పోయి, అదలా వెళ్లిపోతున్నట్లుంది.

"మాట్లాడవేం రమేశ్! సక్సెస్‌ఫుల్‌గా పైకి లేస్తామంటావా?" అని అడిగారు.

సర్‌ప్రైజ్ అయ్యాను.

'సక్సెస్‌ఫుల్‌గా పడిపోతామా రమేశ్' అని అడగాలి అసలైతే ఆయన ఇప్పుడున్న మూడ్‌లో. 'సక్సెస్‌ఫుల్‌గా పైకి లేస్తామా రమేశ్?' అని అడిగారంటే ఆయన మూడ్‌లోనే ఉన్నారని!

"సంతోషంగా ఉంది కుమారస్వామి" అన్నాను.

కుమారస్వామిని కుమారస్వామి అనేంత చనువు ఆయన దగ్గర నాకు ఉంది. ఉంది అని నేను అనుకుంటున్నాను కానీ, ఉంటే తప్పేముంది అని ఆయన అనుకుంటున్నారో లేదో నుదుటిపై నుంచి ఆ చెయ్యి అడ్డు తీస్తే గానీ తెలియదు.

కుమారస్వామి నా కంటే పదేళ్లు చిన్న. పైగా పాతికేళ్ల క్రితమే దేవెగౌడ దగ్గర స్పీకర్‌గా చేశాను. తండ్రి దగ్గర స్పీకర్‌గా చేసి, కొడుకు దగ్గరా స్పీకర్‌గా చేస్తున్నప్పుడు



తెలియకుండానే ఆ మాత్రం చనువు వద్దన్నా వచ్చేస్తుందేమో. ఆయన నన్ను రమేశ్ అంటారు. నేను కుమారస్వామి అంటాను.

"ఇప్పుడే ఎందుకు సంతోషం? సక్సెస్‌ఫుల్‌గా పైకి లేచాక కదా. అసలే ఒకసారి ఫెయిలయ్యాం. క్రయోజనిక్ ఇంజన్‌లో మళ్లీ ఏదైనా సాంకేతిక లోపం తలెత్తితే?!" అన్నారు కుమారస్వామి.

ఒక్క క్షణం ఏమీ అర్థం కాలేదు. ఆయన అంటున్నది చంద్రయాన్ గురించి!! మూడ్‌లోకి వచ్చారనుకున్నాను కానీ, మూడ్‌లోనే ఉండిపోతారని అనుకోలేదు.

"మీరు ఫ్లోర్ టెస్ట్ గురించి అడుగుతున్నారని అనుకున్నాను. స్పేస్ టెస్ట్ గురించని అనుకోలేదు" అన్నాను.

"ఫ్లోర్ టెస్ట్‌లో మీరు గానీ, నేను గానీ సంతోషపడేందుకు ఏముంటుంది రమేశ్? మీరు స్పేస్ టెస్ట్ గురించి చెబుతారనే నేను అనుకున్నాను" అన్నారు కుమారస్వామి.. ప్యాంట్ జేబులోంచి కర్చీఫ్ బయటికి తీసి!

ఆయన కర్చీఫ్‌ని తీశారంటే తీరని ఆవేదనలో ఉన్నారనే. పైకి స్పేస్ అంటున్నారు కానీ, ఆయన లోపలంతా ఫ్లోరే ఉన్నట్లుంది.

"మీరలా కర్చీఫ్ బయటికి తీసినప్పుడల్లా నాకొకటి అర్థం కాకుండా ఉండిపోతుంది కుమారస్వామీ" అన్నాను.

"మీకేం అర్థం కాకుండా ఉండిపోకూడదని మీరు అనుకుంటున్నారో చెప్పండి రమేశ్" అన్నారు కుమారస్వామి.

"కర్చీఫ్‌ను తియ్యకుండానే కన్నీళ్లను ఆపలేమా అన్నది నాకెప్పుడూ అర్థం కాని విషయం. మీరనే కాదు. ఎవరైనా.." అన్నాను.

విరక్తిగా నవ్వారు కుమారస్వామి.

"వస్తున్న కన్నీళ్లను, వెళ్తున్న ఎమ్మెల్యేలను ఎవరాపగలరు" అన్నారు నవ్వుతూనే కళ్లు తుడుచుకుంటూ.

కర్ణాటక అసెంబ్లీలో విశ్వాస తీర్మానంపై మూడు రోజులుగా చర్చ జరుగుతోందని మాత్రమే దేశానికి తెలుసు. కుమారస్వామి సీఎం అయిన నాటి నుంచి పద్నాలుగు నెలలుగా జరుగుతున్నదీ అదేనని ఆయనకు, నాకు మాత్రమే తెలుసు.

# ఇక 'తానా' తందానేనా?

జనతంత్రం



వర్ధెల్లి మురళి

ద్వాపరయుగం చివరి రోజులు... ద్వారకా నగరంలో అనేక వింతలూ, విడ్డూరాలు జరుగుతున్నాయి. ఆకాశంలో మబ్బులు లేవు, వర్షం లేదు, కానీ పిడుగులు పడుతున్నాయి. అప్పుడప్పుడూ ఆకాశం నుంచి ఉల్కలు రాలిపడుతున్నాయి. చిలుకలు గుడ్లగూబల్లా ప్రవర్తిస్తున్నాయి. నక్కల మాదిరిగా మేకలు ఊళలు పెడుతున్నాయి. జనం తాగి తందనాలాడుతున్నారు. ఒకరినొకరు కొట్టుకుంటున్నారు. ఈ విపరీత పరిణామాల రిపోర్టంతా శ్రీకృష్ణునికి అందింది. ఆయన ఆశ్చర్యపడలేదు. మౌనం వహించాడు. మొత్తం సినిమా ఆయనకు అర్థమైపోయింది. కురుక్షేత్ర యుద్ధానంతరం కౌరవమాత గాంధారి తీవ్రంగా రోదించింది. నూరుగురు కొడుకులను కోల్పోయిన పుత్ర శోకంతో ఆమె రుద్రమూర్తిలా మారిపోయింది. ఇందుకు కారకుడవు నువ్వేనంటూ శ్రీకృష్ణుడిని నిందించింది. నా కడుపు కోతకు కారణమైన నీ వంశం సర్వనాశనమైపోతుందని శపించింది. అప్పటికి ముప్పయ్యారేళ్లయింది కురుక్షేత్ర యుద్ధం – ధర్మరాజు పట్టాభిషేకం జరిగి. ఆమె శాపం ఇప్పుడు ప్రభావం చూపడం మొదలైందని కృష్ణుడికి అర్థమైంది. దానికితోడు మునుల శాపం ఒకటుంది. యాదవ వంశంలో ఒకరోజు ముసలం (రోకలి) పుట్టి, ఆ వెంటనే పరస్పర హననంతో అందరూ అంతరిస్తారని వారు శపించారు. అదీ పని చేయడం మొదలైంది. చేయగలిగిందేమీ లేదు. కృష్ణుడు కళ్లు మూసుకున్నాడు. యాదవ వంశ వినాశనం జరిగిపోయింది.

ఇది మహాభారతంలోని పదహారవ పర్వమైన మౌసల పర్వం కథా సంగ్రహం.

రాజకీయాల్లో ఎన్నడూ కననీ, విననీ విడ్డూరాలూ, చోద్యాలు తెలుగుదేశం పార్టీలో జరిగిపోతున్నాయి. ఎన్నికలకు ముందే ఈ పరిణామం మొదలైంది. ఇప్పుడు పీక్స్‌కు చేరుతోంది. లేకపోతే, ఒక పార్టీ అధ్యక్షుడై వుండి, తనకు నమ్మిన బంట్ల వంటి నాయకులను స్వయంగా బొట్టుపెట్టి మరీ బీజేపీలోకి చేర్చడమేమిటి? మరో రెండు మూడు బ్యాచ్‌లకు కూడా బొట్టుపెట్టడానికి ఏర్పాట్లు చేయడమేమిటి? అసెంబ్లీ సమావేశాల్లో చంద్రబాబు మాట్లాడుతున్న తీరు కూడా వింత గొలుపుతోంది. అక్రమ నిర్మాణంలో నివాసముంటున్నారని అధికారపక్షం గౌరవ ప్రతిపక్ష నేతను అధిక్షేపించింది. అందుకాయన 'లేదు, లేదు, కృష్ణానదే నా ఇంటిని దురాక్రమణ చేసింద'ని ఎదురుదాడికి దిగారు. అక్కడ ప్రకాశం బ్యారేజీ కట్టడం వలన ప్రవాహం ఆగిపోయి తన ఇంటి మీదకు వరదొచ్చిందనేది ఆయన కవి హృదయ సారాంశం. కానీ, చంద్రబాబు గారికి నాలుగేళ్ల వయసున్నప్పుడు (1954) బ్యారేజీ శంకుస్థాపన జరిగింది. ఏడేళ్ల ప్రాయంలో (1957) ప్రారంభోత్సవం కూడా జరిగింది. అప్పటికే అక్కడ ఇప్పుడున్న ప్యాలెస్ వుండి వుంటే, కృష్ణానది దొంగతనంగా వారి పెరట్లోకి ప్రవేశించిందన్న అభియోగాన్ని తర్కం కోసమైనా పరిశీలించవచ్చు. పిచ్చి ముదిరిందీ అంటే రోకలి తలకు చుట్టమనే ఈ వైఖరితో తెలుగుదేశం నేతలూ, ఎమ్మెల్యేలూ లబలబలాడిపోతున్నారని సమాచారం. చంద్రబాబు ప్రభుత్వం కుదుర్చుకున్న విద్యుత్ ఒప్పందాల్లో భారీ స్కామే దాగుందని అధికారపక్షం చేసిన ఆరోపణపై చంద్రబాబు వ్యవహరించిన తీరుకు ఆ పార్టీ ఎమ్మెల్యేలు తల్లడిల్లిపోతున్నారు. అధికారపక్షాన్ని అనవసరంగా రెచ్చగొట్టి మరీ దెబ్బలు తింటున్నాడు మా నాయకుడని వారు ప్రైవేటు శోకాలు పెడుతున్నారు. తప్పు చేసినప్పుడు తేలు కుట్టినవాడిలాగా కూర్చుంటే సరిపోయేది. తగుదునమ్మా అని అసెంబ్లీ అయిన తర్వాత ప్రెస్‌మీట్ పెట్టి మాట్లాడటాన్ని సొంత పార్టీ నేతలే తప్పుపడుతున్నారు. దాని ఫలితంగా మరుసటిరోజు అసెంబ్లీలో ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ ఒక ప్రజెంటేషన్ ఇచ్చి గణాంకాలతో సహా స్కామ్‌ను నిరూపించిన తీరు సామాన్య జనంలోకి కూడా సూటిగా వెళ్లిపోయింది. వాట్సాప్, ఫేస్‌బుక్ గ్రూపుల్లో ఈ గణాంకాలు హల్‌చల్ చేస్తున్నాయి. ''మిగులు విద్యుత్ ఉన్నా కూడా అధిక ధరలు చెల్లించి కొనుగోలు చేసేలా చంద్రబాబు ఒప్పందాలు కుదుర్చుకున్నారు. దీనివల్ల ఏటా 2,766 కోట్ల భారం పడుతుంది. ఈ ఒప్పందాల గడువు 25 సంవత్సరాలు. అంటే 2,766 × 25 = 69,150 కోట్లు. రానురాను విద్యుత్ ఛార్జీలు తగ్గుతాయని చంద్రబాబు స్వయంగా చెప్పారు. అంటే రాష్ట్ర ఖజానాకు మరింత భారం. మొత్తంగా 70 వేల కోట్లను దాటిన భారీ కుంభకోణం ఇది'' – ఏదో ఒక గ్రూప్ ద్వారా ఈ వివరాలు అందని స్మార్ట్‌ఫోన్ తెలుగు రాష్ట్రాల్లో ఒక్కటి కూడా ఉండకపోవచ్చు. చంద్రబాబు ఈ అంశంపై మాట్లాడుతూ అసలు విషయం చెప్పకుండా సెల్‌ఫోన్ ఛార్జీలు తగ్గించింది తానేననీ, విద్యుత్ సంస్కరణలు మొదలుపెట్టిందీ తానేనని అందుకోవడంతో టీవీల్లో అసెంబ్లీ చూస్తున్న చాలా మంది జడుసుకున్నారట. ఇక చార్మినార్ కట్టింది కూడా తానేననీ, గోల్కొండ కోట తనదేనని అంటారని ఊహించారు. లక్కీగా అక్కడిదాకా పోలేదు. విత్తనాలు, పోలవరం, కాపుల సమస్యలలోనూ అసెంబ్లీలో ఎదురుదెబ్బలే. తనువంతా గాయాలే.

ఎందుకిలా జరుగుతున్నది. ఎన్టీఆర్ శాపం ఇప్పుడు ప్రభావం చూపెడుతున్నదా? ఏమో... తెలుగుదేశం నేతలకైతే కారణాలు అంతుబట్టడం లేదు. అంతుచిక్కించుకునే పరిస్థితిలో చంద్రబాబు లేరు. ఐదేళ్ల కాలంలో తాము చేసిన అవినీతి నభూతో నభవిష్యతి అని తన అంతరాత్మే చెబుతోంది. వీటిమీద విచారణలు జరిగితే తన పరిస్థితి ఏమిటి? బయటపడే మార్గం ఎలా? బీజేపీతో సయోధ్యకు మళ్లీ దారి దొరుకుతుందా... ఇవే ఆలోచనలు. పూర్వం చక్రవర్తుల కటాక్ష వీక్షణాలకోసం సామంతులూ దండనాయకులూ యథాశక్తి కానుకలు పంపించేవారు. ఆ తరువాత అసలు కథ నడిపేవారు. ఈ కానుకలలో రాజ్యభాగాలు, రమణులు, గుర్రాలు, ఏనుగులు, గోవులు, బ్రాహ్మణులు, ధనకనకవస్తు వాహనాదులుండేవి. కాలక్రమంలో కానుకల్లో కొన్ని మార్పులు, చేర్పులు చోటుచేసుకున్నాయి. చంద్రబాబు కూడా మోదీ కొలువుకు ముందుగా కొన్ని 'గుర్రాలను' పంపించారు. వాటితోపాటు ఒక తెల్లజెండాను కూడా పంపించారు. ఢిల్లీ పెద్దల స్పందనకోసం ఎదురుచూస్తున్నారు.

బీజేపీ పెద్దలకు తెలుగుదేశం కథ అర్థమైంది. ఆ పార్టీకి ఎక్స్‌పైరీ డేట్ దగ్గరపడిందన్న నిర్ధారణకు వచ్చేశారు. అందుకు సహేతుకమైన కారణాలున్నాయి. తెలుగుదేశం పార్టీ నిర్మించుకున్న కోట కింద భూగర్భంలోని టెక్టానిక్ ప్లేట్ల అమరికల్లో జరుగుతున్న మార్పులు నాగపూర్ ఆరెస్సెస్ కేంద్రంలోని రెక్టర్ స్కేల్‌పై నమోదవుతున్నాయి. ఇటీవల జరిగిన ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ యాభై శాతం వోట్ షేర్‌తో రికార్డు సృష్టించింది. ఇంతకాలం టీడీపీకి ప్రధాన వోటుబ్యాంక్‌గా వున్న బీసీ వర్గాల్లో నిట్టనిలువునా చీలిక వచ్చి మొగ్గ వైసీపీవైపు తూగింది. వై.ఎస్. జగన్‌కు వున్న వ్యక్తిగత విశ్వసనీయత కారణంగా ఆయన ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌ను బీసీ విద్యాధికులు సంపూర్ణంగా నమ్మారు. ఫలితంగా వైసీపీకే ఈసారి కొంత ఆధిక్యత లభించింది. బ్రాహ్మణ, వైశ్య, క్షత్రియ వంటి వర్గాల్లోనూ గతంతో పోలిస్తే కొంత మెరుగైన స్థాయిలో ఆ పార్టీ మద్దతు రాబట్టగలిగింది. సంప్రదాయ ఓటు బ్యాంకును చెక్కుచెదరకుండా నిలబెట్టుకోవడం వలన ఈ కొద్దిపాటి అదనపు మద్దతుతోనే వైసీపీ కళ్లు చెదిరే విజయాన్ని నమోదు చేయగలిగింది. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత వై.ఎస్. జగన్ చూపుతున్న రాజకీయ పరిణతి, ఇచ్చిన హామీలను శరవేగంగా అమలుచేయడం కోసం తొలి సమావేశాల్లోనే వాటికి చట్టబద్ధత కల్పించడం, ఏ స్థాయిలో అవినీతి జరిగినా సహించబోమని దృఢంగా పంపించిన సంకేతాలు, విచ్చలవిడి మద్యపానంపై మోపిన ఉక్కుపాదం, ప్రజాధనం పైసా కూడా వృథా కాకూడదని పడుతున్న తపన– అందుకోసం అవినీతి ప్రాజెక్టులను సమీక్షించి రివర్స్ టెండరింగ్‌కు సిద్ధపడడం వంటి చర్యల ఫలితంగా కుల, మత, వర్గాలకతీతంగా వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డికి రాష్ట్ర ప్రజల్లో మద్దతు పెరిగింది. నవరత్న పథకాలు పూర్తిగా అమలులోకి వచ్చిన తర్వాత ఆయన బలం మరింత పెరుగుతుందన్న అంచనాల్లో బీజేపీ వర్గాలున్నట్టు సమాచారం. నామినేటెడ్ పదవుల్లో, నామినేషన్ పనుల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకూ, స్త్రీలకూ 50 శాతం వాటా కేటాయించడం కూడా తీవ్రంగా ప్రభావం చూపే అంశమేననీ, ఈ పరిణామం తర్వాత బీసీ వర్గాల్లో తెలుగు దేశం మద్దతు నామమాత్రం కానున్నదని కాషాయం పెద్దల అంచనా. ఇప్పటివరకూ బీసీలతోపాటు పట్టణ ఉన్నత మధ్యతరగతి వర్గాల్లో టీడీపీకి ఆదరణ వుంది. మీడియా ప్రచారం కారణంగా, సెల్‌ఫోన్‌ను కనిపెట్టడం, హైటెక్ సిటీని నిర్మించడం వంటి గోబెల్స్ ప్రచారాల కార ణంగా ఈ సెక్షన్‌లో టీడీపీ పాగా వేయగలిగింది. పబ్లిసిటీ స్టంట్‌లో చంద్రబాబుకు బీజేపీ ఏమాత్రం తీసిపోదు. టన్నులకొద్దీ దేశభక్తిని సోషల్ మీడియాలో డంప్ చేయగల శక్తి బీజేపీకి వుంది. ఈ వ్యూహంతో ఆంధ్రప్రదేశ్ పట్టణ మధ్యతరగతిని టీడీపీ నుంచి తమ వైపు తిప్పుకోవడం పెద్ద కష్టమైన పనేమీ కాదని బీజేపీ భావిస్తున్నది. బీసీ ఓట్లను వైసీపీ తీసుకుని, పట్టణ మధ్య తరగతిని తాము లాగేసుకుంటే ఇక తెలుగుదేశం పరిస్థితి రెక్కలు తెగిన పక్షిలాంటి దేని కాషాయ శిబిరం భావిస్తున్నట్టుంది. ఈ కోణం నుంచే ఆలోచించి తెలుగుదేశంతో ఎటువంటి సంబంధాలను నెలకొల్పుకోవాలన్నది బీజేపీ నిర్ణయించుకుంటుంది. తెలు గుదేశం పార్టీని నిశ్శేషం చేసి, ఆ స్థానంలో ప్రవేశించడమా? లేక అవశేషమాత్రంగా మిగిల్చి జూనియర్ పార్ట్‌నర్‌గా చేసుకోవడమా? అనేది బీజేపీ చాయిస్‌గానే వుంటుంది తప్ప తెలుగుదేశం పార్టీ ఆకాంక్షల మేరకు ఉండకపోవచ్చు. తమపై ఎటువంటి కేసులూ రాకుండా కాపాడి ఎన్డీఏలో చేర్చుకోవాలని తెలుగుదేశం పార్టీ లాబీయింగ్ ప్రారంభించినట్టు తెలుస్తోంది. ఇటీవల ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బీజేపీ అగ్రనాయకుడు రామ్‌మాధవ్ చేసిన ఒక వ్యాఖ్య ఇక్కడ ప్రస్తావనార్హమైనది. ఇక మీదట తెలుగుదేశం పార్టీ 'తానా' సభల్లో మాత్రమే మిగులుతుందని ఆయన కామెంట్ చేశారు. దానర్థం ఆ పార్టీ ఆంధ్రప్రదేశ్‌లో ఉనికిని కోల్పోబోతోందనే. అమెరికా, కెనడాల్లో స్థిరపడ్డ తెలుగు వారి కోసం ఏర్పడిన సాంస్కృతిక సంస్థ 'తానా'. అది రానురాను తెలుగుదేశం పార్టీ మద్దతుదారులతో నిండిపోయింది. తెలుగుదేశం పార్టీతో ఏర్పరచుకున్న 'గాఢ'మైన అనురక్తితో 'తానా'లో ఒక కెమిస్ట్రీ ఏర్పడింది. ఆ 'కెమిస్ట్రీ' ల్యాబ్‌లోని హైడ్రోజన్ సల్ఫైడ్ వెలువరించే కుళ్లిన కోడిగుడ్ల వాసనకు తానా సభలకు వెళ్లిన రామ్‌మాధవ్‌కు తల తిరిగి నంతపనైంది.

muralivardelli@yahoo.co.in




సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



## సోషల్ మీడియా

### నరమేథం



"రెండు వందల మంది, 32 ట్రాక్టర్లలో ఉత్తరప్రదేశ్‌లోని సోంభద్రలో నిరుపేద గిరిజనులపై దాడి చేసి, అరగంట పాటు కాల్పులు జరిపి పదిమంది మృతికి కారణమయ్యారు. సవ్యంగా నడిచే ఏ ప్రజాస్వామ్యంలో అయినా ముఖ్యమంత్రిని వెంటనే రాజీనామా చేయమని అడుగుతారు. కానీ, భారతదేశంలో అది సాధ్యం కాదు. ఇక్కడ ముఖ్యమంత్రి కేవలం ప్రతిపక్షాన్ని నిందించి ఊరుకుంటారు. రామరాజ్యం అంటే ఇదే కదా!"

– సునంద, న్యాయవాది

### ఫేక్



"భారతీయ జర్నలిస్ట్ రాసిన మరో పుస్తకాన్ని దేన్నీ నేను కొనను. వాళ్లు సమయానుకూలమైన తప్పుడు అభిప్రాయాలతో న్యూస్‌కు రంగులద్దుతున్నారు. వీరిలో చాలామంది తమ ఆత్మలను అమ్ముకున్నవారే. వారికి వాళ్ల పుస్తకాలు అమ్ముడుపోవడం కంటే, వారి నిరంతర నాటకాలకే ఈ పుస్తకాల అవసరం ఎక్కువ"

– అనిందిత, జర్నలిస్ట్

### ఐకాన్



"అస్సాంకు చెందిన 19 ఏళ్ల పరుగుల రాణి హిమదాస్ వరల్డ్ కప్ ఉధృతంగా సాగుతున్న రోజుల్లో నాలుగు బంగారు పతకాలు సాధించింది. వరదల్లో అల్లాడుతున్న తన స్వంత రాష్ట్ర ప్రజల కోసం ఆమె తన జీతంలో సగం విరాళంగా ఇచ్చింది. ఇటువంటి ఐకాన్‌లే దేశానికి కావాల్సింది"

– అభిషేక్ సింఘ్వి, కాంగ్రెస్ నేత

### రుణం



"షీలా దీక్షిత్ ఇకలేరనే వార్త విని చాలా బాధ కలిగింది. మంచి సంప్రదాయం, తెలివితేటలుగల మహిళగా ఆమెను నేను ఎప్పటికీ గుర్తుంచుకుంటాను. ఢిల్లీ ఆమెకు ఎంతో రుణపడి ఉంటుంది. ఆమె నాయకత్వంలో ఢిల్లీలో జరిగిన ప్రతి మార్పు ఆమెను అనుక్షణం గుర్తు చేస్తూనే ఉంటుంది"

– కిరణ్ బేడీ, బీజేపీ నేత

### శరీరం



"స్త్రీల శరీరాలు, స్త్రీల హక్కుల గురించి కొందరు పురుషుల ఆలోచనా ధోరణిని నేను మార్చలేను. వాళ్లని బ్లాక్ చేసేసి, ముందుకు సాగిపోవడమే ఉత్తమం. సులువుగా అందుబాటులో ఉండే అంశాల గురించి కూడా పురుషులకు నేర్పించడం నా పని కాదు. నేర్చుకోవడానికి సిద్ధంగా లేని అపరిచితుడికి భావోద్వేగంతో సహాయం చేయాలని నేను కోరుకోవడం లేదు"

– అమేనా, స్టయిలిస్

## ఎన్‌ఆర్‌సీ వివాదం

అనుభవమైతేగానీ తత్వం బోధపడదంటారు. అస్సాంలో 41 లక్షలమంది పౌరులను వలసదారులుగా నిర్ధారించిన జాతీయ పౌర గుర్తింపు (ఎన్‌ఆర్‌సీ) ముసాయిదాపై కేంద్ర ప్రభుత్వానికి సందేహాలు తలెత్తాయి. లంచాలు మరిగిన కొందరు ఈ ప్రక్రియను దెబ్బతీశారని, కనుక మరోసారి తనిఖీలు అవసరమని భావిస్తోంది. ఇంతక్రితం ఈ ప్రక్రియలో పాలుపంచుకున్న అధికారులను ఈ తనిఖీలకు దూరంగా ఉంచాలని కూడా అనుకుంటోంది. సక్రమంగా దర్యాప్తు చేయగలిగే సమర్థవంతులైన అధికారులను ఇందు కోసం వినియోగించుకోవాలని కేంద్రం నిర్ణయించుకుంది. ఈ ప్రక్రియ తీరు గురించి పౌర సమాజ కార్యకర్తలు ఆదినుంచీ విమర్శిస్తున్నారు. క్షేత్ర స్థాయిలో పనిచేసినవారు లంచం మరిగి ఇష్టానుసారం జాబితా రూపొందించిన ఉదంతాలు కూడా బయటపడ్డాయి. కనుకనే దీన్ని విచారిస్తున్న సుప్రీంకోర్టు ధర్మాసనానికి తుది గడువు పొడిగించాలని శుక్రవారం కేంద్రం విన్నవించింది. నిరుడు జూలైలో ఎన్‌ఆర్‌సీ తొలి ముసాయిదా బయటికొచ్చినప్పుడు, గత నెలలో రెండో ముసాయిదా వెల్లడైనప్పుడు కూడా లక్షలాదిమందికి కనుకు లేదు. ఆ ముసాయిదాల్లో పేర్లు గల్లంతైన 36 లక్షలమంది తాము ఈ దేశ పౌరులమేనంటూ మళ్లీ దరఖాస్తు చేసుకోగా, ఫలానావారి పేరు తొలగించండంటూ 2 లక్షల దరఖాస్తులు వచ్చాయి. వచ్చే మంగళవారం జరిగే విచారణలో సర్వోన్నత న్యాయస్థానం ఏం చెబుతుందో చూడాలి.

**అన్ని దానాల కంటే గొప్పదానం అన్నదానం కాదు విద్యాదానం అనే చెప్పాలి. మొత్తం సమాజ శ్రేయస్సు, అభివృద్ధి ఒక్క విద్య, విద్యావిధానంపైనే ఆధారపడి ఉంటుంది. సమాజం గురించి తెలియకుండా, ప్రజల కష్టసుఖాలను, మానవ సంబంధాలను గురించి అవగాహన కలుగని రీతిలో విద్యార్థులను పెంచితే స్వార్థమే పరమార్థమనే భావాలు కలవారు కావచ్చు. అత్యంత పేద కుటుంబం నుంచి వచ్చిన పిల్లలకు కూడా ఉన్నతస్థాయి విద్యను అందించే విధంగా ప్రణాళికలు వేయాలి. మంచి మార్పు రావాలంటే విద్యపై ఖర్చుకు వెనకాడకూడదు. ప్రభుత్వం విద్య మీద శ్రద్ధ తీసుకుని ప్రజలకు భరోసా కల్పిస్తే ప్రభుత్వ విద్యాలయాల్లో విద్యార్థుల సంఖ్య పెరుగుతుంది. అనేక మంది ఆడపిల్లలు 7, 8 తరగతులలో స్కూలు మానేయడానికి ప్రధాన కారణం టాయ్‌లెట్లు లేకపోవడమే అంటే మన దేశంలో ఈనాటికీ బాలికా విద్యకు ఎన్ని ఆటంకాలున్నాయో అర్థమవుతుంది.**

# సమాజ శ్రేయస్సుకు విద్యే పునాది

అభిప్రాయం



జస్టిస్ బి. చంద్రకుమార్

సమాజ శ్రేయస్సు విద్యావిధానం మీదనే ఆధారపడి ఉంటుంది. అన్నిటి కంటే గొప్పదానం విద్యాదానం. విద్య విద్యార్థి మనసును వికసింపచేయాలి. సత్యాన్ని శోధించేటట్లు, తెలుసుకునేటట్లు చేయాలి. విద్యార్థుల ఆలోచనలను సరైన దిశలో పెంపొందేటట్లు చేయాలి. విద్య, విద్యార్థులను మానసికంగా, శారీరకంగా దృఢమైన వారిగా తయారు చేయాలి. సమాజం గురించి తెలియకుండా, ప్రజల కష్టసుఖాలు, మానవ సంబంధాలు లేకుండా విద్యార్థులను పెంచితే స్వార్థమే పరమార్థమనే భావాలు కలవారు కావచ్చు.

ప్రభుత్వం సమాజ అవసరాలను అంచనా వేయాలి. ప్రస్తుతానికి, కనీసం ఇంకా 5 ఏళ్ళ వరకు ఎంత మంది డాక్టర్లు కావాలి? ఎంత మంది నర్సులు కావాలి, ఎంత మంది వ్యవసాయ అధికారులు, ఎలక్ట్రీషియన్స్ కావాలి, ఇలా ఒక స్పష్టమైన ముందు చూపు ఉంటే, సమాజ అవసరాలను పూర్తి చేయడానికి ఇప్పుడున్న పాఠశాలలు, సాంకేతిక కళాశాలలు సరిపోతాయా, ఇంకా అదనంగా పాఠశాలలు, కళాశాలలు, సాంకేతిక కళాశాలలను నెలకొల్పాలా?అనే వివరాలు తెలుస్తాయి.

నేటి బాలబాలికలే మన రేపటి భవిష్యత్తు. అత్యంత పేద కుటుంబం నుంచి వచ్చిన పిల్లలకు కూడా ఉన్నతస్థాయి విద్యను అందించే విధంగా ప్రణాళికలు వేయాలి. మంచి మార్పు రావాలంటే విద్యపై ఖర్చుకు వెనకాడకూడదు. అవసరమైతే ముఖ్యమైన పట్టణాల్లోని ప్రభుత్వ భూముల్ని అమ్మి అవసరమైన డబ్బు సేకరించాలి. ఆర్థిక నిపుణులతో చర్చించి ప్రజలకు లాభం కలిగేటట్లు, ఏ చర్యల వల్ల ఆదాయం సమకూరుతుందో నిర్ణయించి కచ్చితమైన చర్యలు తీసుకొని ఆదాయాన్ని పెంచుకోవాలి. ఇలా వచ్చిన ఆదాయంలో అత్యధిక శాతం పేద విద్యార్థులకు విద్య కోసం, హాస్టల్ సౌకర్యాల కోసం వినియోగించాలి. పేదవారైనప్పటికీ తమ పిల్లలను చదివించాలని అనేకమంది తల్లిదండ్రులు ఎంతో కష్టపడుతున్నారు. వారి ఆదాయంలో ఎంతో భాగం పిల్లల విద్యకోసం ఖర్చు చేస్తున్నారు. ఉన్నత విద్యను అందించడానికి విదేశాలకు పంపడానికి ఆస్తులు అమ్ముకున్నవారు ఉన్నారు.

అందుకనే ప్రభుత్వాలు చేయాల్సిన తక్షణ కర్తవ్యాలను సూచిస్తున్నాను. పాఠశాలలు లేని గ్రామాలను, తండాలను గుర్తించి ఆ గ్రామాలలో, తండాలలో ప్రాథమిక పాఠశాలలను నెలకొల్పాలి. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో, ఉన్నత పాఠశాలల్లో కాలేజీల్లో కనీస వసతులు కల్పించడం, టాయ్‌లెట్ సౌకర్యాలను కల్పించడం, టాయ్‌లెట్ల నిర్వహణ ఖర్చు



లేకుండా ఆధునిక పద్ధతిలో లేదా నిరంతరం శుభ్రపరిచే విధంగా టాయ్‌లెట్లను ఏర్పరచాలి. (అనేక మంది ఆడపిల్లలు 7, 8 తరగతులలో స్కూలు మానేయడానికి ప్రధాన కారణం టాయ్‌లెట్లు లేకపోవడమే). ప్రభుత్వ పాఠశాలలో, హైస్కూళ్లలో, కాలేజీల్లో అవసరమైన మరమ్మత్తులు చేయించాలి. అవసరమైన చోట అదనపు గదులు నిర్మించాలి. పరిసరాలు పరిశుభ్రంగా ఉండేటట్లు చూడాలి. ఆవరణలో మొక్కలు నాటేటట్లు చేయాలి. ప్రతి స్కూలుకు, హైస్కూళ్లకు, కాలేజీలకు ఆట స్థలాలు ఉండాలి. వీలైనంత త్వరలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను, లెక్చరర్ల, ప్రొఫెసర్ల పోస్టులను భర్తీ చేయాలి.

ప్రతీ స్కూళ్లో/ కాలేజీల్లో ఉదయం టిఫిన్ సౌకర్యం ఏర్పాటు చేయాలి. (ఎందుకంటే అనేక మంది పేద పిల్లలు ఉదయం పూట ఏమీ తినకుండానే స్కూలుకు వస్తారు. మధ్యాహ్న భోజనం కోసమే వచ్చేవారు కూడా ఉన్నారు.) వీలైతే సాయంత్రం పూట తినడానికి ఏదో ఒకటి ఇవ్వాలి. పిల్లల్లో పౌష్టికాహార లోపం, రక్తహీనత, ఎత్తూ బరువు తక్కువ. ఇవి సాధారణంగా పేద పిల్లల్లో కనబడతాయి. విచారణ జరిపి శాంపిల్ లెక్కలు తీసుకుంటే వాస్తవాలు తెలుస్తాయి. ఇంగ్లిష్ మీడియంకు లేదా ఇంగ్లిష్ భాషకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలి. అంటే పిల్లలు ఇంగ్లిష్‌లో బాగా మాట్లాడగలగాలి. కంప్యూటర్ విద్య, అధునాతన టెక్నాలజీ విద్యార్థులకు అందేటట్లు చూడాలి. ఒకసారి ప్రభుత్వం విద్య మీద శ్రద్ధ తీసుకుని ప్రజలకు భరోసా కల్పిస్తే ప్రభుత్వ విద్యాలయాల్లో విద్యార్థుల సంఖ్య పెరుగుతుంది. ప్రభుత్వం తీసుకునే చర్యల వల్ల మధ్యతరగతి వారు కూడా తమ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలల్లో, కాలేజీల్లో చదివించాలన్న వాతావరణం ఏర్పడాలి.

బాగా పనిచేసే ఉపాధ్యాయులకు ప్రోత్సాహం కలిగించే విధంగా సర్టిఫికెట్లు, బహుమతులు, ఆర్థిక రివార్డులు ఇవ్వాలి. 3 సం॥ల వరకు ప్రతీ సంవత్సరం వరుసగా మంచి రికార్డు సాధించిన ఉపాధ్యాయులకు ఒక ఇంక్రిమెంట్ ఇవ్వాలి. వీలైనన్ని చోట్ల ప్రభుత్వమే కోచింగ్ సెంటర్లు నిర్వహించాలి. అత్యంత పేద కుటుంబాల నుండి వచ్చిన వారు కష్టపడి ఎలా ఉన్నతస్థాయికి వెళ్ళారో ఉదాహరణలతో వివరించాలి. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఇంగ్లిష్ భాషపై పట్టు త్వరగా రాదు. వారికి ప్రత్యేక కోచింగ్‌లు ఏర్పాటు చేయాలి. వీలైనన్ని ఎక్కువ ప్రభుత్వ హాస్టళ్ళను ఏర్పాటు చేసి ఏ పేద విద్యార్థి, పేదరికం కారణంగా, తిండికి లేక, కనీస అవసరాలు తీరక విద్యను మధ్యలో ఆపేసే పరిస్థితి ఉండని విధంగా చూడాలి. అటువంటి పేద కుటుంబాల వారికి వారి పిల్లలను మధ్యలో బడి మాన్పించి ఏదో పనిలో పెట్టకుండా కొంత ఆర్థిక ప్రోద్బలం ఇవ్వగలిగితే ఉపయోగకరంగా ఉంటుంది. విద్యార్థులకు, ఆటలు, పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలి.

విద్యార్థుల్లోని అంతర్గత శక్తులను గుర్తించి, వారిలోని ప్రావీణ్యాన్ని పెంపొందించే చర్యలు చేపట్టాలి. ఒక విద్యార్థి పాడగలిగే వాడైతే అతనికి సంగీత విద్యను అందించే ఏర్పాటు ఉండాలి. వ్యాసరచన, ఉపన్యాస మొ॥ పోటీలను నిర్వహించాలి. కథలు, కవితలు వ్రాసేవారిని ప్రోత్సహించాలి. ఇవన్నీ ఇప్పుడే చేయడం సాధ్యంకాక పోవచ్చు. కానీ గొప్ప లక్ష్యాలను నిర్ణయించుకొని ఆ లక్ష్య సాధనకు మార్గాలను రూపొందించుకొని పట్టుదలగా ముందుకు సాగితే అనుకోని సహాయం అందుతుంది. ఆదాయం తక్కువగా ఉన్నదనే కారణంతో ప్రజలకు అందించాల్సిన విద్యా వైద్య సహకార విషయాల్లో వెనుకడుగు వేయగూడదు. ఎన్ని రకాలుగా ప్రయత్నించి ఆదాయం పెంచుకోగలిగితే అన్ని రకాలుగా ప్రయత్నించి ఆదాయాన్ని పెంచుకోవాలి. భయం, పిరికితనమే అన్ని అనర్థాలకు కారణం. భగవంతుని సహాయం మనకు అందుతుందనే ధైర్యంతో ముందుకు సాగాలి.

వ్యాసకర్త విశ్రాంత న్యాయమూర్తి
మొబైల్ : 89783 85151

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును. టోల్ ఫ్రీ నం: 1800 270 1083



తండ్రి.. తల్లితో... చిన్నారి లక్ష్మి





● లక్ష్మి

# ధైర్యే సాహసే లక్ష్మి

**ధైర్య సాహసాలుంటే లక్ష్మీదేవి కటాక్షిస్తుందన్నది నానుడి.**
**ధైర్యము సాహసము ఉంటే మనింటి మహాలక్ష్మి**
**మన లక్ష్మిలా నిలబడగలుగుతుందన్నది నమ్మకం.**
**జీవితసారాన్ని అక్షరాలతో వడ్డిస్తే ఇదిగో**
**అచ్చం ఈ ఇంటర్వ్యూలా ఉంటుంది.**
**ఈ ఆదివారం 'సాక్షి' మీకు లక్ష్మి కటాక్షం ప్రసాదిస్తోంది.**

● **'ఓ బేబీ'లో బేబీ పాత్రలో అద్భుతంగా నటించారు. ఈ సినిమా చేయడం ఎలా అనిపించింది?**

**లక్ష్మి:** గ్రేట్ ఎక్స్‌పీరియన్స్. ఎంత పెద్ద ఆర్టిస్ట్ అయినా సరే కరెక్ట్ డైరెక్టర్ చేతిలో పడాలి. కరెక్ట్ సబ్జెక్ట్, కరెక్ట్ డైలాగ్ రైటర్ ఉంటే చాలు. మంచి సినిమా వస్తుంది. 'ఓ బేబీ'కి ఇవన్నీ బాగా సెట్ అయ్యాయి. నా డైలాగ్స్ అన్నీ లక్ష్మీ భూపాల్‌గారు చాలా జాగ్రత్తగా చూసుకున్నారు. లేదంటే నాకు గోదావరి యాస అంత బాగా వచ్చేది కాదు. సమంత బాగా నటించింది. నందినీ మంచి దర్శకురాలు. ఇంత మంచి టీమ్‌తో చేసినందుకు హ్యాపీగా ఉంది.

● **'జీన్స్, నిన్నే పెళ్లాడతా, మురారి, ఇప్పుడు 'ఓ బేబీ'... ఈ సినిమాలు గుర్తు చేసుకుంటే హీరో హీరోయిన్లతో పాటు మీరూ గుర్తొస్తారు? ఓ క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా అది మీకు దక్కిన గొప్ప క్రెడిట్ కదా?**

ఇదంతా దేవుడి దయ అనుకుంటాను. ప్రతీ ఒక్కరు ఏదో ఒక పని చేయడానికే ఈ భూమి మీదకు వస్తాం. ఆయన తీర్మానించుకొని మనల్ని ఇక్కడికి పంపుతారు. కొందరు 'కాస్మిక్ ఎనర్జీ' అంటారు. మరికొందరు దేవుడు అంటారు. దేవత అంటారు. ఎవరి ఇష్టం వాళ్లది. ఓ ఎనర్జీ మనల్ని భూమి మీదకు తీసుకొచ్చి, ఇంతవరకూ చేర్చింది. నేనీ విషయాన్ని చాలా నమ్ముతాను. ఈ ప్రపంచంలో 'లక్ష్మి అనే సినిమా' ఇన్నాళ్లు ఆడుతుంది అని రాసిపెట్టాడు. ఆ సినిమా ఎప్పుడో 50 ఏళ్ల క్రితం మొదలైంది. ఇప్పటికీ ఆడుతూనే ఉంది (నవ్వుతూ). నేను ఖర్మ సిద్ధాంతం, మంచి పనులు చేయడం అనే విషయాలను బాగా నమ్ముతాను.

● **'లక్ష్మి అనే సినిమా జర్నీ'లో 1983లో ఒకేసారి అటు కన్నడ ఇటు తమిళంలో రెండు వివాదాస్పదమైన సినిమాలు చేశారు. వాటిని సెలెక్ట్ చేసుకునే ధైర్యం మీకు ఎక్కడి నుంచి వచ్చింది?**

కన్నడ సినిమా 'పల్లవి అనుపల్లవి'లో నా పాత్ర చాలా రిస్క్‌తో కూడుకున్నది. అందులో భర్త నుంచి విడిపోయి నాకన్నా చిన్నబ్బాయితో ప్రేమలో పడతాను. అనిల్ కపూర్ హీరోగా చేశారు. అలాంటి సినిమా చేయడానికి చాలా ధైర్యం కావాలి. ఇండస్ట్రీకి వచ్చాక విభిన్న సినిమాలు చేయాలి. అంతేకానీ వివాదం అవుతుందేమో అనే ఆలోచనను పక్కన పెట్టేయాలి. డబ్బులు పెట్టే నిర్మాత, దర్శకుడు స్క్రిప్ట్ విషయంలో కాన్ఫిడెంట్‌గా ఉంటే చాలు. అలాగే తమిళంలో రెండు వివాదాస్పద సినిమాలు చేశాను. 'సిరై' అనే సినిమాలో తమిళ బ్రాహ్మణ అమ్మాయి పాత్ర నాది. ఓ పూజారి భార్య పాత్ర. తనని ఓ క్రిస్టియన్ అబ్బాయి రేప్ చేస్తాడు. దాంతో భర్త తిరస్కరిస్తాడు. ఆ తర్వాత ఆ క్రిస్టియన్‌తోనే బతుకుతుంది. చివరికి అతను చనిపోతాడు. 'నాకోసం తిరిగొచ్చెయ్' అని పూజారి అంటే 'నాకోసం ఇన్నాళ్లు బతికినవాడు నీకంటే బెటర్' అని తాళి అతని చేతికి ఇస్తుంది. చాలా కాంట్రవర్సీ సబ్జెక్ట్. ఓ నవల ఆధారంగా ఈ సినిమా ఉంటుంది. 'క్లైమాక్స్ వేరే విధంగా తీద్దామా? ప్రేక్షకులు అంగీకరిస్తారో లేదో?' అని డైరెక్టర్‌తో అన్నాను. ఇది 1983లో చేశాం. 'సినిమా మొదలెట్టిందే ఈ క్లైమాక్స్ కోసం' అని డైరెక్టర్‌గారు చెప్పారు. రిలీజ్ అయిన తర్వాత ఆడవాళ్లందరూ 'సినిమాలో మీ ధైర్యం మాకు నచ్చిందండీ. మాకెంతో మందికి ధైర్యం లేక బతుకుతున్నాం' అని నాతో అన్నారు. అలాగే 'శిల నేరంగళిల్ శిల మణిదరగళ్' అనే సినిమాలో రేప్‌కి గురై, ఇంటి నుంచి వెలివేయబడతాను. ఓ బంధువు చేరదీసి, చదివిస్తే పెద్ద స్థాయికి చేరుకుంటాను. ఒక సందర్భంలో అత్యాచారం చేసిన అతను తారసపడతాడు. ఆ తర్వాత అతనితో రిలేషన్‌షిప్ సాగిస్తాను. అప్పట్లో ఇదో సంచలనాత్మకమైన సినిమా.

● **అలాగే 'సరోగసీ' నేపథ్యంలో 'అవన్ అవళ్ అదు' అనే తమిళ సినిమా చేశారు. ప్రయోగాత్మక సినిమాలు చేయాలనే మీ ఆలోచన బాగుంది కానీ ఫెయిల్ అయ్యుంటే?**

శివకుమార్, నేను 1990లో 'అవన్ అవళ్ అదు' సినిమా చేశాం. 'సార్.. సరోగసీ అనేది చాలా సెన్సిటివ్ విషయం. ఆడియన్స్ అంగీకరిస్తారా?' అని దర్శకుడు ముక్తా శ్రీనివాసన్‌తో అంటే.. 'అందరూ చెబితే ఒప్పుకోరు, నువ్వు చెబితే ఒప్పుకుంటారు, నువ్వు యాక్ట్ చెయ్' అన్నారు. ఎవరు ఏది చెబితే బావుంటుంది? ఎవరితో చెప్పించాలో దర్శక–నిర్మాతలకు బాగా తెలుసు. అందులో దూరి ఇది కాంట్రవర్సీ అవుతుందని వదులుకున్నానంటే నటిగా నష్టపోయేది నేనే. ఒకవేళ సినిమా ఫెయిల్ అయితే అది కూడా ఒక అనుభవం అవుతుంది. నేను పోగొట్టుకునేది పెద్దగా ఏమీ ఉండదు. డబ్బు పెట్టిన నిర్మాతకు నష్టం వస్తుంది. కష్టపడి దర్శకుడు రాసుకున్న స్క్రిప్ట్, కృషి వృథా అవుతుంది. నేను ఇంకో సినిమాకు ఎలాగూ వెళ్లిపోతాను. సక్సెస్ అయితే మాత్రం నాకే కదా రెమ్యూనరేషన్ పెరిగేది (నవ్వుతూ).




● **వివాదాలను బాగా ఇష్టపడతారేమో?**

1996 వరకూ అన్నీ వివాదాలే. నేనింతే అన్నట్లు ఉండేదాన్ని. ఏ అంటే అది ఏ కాదు 'అ' అనే తత్వం. ఎందుకో నాకూ తెలియదు. మా ఆయన (నటుడు–దర్శకుడు ఎం. శివచంద్రన్) 'నేను కావేరి అంటే కాదు కే ఏ ఆవేరి అంటావు. ఎందుకే అలా అంటావు' అని అడుగుతారు. నేనంటున్నవాటిని ఇంకో యాంగిల్‌లో చూడొచ్చు కదా? దేన్నయినా మూడు నాలుగు యాంగిల్స్‌లో చూడొచ్చుగా? అని నేను అంటాను. ఇలాంటి మాటలు మాట్లాడినప్పుడు కాంట్రవర్సీలు వచ్చి పడుతుంటాయి. సక్సెస్‌తో పాటు సంపాదన కూడా పెరిగినప్పుడు 'నా సంతోషం నాకు ముఖ్యం. నేను సక్సెస్ చూశాను. నేను హద్దులు దాటుతాను. జీవితం అంటే ఇదే. ఇక్కడితో ఆగు అని హద్దులు పెట్టకండి. లోకం పెద్దది'... ఇలాంటి ఆలోచన వచ్చేస్తుంది ఆడవాళ్లకు. తప్పేంటి? స్త్రీ స్వేచ్ఛగా ఉండకూడదా? తాను అనుకున్నది మాట్లాడకూడదా? మాట్లాడితే హద్దులు దాటినట్లా? స్త్రీ, పురుషుడు ఎవరి ఇండివిడ్యువాలిటీ వాళ్లకి ఉండాలి. నాకు ఇలాంటి భావాలు ఉండటంవల్ల వివాదాలు వచ్చేవి. అవంటే ఇష్టం కాదు.. అయిష్టమూ లేదు.

● **మీ అమ్మానాన్న మీకు ఫ్రీడమ్ ఇచ్చేవారా?**

నేను మా అమ్మ, తాతయ్య వాళ్లతో ఎక్కువ పెరిగాను. అది కూడా చెన్నైలో. నాన్న బెంగుళూర్‌లో ఉండేవారు. అప్పుడప్పుడు నాన్న దగ్గరకు వెళ్లి వచ్చేదాన్ని. మా ఇంట్లో ఆడపిల్లలు, మగపిల్లలు అనే తేడా లేదు. ఫ్రీడమ్ ఇచ్చారు. ఏం కావాలంటే అది చేయమన్నారు.

● **మీ నాన్నగారు డైరెక్టర్ (ఎరగుడిపాటి వరదారావు). మీ అమ్మ (కుమారి రుక్మిణి) పెద్ద ఆర్టిస్ట్. వారసత్వంగా ఇండస్ట్రీకు వచ్చారా?**

వాళ్లెవరూ నన్ను రమ్మని చెప్పలేదు. నా ఆసక్తి కొద్దీ ఇటు వచ్చాను. 'నువ్వు వచ్చిన నాలుగేళ్లలో మంచి ఆర్టిస్ట్ అయ్యావు. ఫెయిల్యూర్ వస్తే తట్టుకోగలవా? హార్డ్ వర్క్ చేయగలవా? ఒకసారి ఆలోచించుకో' అని నాన్న అన్నారు. 'చేస్తున్నాను కద నాన్నా' అని బదులిచ్చాను. 'చూస్కోరా... ఏది చేసినా 'ది బెస్ట్' అనిపించుకోవాలి' అన్నారు. ఫ్యామిలీ సపోర్ట్ లేకపోతే ఇక్కడి వరకూ వచ్చేదాన్ని కాదు. మా అమ్మ పోయాక నా బిడ్డ, మా అమ్మ, నాన్న ప్లేస్‌లోకి మా ఆయన వచ్చేశారు. లైఫ్ హ్యాపీగా గడిచిపోతోంది.


● కూతురు ఐశ్వర్యతో...

● **తల్లికి తగ్గ తనయ అనిపించుకుంటుందని మీ కుమార్తె ఐశ్వర్య నటిగా వచ్చినప్పుడు చాలా మంది ఊహించారు. మీ అంత స్థాయికి ఎదగకపోయినందుకు మీకేమైనా బాధ ఉంటుందా?**

మీ అమ్మ చేసిన పనులే మీరు చేస్తున్నారా? లేదు కదా. ప్రపంచంలో అందరికీ స్థలం ఉంటుంది. అయితే ఎవరు ఎక్కడ ఉంటారన్నది మనం చెప్పలేం. ఎండ్ ఆఫ్ ది డే వాళ్ల సంతోషమే ముఖ్యం. వాళ్ల సంతోషానికి ఏ కొరతా లేనప్పుడు మనం బాధపడాల్సిన అవసరంలేదు. ఒకవేళ అమ్మాయి ఇలా రాలేదేంటి? అనుకుంటే ఆ బాధ నన్ను లాగి కిందపడేస్తుంది. నాకు బీపీ లేదు, షుగర్ లేదు. హాయిగా, ఆరోగ్యంగా ఉన్నాను. ఇవన్నీ ఆలోచిస్తే బీపీ, షుగర్ అన్నీ వస్తాయి. అందుకే ఏదీ ఆలోచించను.

లేదంటే నాకు ఎక్కడ సక్సెస్ వస్తుంది? టెన్షన్‌తోనే ఉండేదాన్ని. అయినా ఈ ప్రపంచంలో ఎవరికి వారు ఒంటరే అని నా ఫీలింగ్. ఐదు నిమిషాల ముందు నాన్న, బాబాయి అని హాస్పిటల్‌లో చేయి పట్టుకొని ఏడుస్తాం. చనిపోయిన తర్వాత బాడీని వ్యాన్ ఎక్కించారా అంటారు. అయ్య బాబోయ్.. అప్పుడే బాడీ అయిపోయిందా? దట్సాల్. ఉన్నంతవరకూ మన మేంటో చూసుకొని వెళ్లిపోవడమే.

● **మనమేంటో అన్నట్లు ఉండలేం కదా. బంధాలతో కట్టివేయబడతాం. ఈ చక్రాన్ని తప్పించుకోలేమేమో?**

అది ఇండియన్ సిస్టమ్. మన పిల్లలకి సంపాదించి పెట్టాలి, వాళ్లకన్నీ చేసి పెట్టాలని తాపత్రయపడతాం. వెంటబడుతూ అన్నం తినిపిస్తుంటాం. ఓ మదర్‌గా అదో అందమైన విషయం. అది ఈ జన్మకు హ్యాపీగానే ఉంది. అయితే పిల్లల్ని వాళ్లంతట వాళ్లు ఎదగనివ్వాలి. వాళ్లు వెళ్లిపోవాలి. వెళ్లిపోయేప్పుడు వెళ్లకు.. వెళ్లకు అని వెంటబడటాన్ని మించిన స్వార్థం ఏదీ ఉండదు. మనం నిజంగా స్వార్థపరులు కాదంటే వాళ్లకు నిజంగా ఇష్టమైనది ఏదో తెలుసుకొని ఆ విషయంలో గైడ్ చేయాలి. నా వయసు వాళ్లకు గతం ఉంటుంది చెప్పుకోవడానికి. ఫ్యూచర్ ఏముంటుంది? చిన్నవాళ్లకు ఫ్యూచర్ ఉంటుంది. అది అర్థం చేసుకొని వాళ్ల దారిలో వాళ్లను వెళ్లనివ్వాలి. మనం బంధాలను ఎంజాయ్ చేయాలి. అయితే వాటి మీద ఎక్కువ ఆశలు పెట్టుకోకూడదు.

● **చాలా హుషారుగా, నాన్‌స్టాప్‌గా మాట్లాడుతున్నారు. మీ హెల్త్ సీక్రెట్స్ చెబుతారా?**

మంచి మీదా భగవంతుడి మీదా నమ్మకం ఉంది. నీకు దిష్టి తగిలింది. అందుకే ఆరోగ్యం బాలేదు అంటారు. ఎంతో పొల్యూషన్‌తో నిండిన దేశంలో బతుకుతున్నాం మనం. ఎవరికైనా ఎప్పుడైనా ఏదైనా వస్తుంది. దాన్ని దిష్టి అంటారు. నేను నమ్మను. నా సీక్రెట్ ఏంటంటే 'ఐయామ్ ప్రాక్టీసింగ్ హ్యాపీనెస్'. అవును.. సంతోషాన్ని ప్రాక్టీస్ చేస్తున్నాను. దానికి కారణం నా భర్త, నా ఫ్యామిలీ. ఆయన లేకపోతే నాకు అస్సలు కుదరదు. కో యాక్టర్‌గా, డైరెక్టర్‌గా తన కెరీర్‌ను త్యాగం చేసి ఆయన ఓ తల్లిలా నన్ను ముందుకు తీసుకువెళుతున్నారు.


● భర్త శివచంద్రన్‌తో...

● **ఎవరి ఇండివిడ్యువాలిటీ వాళ్లకి ఉండాలని ఇందాకే అన్నారు కదా. మరి మీకోసం మీ భర్త త్యాగం చేస్తే కాదనలేదా?**

ఇదే మాట నేను ఆయన్ని అడిగితే ఆయనొక మాట అన్నారు. 'నువ్వో గొప్ప ఆర్టిస్ట్‌వి. ఇంత మంచి ఆర్టిస్ట్‌ని నువ్వు సినిమాలు చేయొద్దు. నేను మాత్రమే పని చేసుకుంటాను అని చెప్పడానికి మించిన ద్రోహం ఏదీ లేదు లక్ష్మి.. ఫర్వాలేదు. నీకోసం నా కెరీర్‌ని వదులుకుంటాను' అన్నారు. 33 ఏళ్ల క్రితం ఎలా అయితే నన్ను ఎయిర్‌పోర్ట్‌లో వదిలి, ఊరు నుంచి తిరిగి వచ్చేటప్పుడు ఎలా తీసుకువెళ్లేవారో ఇప్పటికీ అలానే చేస్తున్నారు. ఆయన లేకుండా నా జీవితాన్నే ఊహించలేను.

● **బంధాలను ఎంజాయ్ చేయాలి. వాటిమీద ఎక్కువ ఆశలు పెట్టుకోకూడదు అనే ఫిలాసఫీ చెప్పారు. ఆయన లేకుండా జీవితాన్ని ఊహించలేనంటున్నారు. ఎవరు ముందు..? అనేది మన చేతుల్లో ఉండదు కదా?**

రెండు విఫలమైన బంధాల తర్వాత నేను ఒంటరిగానే ఉండాలనుకున్నాను. కానీ మా అమ్మ సపోర్ట్‌గా ఉండేది. ఆ తర్వాత నేను ఆయన్ను ఇష్టపడ్డాను. పెళ్లి చేసుకున్నాం. ఆయన నాకెంతో ధైర్యం చెప్పారు. ఇప్పుడు ఇద్దరం సంతోషంగా ఉన్నాం. రేపు ఎవరు పోయినా ఇంకొకరికి బాధ. జీవితంలో సహజంగా జరిగే ఆ విషాదాన్ని జీర్ణించుకోవడం కష్టమే. ఎవరు ముందు పోతారో చెప్పలేం కదా. ఎవరు పోయినా ఇంకొకరికి 'ఎమ్‌టీనెస్' మిగులుతుంది. భవిష్యత్‌లో జరగబోయేదానికి నేను, ఆయన మానసికంగా రెడీ అవ్వాలి. అది కష్టమే. మాకనే కాదు. ఎవరికైనా కష్టమే. ఆ నొప్పి ఉంటుంది. మనుషులమే కదా మనం.

● **మీ మూడో మ్యారేజ్ సక్సెస్‌ఫుల్. శివచంద్రన్ గారితో దాదాపు 33 ఏళ్ల మీ వైవాహిక జీవితం స్ట్రాంగ్‌గా ఉంది. మరి మీ జీవితంలో ఉన్న రెండు ఫెయిల్యూర్ మ్యారేజెస్‌కి కారణం ఎవరు?**

నేనూ కారణం అయ్యుండొచ్చు. వేరొకరి పేరు ఎందుకు చెప్పాలి? రెండు వైపులా కారణం అయితేనే విడిపోవడం జరుగుతుంది. ఒకటి మాత్రం మూడు నెలలు కూడా సాగలేదు. మా ఫ్యామిలీ వాళ్లు ఒత్తిడి చేస్తే పెళ్లి చేసుకున్నాం. 3 నెలల్లో అయిపోయింది. 'చాలా సంతోషం. నన్ను వదలండి' అని మా వాళ్లతో అన్నాను. ఆ తర్వాత నేను ఇష్టపడి పెళ్లి చేసుకున్నా. అదీ విఫలం అయింది. 'నేను' అనే ఇగోలు ఉంటాయి. వాళ్లే తప్పు అనలేం. మన తప్పూ ఉండొచ్చు. ఏదైతేనేం రెండు పెళ్లిళ్లు విఫలం అయ్యాయి.

● **నచ్చకపోతే విడిపోవడం అంత సింపులా? వివాహ బంధం ఎంతో బలమైనది, సర్దుకుపోవాలి అంటారు కదా?**

అనుభవం ఉంది కాబట్టి.. ఆడవాళ్లందరికీ ఈ మాట చెబుతున్నాను. ఈ సక్సెస్‌ఫుల్ కెరీర్ లేకుండా ఉంటే ఏదో నా ఖర్మ అనుకొని సర్దుకుపోయేదాన్ని. సక్సెస్‌ఫుల్ కెరీర్ వచ్చాక ఈ నాన్‌సెన్స్‌ని నేను తట్టుకోవాల్సిన అవసరం లేదనిపించింది. మనం ఏదో అనుకుని ఒక బంధాన్ని మొదలుపెడతాం. అది ఇంకేదో అయినప్పుడు అందులోనే కొనసాగడంలో అర్థం లేదు. ఆ శూన్యం కనిపించినప్పుడు తప్పు నా వైపు కూడా ఉందేమో? ఆ శూన్యంలో ఉన్నప్పుడు మనకంటూ ఎవరూ వద్దా? అనే ఆలోచన వచ్చేది. అప్పుడు పెద్దమ్మాయి (నటి ఐశ్వర్య) నాతోనే ఉంది. 'అమ్మా ఎప్పుడు చూసినా రామకృష్ణ మఠానికి వెళ్లి కూర్చుంటున్నావు. నీకంటూ ఎవరుంటారు?' అంది. 'నాకు ఈ భూమి ఉంది, సక్సెస్‌ఫుల్ కెరీర్ ఉంది' అన్నాను. కానీ మా అమ్మవాళ్లు 'ఒంటరిగా ఎలా ఉంటావు?' అని అన్నారు. అదే మనం చేస్తున్న తప్పు. మగాడిని వదిలేస్తాం. 'నువ్వు ఒంటరిగా ఎలా ఉంటావు?' అని ఆడవాళ్లను అడుగుతాం. 'నువ్వు ఒంటరిగా ఉండాలంటే ఉండు. ఏం ఉండకూడదా?' అనేది నా పంతం. అందుకే ఒంటరిగానే ఉంటానన్నాను. అయితే మళ్లీ పెళ్లి చేసుకుంటానని అనుకోలేదు. మనం అనుకోలేదని ఆగవు కదా. అనుకున్నామని జరగవు కదా.


● 'ఓ బేబి' షూటింగ్ లొకేషన్‌లో... దర్శకురాలు నందినీరెడ్డి, సమంత, రాజేంద్రప్రసాద్‌లతో లక్ష్మి

● **మీరన్నట్లు మగవాళ్లు ఒంటరిగా ఉండటం పెద్ద విషయం కాదు కానీ స్త్రీ ఒంటరిగా ఉండకూడదంటారు. ఒకవేళ ఉంటే కొందరు వేరే 'రంగు' పులమడానికి ప్రయత్నిస్తుంటారు.. ఆ విషయం గురించి?**

అప్పటితో పోలిస్తే ప్రస్తుతం సొసైటీ డిఫరెంట్‌గా ఉంది. ఇద్దరు ముగ్గురు అమ్మాయిలు ఒక రూమ్ తీసుకొని ఉంటున్నారు. అయితే, దానికి వేరే రంగు పెడుతున్నారు. నిజమే. అదే మగవాళ్లు ఒంటరిగా ఉంటే వేరే రంగు పెట్టరు. వాళ్లు మగవాళ్లు అంటారు. ఎందుకీ తేడా? ఒంటరి స్త్రీపై బురద చల్లాలనుకోవడం ఎందుకు? అది తప్పు. అమ్మాయిలను ధైర్యంగా పెంచాలంటాను. పిల్లలకి కంప్యూటర్‌తో పాటు కరాటే కూడా నేర్పించండి. ముఖ్యంగా ఆడపిల్లలకు. కంప్యూటర్ నేర్చుకొని డబ్బులు సంపాదించుకోవడమే జీవితం కాదు. కరాటే నేర్చుకుంటే ఫ్యూచర్‌లో భరోసా ఉంటుంది. అమ్మాయిలు చాలా స్ట్రాంగ్‌గా ఉండాలి. నాలుగేళ్ల బిడ్డ, రెండేళ్ల బిడ్డలను రేప్ చేయడం ఏంటి? అలాంటి తక్కువ స్థాయికి దిగిపోయారు. మన సెక్యూరిటీ మనమే చూసుకోవాలి. అందుకే కరాటే నేర్చుకోవాలి. తప్పుగా ప్రవర్తిస్తే లాగి రెండు ఇస్తే సరిపోతుంది.

● **ఫైనల్లీ... ఇప్పుడు ఏం సినిమాలు చేస్తున్నారు? నటిగా 50 ఏళ్లకు పైగా సాగుతున్న జర్నీ గురించి?**

'మన్మథుడు–2', 'గ్యాంగ్ లీడర్' సినిమాలు చేస్తున్నాను. తమిళంలో చైల్డ్ ఆర్టిస్ట్‌గా చేసిన 'శ్రీవల్లి' (1961) నా మొదటి సినిమా. 68 నుంచి హీరోయిన్‌గా తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో చేయడం మొదలుపెట్టాను. 'శిల నేరంగళిల్ శిల మణిదరగళ్' సినిమాకి నేషనల్ అవార్డు అందుకున్నా. తెలుగులో 'బాంధవ్యాలు' నా మొదటి సినిమా. ఆ తర్వాత హీరోయిన్‌గా ఎన్నో సినిమాలు చేశాను. నటిగా సంతృప్తి ఉంది. ఎన్నో ఏళ్ల నుంచి ప్రేక్షకులు నన్ను చూస్తున్నారు కాబట్టి నేను వాళ్ల ఇంట్లో మనిషిని అయిపోయాను. ఐయామ్ హ్యాపీ.

**– డి.జి. భవాని**

## అందం.. ఆరోగ్యం... కాంతిమంతం

బ్యూటిప్స్

ఒక కప్పులో చెంచా సెనగపిండి, అర చెంచా గోధుమ పిండి, చెంచా పెరుగు, చిటికెడు పసుపు వేసి మిశ్రమంలా తయారు చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి అప్లై చేస్తూ చేతి వేళ్ళతో మసాజ్ చేస్తూ రాసుకోవాలి. 30 నిమిషాల తరువాత చల్లని నీటితో శుభ్రం చేసుకోవాలి. ఈ ప్యాక్ వాడటం వలన ముఖంపై ఉండే మొటిమలు, మచ్చలు తగ్గిపోవడంతోపాటు చర్మానికి మంచి రంగు వస్తుంది. దీనిని కేవలం ముఖానికి కాదు,



చర్మం అంతటికి కూడా రాసుకోవచ్చు. దీని వల్ల చర్మంపై ఉండే బాక్టీరియా నశించి చర్మం ఆరోగ్యంగా, కాంతివంతంగా మృదువుగా ఉంటుంది. ఈ విధంగా వారానికి రెండు సార్లు అప్లై చేయడం వలన ముఖాన్ని ఎల్లప్పుడూ అందంగా, ఆరోగ్యంగా, కాంతిమంతంగా ఉంచుకోవచ్చు.



## ఈ పాటకు ట్యూన్ తెలుసా?



**పల్లవి :**
ఓకే అనేశా దేఖో నా భరోసా
నీకే వదిలేశా నాకెందుకులే రభసా
॥ఓకే॥
భారమంతా నేను మోస్తా అల్లుకో ఆశాలత
చేరదీస్తా సేవ చేస్తా రాణిలా చూస్తా
అందుకేగా గుండెలో నీ పేరు రాశా
తెలివనుకో తెగువనుకో మగజన్మ కదా
కథ మొదలనుకో తుది వరకు నిలబడగలదా
॥ఓకే॥

**చరణం : 1**

పరిగెడదాం పదవే చెలీ... ఎందాకా అన్నానా
కనిపెడదాం తుది మజిలీ... ఎక్కడున్నాం
ఎగిరెళదాం ఇలనొదిలి... నిన్నాగమన్నానా
గెలవగలం గగనాన్ని... ఎవరాపినా
మరోసారి అను
ఆ మాట మహారాజునైపోతాగా
ప్రతి నిమిషం నీకోసం...
ప్రాణం సైతం పందెం వేసేస్తా
పాత ఋణమో కొత్త వరమో
జన్మ ముడి వేసిందిలా
చిలిపి తనమో చెలిమి గుణమో ఏమిటీ లీల
స్వప్నలోకం ఏలుకుందాం రాగమాలా
అదిగదిగో మదికెదురై కనబడలేదా
కథ మొదలనుకో తుది వరకు నిలబడగలదా

**చరణం : 2**

పిలిచినదా చిలిపి కల... వింటూనే వచ్చేశా
తరిమినదా చెలియనిదా... పరుగుతీశా
వదిలినదా బిడియమిలా... ప్రశ్నల్ని చెరిపేశా
ఎదురవదా చిక్కు వల... ఎటో చూశా
భలేగుందిలే నీ ధీమా భరిస్తుందిలే ఈ ప్రేమ
అదరకుమా బెదరకుమా...
పరదా విడిగా సరదా పడదామా
పక్కనుంటే ఫక్కుమంటూ
నవ్వినాడా ప్రియతమా
చిక్కులుంటే బిక్కుమంటూ లెక్క చేస్తామా
చుక్కలన్నీ చిన్నబోవా చక్కనమ్మా
మమతనుకో మగతనుకో మతి చెడిపోదా
కథ మొదలనుకో తుది వరకు నిలబడగలదా

కట్‌చేస్తే...దాచేస్తే...

**చిత్రం : కొత్తబంగారులోకం (2008)**
**రచన : సిరివెన్నెల**
**సంగీతం : మిక్కీ జె.మేయర్**
**గానం : నరేష్ అయ్యర్, కళ్యాణి**

## కాసుకో సుడోకు

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | | 4 | 7 | 9 | 3 | | 2 | |
| 1 | 2 | | | 8 | | 4 | | 3 |
| 3 | 9 | | 4 | | | 5 | | 7 |
| 7 | 4 | 3 | | | | | | |
| | | | | | | | | |
| | | | | | | 8 | 4 | 6 |
| 6 | | 2 | | | 4 | | 1 | 5 |
| 9 | | 8 | | 1 | | | 3 | 4 |
| | 3 | | 2 | 5 | 9 | 7 | | |

నిబంధనలు: ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా,నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3×3 చదరంగ బాక్సు 1 నుంచి 9 అంకెలు రావాలి.

నిన్నటి జవాబు

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 8 | 6 | 7 | 2 | 5 | 3 | 4 | 1 | 9 |
| 4 | 2 | 5 | 1 | 9 | 8 | 7 | 6 | 3 |
| 1 | 9 | 3 | 4 | 7 | 6 | 2 | 8 | 5 |
| 6 | 8 | 2 | 5 | 3 | 7 | 1 | 9 | 4 |
| 5 | 3 | 4 | 6 | 1 | 9 | 8 | 2 | 7 |
| 9 | 7 | 1 | 8 | 2 | 4 | 5 | 3 | 6 |
| 3 | 5 | 9 | 7 | 8 | 1 | 6 | 4 | 2 |
| 2 | 1 | 6 | 3 | 4 | 5 | 9 | 7 | 8 |
| 7 | 4 | 8 | 9 | 6 | 2 | 3 | 5 | 1 |


పాయల్ రాజ్‌పుత్, శ్రద్ధా కపూర్, రాయ్‌లక్ష్మి, శ్రద్ధా దాస్, అంజలి

# బేడీలు వేస్తాం!


పాయల్ రాజ్‌పుత్, రాయ్ లక్ష్మి, రేవతి, జ్యోతిక, వరలక్ష్మి

పువ్వులు పట్టుకున్న ముద్దు గుమ్మల చేతులు లాఠీలు పట్టుకున్నాయి. తమ పెర్ఫార్మెన్స్‌తో థియేటర్స్‌లో ప్రేక్షకుల మనసులను లాక్ చేయాలని ఈ ముద్దుగుమ్మలు తమలోని అదర్ సైడ్‌ని చూపించడానికి రెడీ అయిపోయారు. సీరియస్ అండ్ సిన్సియర్ పోలీసాఫీసర్లుగా కనిపించి, విలన్లను రఫ్ఫాడించడానికి సిద్ధమైన ఆ హీరోయిన్ల గురించి తెలుసుకుందాం.

'నిశ్శబ్దం' చిత్రం కోసం అమెరికా పోలీసాఫీసర్ అవతారం ఎత్తారు అంజలి. ఈ గెటప్‌లో సెట్ కావాలని దాదాపు ఎనిమిది కిలోల బరువు కూడా తగ్గారామె. ఇటీవల ఈ సినిమాలో అంజలి పాత్ర చిత్రీకరణ మొదలైంది. హేమంత్ మధుకర్ దర్శకత్వంలో నాలుగు భాషల్లో తెరకెక్కుతున్న ఈ సినిమాలో అనుష్క, మాధవన్, షాలినీ పాండే, మైఖేల్ మ్యాడ్‌సన్ ముఖ్య పాత్రలు చేస్తున్నారు. ఇక 'ఆర్‌ఎక్స్ 100' సినిమాలో గ్లామరస్‌గా రెచ్చిపోయిన పాయల్ రాజ్‌పుత్ ఇటీవల పోలీసాఫీసర్‌గా చార్జ్ తీసుకున్నారు. ఈ చిత్రం గురించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది. అటు చెన్నైకి వెళితే హీరోయిన్లు జ్యోతిక అండ్ రేవతి ఇద్దరూ కలిసి ఒకే పోలీస్‌స్టేషన్‌లో డ్యూటీ చేస్తున్నారు. వీరిద్దరి డ్యూటీ 'జాక్‌పాట్' అనే తమిళం సినిమా కోసం. ఈ సినిమాకు కల్యాణ్ దర్శకత్వం వహించారు. తమిళంలో మరో భామ పోలీస్‌గా కనిపించబోతున్నారు. ఆమె ఎవరో కాదు.. నటి, డాటరాఫ్ శరత్‌కుమార్. ఓ డాగ్‌ని వెంటపెట్టుకుని పోలీసాఫీసర్‌గా ఓ కేసును దర్యాప్తు చేస్తున్నారు వరలక్ష్మీ శరత్ కుమార్. ఆమె ఇన్విస్టిగేషన్ రిపోర్ట్‌ను 'డానీ' సినిమాలో చూడాలి. ఈ కేసును సంతానమూర్తి డైరెక్ట్ చేస్తున్నారు. తెలుగులో పలు చిత్రాల్లో గ్లామరస్ హీరోయిన్‌గా కనిపించిన రాయ్ లక్ష్మి ఇప్పుడు కన్నడంలో ఇంటర్‌పోల్ ఆఫీసర్‌గా ఓ సీక్రెట్ ఆపరేషన్ చేస్తున్నారు. ఆమె స్కెచ్ హీరో సుదీప్ కోసమే. పోలీస్‌గా ఆమె వేసిన మాస్టర్ ప్లాన్ ఏంటో 'కోటిగొబ్బ 3' సినిమాలో తెలుస్తుంది. మొన్నామధ్య ఫైటింగ్, ఫైరింగ్ గట్రా నేర్చుకున్నారు హీరోయిన్ రాయ్‌లక్ష్మి. ఇంత కష్టపడింది ఆమె కన్నడ చిత్రం 'ఝూన్సీ'లో పోలీస్ గెటప్ వేయడం కోసమే. పీవీఆర్ గురుప్రసాద్ ఈ చిత్రానికి డైరెక్టర్.


కరీనా కపూర్


రాణీ ముఖర్జీ

సౌత్‌లోనే కాదు.. బాలీవుడ్ భామలు కొందరు పోలీస్ సైరన్ మోగిస్తున్నారు. ప్రభాస్ హీరోగా నటిస్తున్న చిత్రం 'సాహో'. ఈ సినిమాతో సౌత్‌కు పరిచయం అవుతున్నారు బాలీవుడ్ బ్యూటీ శ్రద్ధాకపూర్. ఈ సినిమాలో శ్రద్ధాది పోలీస్ పాత్రే అని ఆల్రెడీ విడుదలైన 'సాహో' టీజర్ చెబుతోంది. 'అంగ్రేజీ మీడియం' సినిమా కోసం గన్ పట్టుకున్నారు కరీనా కపూర్. ఈ సినిమాకు హోమి అడ్జానియా దర్శకుడు. ఇర్ఫాన్ ఖాన్ హీరోగా నటిస్తున్నారు. ముంబైలో జరిగే అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని మళ్లీ శివానీ శివాజీ రాయ్‌గా డ్యూటీ చేస్తున్నారు రాణీ ముఖర్జీ. శివాజీ రాయ్ అనగానే 'మర్దానీ' చిత్రం గుర్తుకు వచ్చే ఉంటుంది. ప్రస్తుతం తెరకెక్కుతున్న ఈ సినిమా సీక్వెల్ 'మర్దానీ 2'లో రాణీముఖర్జీ నటిస్తున్నారు. ఫస్ట్ పార్ట్‌కి కథ అందించిన గోపీ పుత్రన్ సీక్వెల్‌ను డైరెక్ట్ చేస్తున్నారు.

# మళ్లీ నిన్నే పెళ్లాడతా


శ్రీధర్‌బాబు, వైకుంఠ బోను, అమన్, నాగార్జున, బొల్లినేని రాజశేఖర్

నాగార్జున–కృష్ణవంశీ కాంబినేషన్‌లో వచ్చిన బ్లాక్‌బస్టర్ చిత్రం 'నిన్నే పెళ్లాడతా'. ప్రస్తుతం ఈ టైటిల్‌తోనే ఓ చిత్రం తెరకెక్కుతోంది. రకుల్ ప్రీత్ సింగ్ సోదరుడు అమన్ హీరోగా వైకుంఠ బోను దర్శకత్వం వహిస్తున్నారు. బొల్లినేని రాజశేఖర్ చౌదరి, వెలుగోడు శ్రీధర్‌బాబు నిర్మాతలు. ఈ చిత్రం టైటిల్ లోగోను నాగార్జున రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు వైకుంఠ బోను మాట్లాడుతూ – ''లోగో రిలీజ్ చేసిన నాగార్జునగారికి కృతజ్ఞతలు. మంచి కథాంశంతో ఈ చిత్రం చేస్తున్నాం. ఇప్పటికి 50 శాతం షూటింగ్ పూర్తయింది. ఆగస్టులో కొత్త షెడ్యూల్ ప్రారంభిస్తాం. అక్టోబర్‌లో రిలీజ్ ప్లాన్ చేస్తున్నాం'' అన్నారు. ''కథ చాలా డిఫరెంట్‌గా ఉంటుంది. వైజాగ్, కులుమనాలిలో ఓ షెడ్యూల్ చేస్తాం'' అన్నారు నిర్మాతలు. ఈ చిత్రానికి కెమెరా: ఈదర ప్రసాద్, సంగీతం: నవనీత.

# మా ఊరిని చూపించాలనుంది


ఆచార్య వేణు

''కెమెరా, చక్కటి కథనం చాలు అద్భుతాలు సృష్టించడానికి'' అంటారు సినిమాటోగ్రాఫర్ ఆచార్య వేణు. ఇంతకీ ఎవరీ వేణు అంటే షాంగై ఫిల్మ్ ఫెస్టివల్‌లో అవార్డ్ అందుకున్న తొలి భారతీయ కెమెరామేన్. అనుభవం ఒక్క సినిమానే. అదీ గారో భాషలో తీసిన మేఘాలయ సినిమా. రాజయ్యపల్లి, వరంగల్‌లో పుట్టిన వేణు ఆచార్యకి పదో తరగతి నుంచి కెమెరామేన్ అవాలనే కోరిక ఉండేది. ''చిన్నప్పటి నుంచే నాకు డ్రాయింగ్ మీద ఆసక్తి ఉండేది. గొప్ప ఆర్టిస్ట్ అని చెప్పను కానీ నాకు ఆర్ట్స్ మీద ఆసక్తి ఉందని అర్థమైంది. ఓసారి హైదరాబాద్ జెయన్‌టీయూ నుంచి కొందరు స్టూడెంట్స్ మా ఊరు వచ్చారు. ఆసక్తి ఉంటే ఆర్ట్స్ కాలేజీలో చేరి సినిమాటోగ్రాఫర్ కావచ్చని సలహా ఇచ్చారు. అలాగే చేశాను'' అని బాల్యాన్ని గుర్తుచేసుకున్నారు. ఆసియా ఖండంలో జరిగే అతిపెద్ద ఫిల్మ్ ఫెస్టివల్ షాంగై ఫిల్మ్‌ఫెస్టివల్. ప్రపంచవ్యాప్తంగా వచ్చిన 15 నామినేషన్లలో 'మా.అమా' అనే చిత్రానికి వేణు ఈ అవార్డు పొందారు. ''మేఘాలయా చూడటానికి అద్భుతంగా ఉంటుంది. కానీ బ్యూటిఫుల్ లొకేషన్స్ ఏం మా సినిమాలో లేవు. కేవలం 8 లక్షల్లో సినిమా తీశాం. డొమ్నిక్ సంగ్మా ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. ఈ సినిమాలో అందరూ కెమెరాకు కొత్త వాళ్లే కావడం విశేషం. ఇంతకుముందు 'జెర్సీ' సినిమాకు సెకండ్ యూనిట్ కెమెరామేన్‌గా కూడా చేశాను. త్వరలోనే దర్శకత్వం కూడా చేయాలని, మా ఊరిని, అక్కడి ప్రజలను చూపించాలనుంది. అవార్డు తీసుకొని ఇంటికి వెళ్లగానే అమ్మ చిన్నగా నవ్వి ఇంతకీ తిన్నావా? అని అడిగింది. జీవితంలో కొన్ని విషయాలు ఎప్పటికీ మారవు అనిపించింది నాకు'' అన్నారు వేణు.


ధనుష్

## ఫారిన్ గ్యాంగ్‌స్టర్

ధనుష్ హీరోగా 'పిజ్జా, పేట' చిత్రాల ఫేమ్ కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కనుందని కోలీవుడ్‌లో ఎప్పట్నుంచో వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా గురించిన అధికారిక ప్రకటన శుక్రవారం వెల్లడైంది. రిలయన్స్ ఎంటర్‌టైన్మెంట్స్‌తో కలిసి ఈ సినిమా నిర్మించనున్నట్లు వై నాట్ స్టూడియో సంస్థ తెలిపింది. ఇందులో ఐశ్వర్యాలక్ష్మీ హీరోయిన్‌గా నటించనున్నారు. ఈ సినిమా చిత్రీకరణ ఆగస్టులో ప్రారంభం కానుంది. గ్యాంగ్‌స్టర్ నేపథ్యంలో ఈ సినిమా తెరకెక్కనుంది. షూటింగ్ మొత్తాన్ని యూకేలో జరుపనున్నట్లు చిత్రబృందం తెలిపింది. ఈ సినిమాకు సంతోష్ నారాయణన్ సంగీతం అందించనున్నారు.


మోహన్ లాల్

## నవ్వించే ఇట్టిమాణి

'ఒడియన్, లూసిఫర్' సినిమాలలో పూర్తి సీరియస్ పాత్రలను చేశారు మోహన్‌లాల్. ప్రస్తుతం వాటికి భిన్నంగా పూర్తిస్థాయి హాస్య చిత్రం చేశారు. 'ఇట్టిమాణి: మేడ్ ఇన్ చైనా' అనే పేరుతో ఈ సినిమా తెరకెక్కింది. జిబి, జోజు ఈ సినిమాకు దర్శకత్వం వహించారు. చైనా దేశ మూలాలున్న త్రిచూర్ క్రిస్టియన్ పాత్రలో మోహన్‌లాల్ నటించారు. ఈ సినిమా షూటింగ్ పూర్తయింది. హనీ రోస్, రాధికా శరత్‌కుమార్, సిద్ధిఖీ ముఖ్య పాత్రల్లో నటించారు. త్వరలోనే సినిమా రిలీజ్ కానుంది.


రజిత్, త్రిషాలాషా

## ధమ్కీ ఇవ్వడం పూర్తయింది

రజిత్, త్రిషాలాషా జంటగా ఏనుగంటి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ధమ్కీ'. సత్యనారాయణ సుంకర నిర్మాత. క్రైమ్, యాక్షన్, థ్రిల్లర్‌గా తెరకెక్కిన ఈ చిత్రం షూటింగ్ పూర్తయింది. ఈ సందర్భంగా దర్శకుడు ఏనుగంటి మాట్లాడుతూ – ''ధమ్కీ' చిత్రం వాస్తవిక సంఘటనల ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. అన్ని వర్గాల వారినీ ఆకట్టుకునే చిత్రమిది. బిత్తిరి సత్తి కామెడీ ప్రేక్షకులను నవ్విస్తుంది'' అన్నారు. ''పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. దర్శకుడు చెప్పిన కథ బాగా నచ్చింది. ఖర్చుకి వెనకాడకుండా ప్రేక్షకుడికి కొత్త అనుభూతిని ఇవ్వడానికి ప్రయత్నించాం. రామ్ లక్ష్మణ్ ఫైట్స్, శ్రీమణి సాహిత్యం, మా సినిమాకు ప్లస్ అవుతాయి అనుకుంటున్నాం'' అన్నారు నిర్మాతలు. ఈ సినిమాకు కెమెరా: దీపక్ భగవంత్, సంగీతం: ఎపి.బి ఆనంద్.





వైజాగ్ : జగదాంబ - ఐనాక్స్ వరుణ్ - ఐనాక్స్ సిఎంఆర్ - ఐనాక్స్ చిత్రాలయ - ముక్తా ఎ2 సినిమాస్ - శరత్ - శ్రీవేంకటేశ్వర - కామేశ్వరి - లక్ష్మీనరసింహా | (గాజువాక) మోహిని 35ఎంఎం - కన్య | విజయనగరం: ఐనాక్స్ ఎన్‌సిఎస్ మాల్ - రజని & శివరజని | నరసింహ (గోపాలపట్నం) | కన్య (నర్సీపట్నం) | సత్యనారాయణ మినీ (అనకాపల్లి) | సూర్యమహాల్ (శ్రీకాకుళం) | వెంకటేశ - (నర్సన్నపేట) | విజయవాడ: ఐనాక్స్ ఎల్ఇపిఎల్ - ఐనాక్స్ ఊర్వశి - సినీపోలిస్ - సినీపోలిస్ పవర్ వన్- క్యాపిటల్ సినిమాస్ - మీరజ్ - శాంతి ప్రశాంతి - పివిఆర్ సినిమాస్ - నవరంగ్ - అన్నపూర్ణ - యువరాజ్ | టిబిఆర్ (బొబ్బిలి) | టిబిఆర్ (పార్వతీపురం) | ఎస్‌టిబిఎల్ బాలాజి (శిలనాగారం) | ఎస్‌టిబిఎల్ బాలాజి (మధురవాడ) | ఎస్‌టిబిఎల్ బాలాజి (అచ్యుతాపురం) | గణేష్ (తగరపువలస) | ఐనాక్స్ ఎస్ఆర్ఎంటి - గీత్ - సత్యగౌరీ - పద్మప్రియా - చాణిక్య & చంద్రగుప్త (కాకినాడ) | సూర్య మినీ - అనుశ్రీ - గీత్ అప్సర - రాజ (రాజమండ్రి) | వెంకటపద్మావతి (అమలాపురం) | సత్యశ్రీ (మండపేట) | శ్రీ లలిత (పెద్దాపురం) | వేణుగోపాల్ (లక్కవరం) | పూర్ణ (పిఠాపురం) | గణేష్ (సామర్లకోట) | అన్నపూర్ణ (తాటిపాక) | రాజవాణి (జగ్గయ్యపేట) | సింధూరు (గుడివాడ) | రామ్‌రాజ్ (మచిలీపట్నం) | రవీంద్ర (పాయకాపురం) | తిరుమల (నూజివీడు) | శ్రీనివాస (ఉయ్యూరు) | వెంకటేశ్వర (కైకలూరు) | నటరాజ్ (జగ్గయ్యపేట) | స్వర్ణ సినిమ్యాక్స్ (ఇబ్రహీంపట్నం) | శ్రీనివాస (పోరంకి) | (ఏలూరు) అంబికా మినీ - క్రాంతి | (భీమవరం) ఎవిజి - కిశోర్ మినీ - నటరాజ్ | శ్రీగౌరీ (చింతల్‌పూడి) | శ్రీచిత్ర (తణుకు) | లక్ష్మీనారాయణ (తాడేపల్లిగూడెం) | సౌభాగ్య (జంగారెడ్డిగూడెం) | గీత అన్నపూర్ణ (పాలకొల్లు) | వెంకటగంగారత్న (ఆకువీడు) | (గుంటూరు) జెఎల్ఇ సినిమాస్ - వి సెల్యూలాయిడ్ ప్లాటినో సినిమాస్ - ది సినిమా - భాస్కర్ ఎస్‌సిఎన్-1 (వైభవ్ సినిమాస్) - బాలీవుడ్ ఎ/సి - హాలీవుడ్ - సినిప్లెమ్ | (తెనాలి) లక్ష్మి కాంప్లెక్స్ - పెమ్మసన్ని | సాయి కార్తిక్ (చిలకలూరిపేట) | విజేత (నర్సరావుపేట) | (ఒంగోలు) గోరంట్ల మల్టీప్లెక్స్ - ఎస్‌సిఎన్-1 - కార్నివాల్ రవి ప్రియా - కృష్ణా | గోపాలకృష్ణ (మంగళగిరి) | బసవేశ్వర (రేపల్లి) | శ్రీనివాస (సత్తెనపల్లి) | (నెల్లూరు) ది సినిమా - ఎస్2 సినిమాస్ | మానస (కావలి) | (కర్నూలు) ఐనాక్స్ జ్యోతి మాల్ - భరత్ - ఆనంద్ సినీ కాంప్లెక్స్ - ఎస్‌సిఎన్2 | (నంద్యాల) | శ్రీరామ - మినీ పర్‌తాప్ | (ఆదోని) సత్యం - ద్వారకా కాంప్లెక్స్ ఎస్‌సిఎన్-1 | శివప్రియా (ఎమ్మిగనూరు) | జిఎం పిక్చర్ ప్యాలెస్ (బనగానపల్లి) | (అనంతపూర్) ఎస్‌విసి సినిమా - త్రివేణి కాంప్లెక్స్ - గాయత్రి | బాలాజి (హిందూపూర్) | రంగ (ధర్మవరం) | రవి - సాయిబాబా (కడప) | కుమార్ (ప్రొద్దుటూరు) | సిద్దేశ్వర (ఆర్ఎల్‌వై కోడూరు) | (తిరుపతి) పిజిఆర్ - సంధ్య - శ్రీనివాస తేజ | విజయలక్ష్మి (చిత్తూరు) | రవి (మదనపల్లి) | పద్మ పిక్చర్ ప్యాలెస్ (రేణిగుంట) | ఎస్‌జె సినిమాస్ శ్రీనివాస పిక్చర్ ప్యాలెస్ (నగరి) | విజయలక్ష్మి (శ్రీకాళహస్తి) | బాలాజి (పుంగనూరు) - ఎస్ఎల్‌వి (గుంతకల్) | కనకదుర్గ (అత్తిలి) | వై స్క్రీన్ (కొవ్వూరు) | వెంకటేశ్వర (తిరువూరు) | గోపికృష్ణ (జి.కొత్తపల్లి) | వెంకటసూర్య (కడియం) | నటరాజ్ (పెందుర్తి) | ప్రీతిసాయి (అనకాపల్లి) | సాయి శ్రీమ్యాక్స్ (చోడవరం) | రాజ (కొత్తవలస) | ఎస్ఆర్‌కె చిత్రమందిర్ (పాయకరావుపేట) | జమునా కాంప్లెక్స్ (పొదలకూరు) | విజయ (కర్నూలు)



సాక్షి ఫ్యామిలీ సన్నిధి
నల్లగొండ ॥ ఆదివారం
21-7-2019



# బోనాలంటే బోనాలాయే...



**తెలుగు నేలపై ప్రతి పల్లెలోనూ గ్రామ దేవతల గుడులుంటాయి. ఈ గ్రామ దేవతలను ఒక్కో ప్రాంతంలో ఒక్కో పేరుతో పిలుస్తుంటారు. ప్రాంతాలవారీగా ఒక్కో రుతువులో లేదా మాసంలో గ్రామ దేవతలకు కొలుపులు, సంబరాలు చేయడం ఆచారం. ఆంధ్రలో మావుళ్లమ్మ, మహంకాళమ్మ, నూకాలమ్మ, పోలేరమ్మ, మరిడమ్మ, అంకాలమ్మ, అన్నపూర్ణమ్మ, గంగానమ్మ, ముత్యాలమ్మ, నాగార్పమ్మ తదితర నామాలతో గ్రామదేవతలు కొలుపులందుకుంటుండగా తెలంగాణ ప్రాంతంలో పెద్దమ్మ, పోచమ్మ, కట్ట మైసమ్మ, ఆరె మైసమ్మ, మాంకాళమ్మ, నల్లపోచమ్మ, గండిపేట మైసమ్మ, ఎల్లమ్మ, జగదాంబిక పేర్లతో ప్రతి ఆషాఢమాసంలో అమ్మవార్లు బోనాలందుకుంటారు. ఆషాడ బోనాల సందర్భంగా పండుగ నేపథ్యం, విశేషాలు, సంప్రదాయాలపై కథనం...**

తెలంగాణలో ముఖ్యంగా హైదరాబాద్‌లో గ్రామదేవతలకు ప్రతియేటా ఆషాఢమాసంలో పూజలు జరిపి, బోనాలు సమర్పించే ఈ సంప్రదాయం ఈనాటిది కాదు, వందల ఏళ్లుగా వస్తున్నదే. నగర వాతావరణంలో ఎన్ని హంగులు, ఆర్భాటాలు, మార్పులు చేర్పులు చోటు చేసుకున్నా, కాలగమనంలో సంప్రదాయక పండుగలెన్నో పేరు తెలీకుండా అదృశ్యమైపోతున్నా, ఈ బోనాల వేడుకలు మాత్రం తమ వైభవాన్ని ఏ మాత్రం కోల్పోకుండా మరింత వేడుకగా నేటికీ కొనసాగుతుండడం విశేషం.

**నవాబుల కాలంలో నెలకొన్న సంప్రదాయం**

మూసీ నది వరదల కారణంగా అంటువ్యాధులకు ఆలవాలమైన నగరంలో నాటి హైదరాబాద్ రాష్ట్ర ప్రధాని మహారాజా కిషన్‌ప్రసాద్ సలహా మేరకు నిజాం మీర్ మహబూబ్ అలీఖాన్ లాల్‌దర్వాజ సమీపంలోని అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహించి చార్మినార్ వద్దకు చేరిన వరద నీటిలో పసుపు, కుంకుమ, గాజులు, పట్టువస్త్రాలు సమర్పించాడట. అమ్మ తల్లి శాంతించి నగరంలో ప్రశాంత వాతావరణం నెలకొనడంతో నవాబులే బోనాల ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. నాటి నుంచి లాల్‌దర్వాజా సింహవాహిని ఆలయంలో ప్రతి యేటా ఆషాఢమాసం చివరి ఆదివారం బోనాల ఉత్సవాలను జరుపుతున్నారు.

**ఎందుకు సమర్పిస్తారు?**

ఆషాఢమాసమంటే వర్షాకాలం.. అంటే అంటువ్యాధులు వ్యాపించడానికి ఆలవాలమైన మాసం. కలరా, ప్లేగు, మశూచి, క్షయ, తట్టు, పొంగు, అమ్మవారు వంటి అంటువ్యాధుల బారిన పడకుండా గ్రామదేవతలు గ్రామాలను చల్లంగా చూసేందుకే బోనాలు సమర్పిస్తారు. పసుపునీళ్లు, వేపాకులతో సాకలు పెడతారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు కావించి అమ్మవారికి సమర్పించగా మిగిలిన పదార్థాలను ప్రసాదాలుగా స్వీకరిస్తారు.

**బోనమంటే ఏమిటి? ఎలా తయారు చేస్తారు?**

బోనమంటే మరేమిటో కాదు, గ్రామదేవతలకు సమర్పించే మొక్కుబడి లేదా నైవేద్యం. భోజనానికి వికృతి పదమే బోనము. ఈ బోనాలను ఆడపడుచులంతా కలసి ఘటాలలో ఉంచి ఊరేగింపుగా వెళ్లి గుడిలో సమర్పిస్తారు. బోనాల పండుగలో అమ్మవారికి సమర్పించే బోనం తయారీ చాలా విశిష్టమైనది. మట్టి కుండ, రాగి, ఇత్తడి, ఇనుము (స్టీలు) పాత్రలలో బోనం తయారు చేస్తారు. ఆ పాత్ర లేదా కుండను సున్నం, పసుపు, కుంకుమలతో అలంకరిస్తారు. అన్నం, పెరుగు, బెల్లంతో తయారు చేసిన నైవేద్యాన్ని అందులో ఉంచుతారు. దానిపై వేపమండలు వేసి దానిపై చెంబు పెట్టి అందులో చింతపండు నీళ్లు, ఉల్లిపాయ ముక్కలు కలుపుతారు. దానిమీద మూతపెట్టి ఆ మూతమీద దీపం వెలిగిస్తారు. ముఖంపై పసుపు రాసుకుని, సిద్ధం చేసుకుని ఉంచిన బోనాన్ని తలపై పెట్టుకుని మేళతాళాలు, డప్పులతో ఊరేగింపుగా వెళ్ళి అమ్మవారికి సమర్పిస్తారు.



**గోల్కొండ జగదాంబికదే తొలి బోనం**

మొదట వేడుకలు గోల్కొండ జగదాంబిక ఆలయంలో ఆరంభమవడం ఆచారం. తర్వాత ఉజ్జయినీ మహంకాళి ఆలయంలో, ఇక ఆ తర్వాత అన్నిచోట్లా బోనాల సంరంభం మొదలవుతుంది. సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లో ఒక్కో రోజు ఆషాడ ఘటోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ఘటాల ఊరేగింపు తర్వాతే బోనాల వేడుకలు ప్రారంభమవుతాయి. గోల్కొండ జగదాంబిక ఆలయంలో మొదలైన ఉత్సవాలు తిరిగి ఆ అమ్మకు సమర్పించే తుదిబోనంతో ముగియడం ఆచారం.

**బోనాల పాటలతో బోలెడంత ఆనందం**

ఆడ మగ, చిన్న పెద్ద, ధనిక బీద తారతమ్యం లేకుండా ఆనందంతో చిందులేస్తూ చెవులకింపైన జానపదాలు''గండిపేట గండెమ్మా దండం బెడత ఉండమ్మా..., బోనాలంటే బోనాలాయే బోనాల మీద బోనాలాయే..., అమ్మా బైలెల్లినాదే.... అమ్మా సల్లంగ సూడమ్మా..... మైసమ్మా మైసమ్మా.... వంటి పాటలు, పోతురాజుల నృత్య విన్యాసాలు, శివసత్తుల చిందులు అలరిస్తాయి.

**పోతురాజుల సందడి...**

పోతురాజు అంటే అమ్మవారికి సోదరుడు. తమ ఇంటి ఆడపడుచును ఆదరించేందుకు, ఆమెకు సమర్పించే ఫలహారపు బండ్లకు కాపలా కాసేందుకు విచ్చేసే పోతురాజులు నృత్యవిన్యాసాలు చేస్తారు. చిన్న అంగవస్త్రాన్ని ధరించి ఒళ్ళంతా పసుపు రాసుకుని కాళ్ళకు మువ్వల గజ్జెలు, బుగ్గన నిమ్మపండ్లు, కంటికి కాటుక, నుదుట కుంకుమ దిద్దుకుని మందంగా పేనిన పసుపు తాడును కొరడాగా ఝుళిపిస్తూ, తప్పెట్ల వాయిద్యాలకు అనుగుణంగా గజ్జెల సవ్వడి చేస్తూ లయబద్ధంగా పాదాలు కదుపుతూ కన్నుల పండుగ చేస్తారు. పోతురాజుల చేతి కొరడా దెబ్బతినడానికి చాలా మంది పోటీ పడుతుంటారు. ఎందుకంటే ఆ కొరడా దెబ్బ దుష్టశక్తులను, శారీరక రుగ్మతలను దూరంగా తరిమి కొడుతుందని విశ్వాసం.



బోనాలలో మరో ముఖ్య అంశం రంగం చెప్పడం. అమ్మవారి శక్తిని తనలో ఇముడ్చుకుని భవిష్యవాణిని వినిపిస్తుంది రంగం చెప్పే మహిళ.

**ఘటం**

అమ్మవారి ఆకారంలో అలంకరింపబడిన రాగి కలశాన్ని ఘటం అని సంబోధిస్తారు. సాంప్రదాయక వస్త్రధారణతో ఒంటి పై పసుపు పూసుకున్న పూజారి ఈ ఘటాన్ని మోస్తాడు. పండుగ మొదటి రోజు నుండి, చివరి రోజు నిమజ్జనం దాకా ఈ ఘటాన్ని డప్పువాద్యాల నడుమ ఊరేగిస్తారు.

ఘటం ఉత్సవం రంగం తర్వాత జరుగుతుంది. హరిబౌలిలోని అక్కన్న మాదన్న దేవాలయం నుంచి ఏనుగు అంబారీపై, అశ్వాల మధ్య, అక్కన్న, మాదన్నల బొమ్మల నడుమ ఘటాల ఊరేగింపు మొదలయ్యి సాయంత్రానికి కన్నుల పండుగగా నయాపుల్ వద్ద ఘటాల నిమజ్జనతో ముగుస్తుంది

లాల్‌దర్వాజా నుండి నయాపుల్ వరకు వీధుల వెంబడి వేలాదిమంది ప్రజలు నిలుచుని వైభవంగా అలంకరించబడిన ఘటాలను చూస్తారు. పోతురాజుతో పాటు, వివిధ పౌరాణిక పాత్రల వేషధారులు తమదైన రీతిలో జానపదగీతాలు, వాయిద్యాల మధ్య నృత్యం చేస్తారు. హరిబౌలి అక్కన్న మాదన్న, లాల్ దర్వాజా, ఉప్పుగూడ, మిరాలం మండీ, కాసరట్టలలోని మహంకాళి ఆలయాలు, సుల్తాన్‌షాహీలోని జగదాంబాలయం, షాలిబండ, అలీషా కోట్లా, గౌలీపురా మరియు సుల్తాన్‌షాహీలోని బంగారు మైసమ్మ దేవాలయాల నుంచి వచ్చిన ఘటాలు, ఆలియాబాదులోని దర్బారు మైసమ్మ మందిరం చందూలాల్ బేలాలోని ముత్యాలమ్మ గుడి నుంచి వచ్చిన ఘటాలు ఓల్డ్‌సిటీ లో జరిగే ఊరేగింపులో పాల్గొంటాయి.

**పూర్ణిమా స్వాతి**

**ఆషాడం**
**అన్ని ప్రాంతాలవారికీ**
**ఆరాధనీయమే**

కలరా లాంటి అంటువ్యాధులు, తీవ్రజ్వర నివారణకు శీతలాదేవిని, పోచమ్మని, ఇతర గ్రామదేవతలని ఆరాధించడం మన సనాతన సంప్రదాయం. కొన్ని వర్ణాల్లో బోనం ఎత్తుకోవడం సాంప్రదాయం లేకపోయినా, అమ్మని ఆరాధించి నైవేద్యం అర్పించి ఆశీస్సులు తీసుకోవడం ఆచారంగా వస్తోంది. అనాది నుంచి మనది వ్యవసాయ సమాజం అంటే ఆహార ఉత్పత్తికి చెందిన సమాజం. ఈ ఆషాఢంలో వర్షాలు కురిసి వ్యవసాయ పనులు ఆరంభమవుతాయి. పంటలు బాగా పండాలని కోరుకుంటూ ప్రకృతి తల్లికి అన్నం సమర్పించడమే బోనం. ఇలా తను చేసే ప్రతి పనికీ ప్రకృతి అనుమతి తీసుకోవడం అన్నమాట. అందువల్ల ఈ ఆచారం తెలంగాణా ప్రాంతానికే పరిమితం అనుకోనక్కరలేదు. అన్ని ప్రాంతాలవారూ ఆచరించడం విధాయకం. కాకపోతే బోనానికి బదులుగా అమ్మవారికి ముడుపులు ఇచ్చుకోవచ్చు. సాధారణంగా గ్రామదేవతలకు ముడుపులు లేదా నైవేద్యాలు పెట్టడానికి ఆది, మంగళ, గురు వారాలు శ్రేష్ఠం. అందుకే అందుకోండి మీరూ ఓ బోనం. మీ ప్రాంతంలో అమ్మవారికి అర్పించండి భక్తితో ముడుపులు.

**గురు సన్నిధి**

## దత్తావతారులు శ్రీ టెంబేస్వామి



అదో సభామంటపం. లోపలున్న యోగీశ్వరుని అనుగ్రహ భాషణాన్ని వినడానికి వచ్చిన భక్తులతో ఆ ప్రదేశమంతా నిండిపోయింది. బయటున్న వారికి దర్శనమే గగనమైంది. మంటపం లోపల వేదికపైనా, బయట ఉన్న రావిచెట్టు కింద రెండుచోట్ల రెండు రూపాలతో భక్తులకు దర్శనమిస్తూ, తనను కోరి వచ్చినవారందరికి సమానంగా తన అనుగ్రహం లభిస్తుందని నిరూపించిన దత్తావతారులే శ్రీవాసుదేవానంద సరస్వతి స్వామి వారు.

దత్తభక్తులయిన గణేశభట్ టెంబే, రమాబాయి దంపతులకు దత్తాత్రేయస్వామి వర ప్రసాదంతో పుట్టిన బాలుడికి వాసుదేవశాస్త్రిగా నామకరణం చేసారు. అనునిత్యం వేదశాస్త్రాలతో పాటుగా శ్రీగురుచరిత్ర పారాయణ చేస్తున్న వాసుదేవశాస్త్రి దత్తాత్రేయులు కలలో ఇచ్చిన ఆదేశం మేరకు గోవిందస్వామి అనే యోగి వద్దకు చేరాడు. గురువు వద్ద శాస్త్రోక్తంగా సన్యాసాశ్రమాన్ని స్వీకరించిన అనంతరం శ్రీ నారాయణానంద సరస్వతీ స్వామి వద్ద నుండి పవిత్ర దండాన్ని పొంది శ్రీవాసుదేవానంద సరస్వతీస్వామిగా నామాన్ని పొందారు. అయితే టెంబే వంశంలో జన్మించిన వారు కాబట్టి భక్తులంతా టెంబే స్వామిగా పిలిచారు.

### గురుచరిత్ర అనువాదం

దత్తాత్రేయ వైభవాన్ని, గురుభక్తిని తెలియ చెప్పేదే గురుచరిత్ర. మరాఠీలో ఉన్న దీనిని వీరు సంస్కృత భాషలో అనువదించగా.. ఈనాడు సమస్త దత్తభక్తులకు ఇది పారాయణ గ్రంథంగా మారింది. తెలుగుతో సహా మిగిలిన భారతీయభాషలలోనూ ముద్రించబడ్డది.

### 'సగుణమే సోపానం'

సగుణోపాసనను గట్టిగా సమర్థించే టెంబేస్వామి ప్రతివారూ సగుణోపాసన చేయాలని, సగుణోపాసన చేయకుండా నిర్గుణ ఉపాసన స్థితిని పొందలేమని చెబుతూ సామాన్యులు సైతం తరించే మార్గాన్ని చూపించారు. వీరి ప్రచారం మేరకే పిఠాపురం దత్తక్షేత్రంగా ప్రాముఖ్యత పొందింది.

**– అప్పాల శ్యామప్రణీత్ శర్మ అవధాని,**
వేదపండితులు

**ఇస్లాం వెలుగు**

## పుల్లకు బదులు కర్ర!



ఆ ఊరికి ఒక విశిష్ఠ అతిథి వచ్చాడు. ఊరు ఊరంతా అతనికి స్వాగతం పలికింది. అందరూ అతిథిని గొప్పగా ఆదరించారు. అతను కూడా అందరితోనూ ఆప్యాయంగా మాట్లాడాడు. అందరూ కలిసి కబుర్లు చెప్పుకున్నారు. అతిథి కోసం రకరకాల వంటలు వండారు. వడ్డించారు. చివరగా తాంబూలం, దాంతోపాటు ఒక దుడ్డుకర్ర కూడా పెట్టారు. అతిథి చాలా సంతోషించాడు. వారు చూపిస్తున్న ప్రేమకు, వారి ఆతిథ్యానికి మురిసిపొయ్యాడు.

అయితే ఇంత మంచి ఆతిథ్యం ఇస్తూ, తాంబూలంతోపాటు ఇంతపెద్ద దుడ్డుకర్రను ఎందుకు పెట్టారో అతనికి అంతుచిక్కలేదు. భోజనం తరువాత ఈ దుడ్డుకర్రతో 'మర్యాద' గాని చెయ్యరుగదా..! అన్న అనుమానమూ మనసులో మెదిలింది. తన సందేహాన్ని వారిముందు వ్యక్తం చేశాడు. దానికి వారు అది తమ ఆచారమని చెప్పారు. ఆ సమాధానం అతన్ని సంతృప్తిపరచలేదు.

దాంతో ఆ ఊరిలోని పెద్దమనిషిని పిలిచి, అతిథి సందేహాన్ని అతని ముందుంచారు. ఆ పెద్దమనిషి వారిని మందలిస్తూ.. ఎవరైనా ఇంతపెద్ద దుడ్డుకర్రను పెడతారా? బుద్ధుందా మీకు..? అంటూ.. దాని సైజును తగ్గించాడు. అయినా అతిథి సందేహం తీరలేదు. దాంతో ఊరిలో అందరికంటే వృద్ధుడు, అనుభవజ్ఞుడైన మరో పెద్దమనిషిని పిలిచారు. ఆ వృద్ధుడు అది అతిథి మర్యాదలో ఒక భాగమని, పూర్వకాలంలో అతిథి వస్తే భోజనం తరువాత, తాంబూలంతోపాటు, పళ్ళు కుట్టుకోడానికి ఒక చిన్నపుల్లను కూడా ఇచ్చేవారని, రానురానూ వీళ్ళు దాన్నొక ఆచారంగా మార్చి ఇలా పెద్ద దుడ్డుకర్రగా చేసి పారేశారనీ వివరించాడు పెద్దమనిషి.

చాలా విషయాల్లో సమాజంలో ఈనాడు ఇలాంటి ఉదాహరణలు కనిపిస్తున్నాయి. సంప్రదాయం, ఆచారం పేరుతో దురాచారాలను ప్రవేశపెట్టి, వాటిని ప్రజలపై రుద్ది దైవాగ్రహానికి పాత్రులవుతున్నారు. జననం నుండి మరణం వరకు, జీవితం లోని అన్ని రంగాల్లో సదాచారాన్ని, సత్సాంప్రదాయాన్ని మాత్రమే పాటించాలి తప్ప, ఆచారం, సంప్రదాయం పేరుతో దురాచారానికి, దుస్సంప్రదాయాలకు తావు కల్పించకూడదు. 'పుల్లకు బదులు కర్రలా' వ్యవహరించకూడదు. .

**– ముహమ్మద్ ఉస్మాన్ ఖాన్**

నిర్వహణ: డి.వి.ఆర్. భాస్కర్

**సువార్త**

## హృదయాన్ని కుమ్మరించిన ఆత్మారాధన!!

దేవుడు ఆత్మ గనుక ఆయన్ను ఆత్మతో, సత్యంతో ఆరాధించాలన్నాడు ఒకసారి యేసుప్రభువు (యోహాను 4:24). ఒక పరిసయ్యుని ఇంటికి యేసు విందుకు వెళ్లగా, 'పాపాత్మురాలైన' ఒక స్త్రీ వచ్చి, యేసు పాదాలను కన్నీటితో తడిపి, తల వెంట్రుకలతో ఆయన పాదాలను తుడిచి, అత్తరు పూసి పశ్చాత్తాపంతో ఆరాధించింది (లూకా 7:36 –50). ఆ పరిసయ్యునితో సహా ధర్మశాస్త్రాన్నెరిగిన చాలామంది 'పరిశుద్ధులు' ఉన్న విందుకు అనామకురాలు, పాపాత్మురాలైన ఒక స్త్రీ అకస్మాత్తుగా వచ్చి, మాటలకతీతమైన ఈ 'కన్నీటి ఆరాధన' చేసింది. 'ఇతను ప్రవక్త అయితే, ఆమె పాపాత్ము



రాలని గుర్తించి ఈసడించాలి' అనుకున్నాడా పరిసయ్యుడు. కాని యేసుప్రభువుకు ఆమె పాపజీవితం తెలుసు, పరిసయ్యుని దురాలోచన కూడా తెలుసు. అందువల్ల 'ఒకతను తనకు 500 దీనారాలు అప్పుగా ఉన్న వ్యక్తిని, 50 దీనారాలు అప్పుగా ఉన్న మరొక వ్యక్తిని క్షమించి వారిద్దరి అప్పు రద్దు చేస్తే, ఆ ఇద్దరిలో ఎవరిని ఎక్కువగా క్షమించాడు? అని అడుగగా, 'మొదటి వ్యక్తినే అన్నాడా పరిసయ్యుడు. '. రాగానే నీవు నాకు ముద్దు పెట్టలేదు, నా కాళ్లకు నీళ్లివ్వలేదు, నా తలను నూనెతో అంటలేదు. కాని ఈమె కన్నీళ్లతో నా పాదాలు కడిగి తలవెంట్రుకలతో తుడిచింది, నన్ను అత్తరుతో అభిషేకించింది. నీకంటే ఎక్కువగా నన్ను ప్రేమించి, నీకంటే ఎక్కువగా నా ప్రేమను, క్షమాపణను పొందింది' అని ప్రభువు జవాబిచ్చాడు. అంటే 'నీకు ధర్మశాస్త్రం తెలుసు, కాని దాన్నిచ్చిన దేవుడు తెలియదు. ఈమెకు ధర్మశాస్త్రం తెలియదు కాని దేవుడు బాగా తెలుసు' అన్నాడన్నమాట. బహుశా ఆ స్త్రీ కూడా ప్రభువు నుండి అంతటి ప్రేమను పొందుతాననుకోలేదేమో! ఎంతటి పాపినైనా యేసుప్రభువు ప్రేమతో ఆదరిస్తాడు. కాని వేషధారులను మాత్రం అసలే సహించడన్నది ఇక్కడ సుస్పష్టం..

ప్రభువు బాహ్యాన్ని బట్టి కాక, ఆంతర్యంలోని యథార్థతను బట్టి మన విశ్వాసానికి, ఆరాధనకు విలువనిస్తాడు. పాటలతోనైనా, మాటలతోనైనా, కన్నీటితోనైనా మన హృదయాన్నంతా పశ్చాత్తాపంతో ఆయన పాదాలమీద కుమ్మరించడమే నిజమైన ఆరాధన!!

ఆమె ఆంతర్యంలోని మలినమంతా కన్నీరుగా వెలికి రాగా, ప్రభువు పట్ల ఆమెలో ఉన్న ప్రేమ, గౌరవం, దైవభయమే అత్తరుగా ప్రభువు మీద జాలువారింది. విధి లేక పాపాత్మురాలిగా బతుకుతున్నా ఆమె దేవుణ్ణి అత్యున్నతంగా ప్రేమించింది. కాని దేవుని పేరిట బతికే పరిసయ్యుడిదేమో ఇంటికొచ్చిన యేసుప్రభువును 'ఈయన ఎలాంటివాడో చూద్దాం' అనుకున్న వెకిలితనం. ప్రభువు పాదాలాశ్రయించి ఆయన ప్రేమను పొందిన నిర్మల విశ్వాసి ఆమె. ఆమె వంటి నిజమైన నీతిమంతులను, పరిసయ్యుని వంటి అసలైన పాపాత్ములను కూడా గుర్తించి అందర్నీ సమానంగా ప్రేమించడమే ప్రభువు ప్రత్యేకత. పిలవకుండా వచ్చి శాంతిని, క్షమాపణను పొందిన విశ్వాసి ఆమె అయితే. యేసు రూపంలో క్షమాపణే తన ఇంటికి వచ్చినా దాన్నందుకోలేక పోయిన నిర్భాగ్యుడు ఆ పరిసయ్యుడు. అసమానమైన యేసుప్రేమను చాటే అద్భుతమైన ఉదంతమిది.

**– రెవ.డా.టి.ఎ.ప్రభుకిరణ్**

**స్త్రీ వైశిష్ట్యం**

## స్త్రీ పురుషుల మధ్య తేడా ఎందుకొచ్చింది?

పరమేశ్వరుడు సృష్టి చేసినప్పుడు దానిని జరాయుజాలు(మావిచే పుట్టేవి), అండజాలు (గుడ్డులోంచి వచ్చేవి), స్వేదజాలు(చెమటలోంచి వచ్చే పేలు వంటివి), ఉద్బుజాలు(భూమిని చీల్చుకుని వచ్చే చెట్లవంటివి) అని నాలుగుగా విభాగం చేసాడు. ప్రాణులన్నింటిని సృష్టిచేసిన పరమాత్మ నిరంతరం సృష్టి కొనసాగే నియమం చేసాడు. ఈ ఆలోచన వెనుక పవిత్రమైన కారణం ఉంది. సృష్టి జరిగింది అంటే జీవుడు ఒక శరీరం పొందాడు–అని. గత జన్మలో చేసుకున్న పాపాన్ని ఈ శరీరం ద్వారా పోగొట్టుకుంటాడు. అలా పోగొట్టుకోవడానికి జీవుడికి పనికివచ్చే ఉపకరణమే శరీరం. దీని ద్వారా మూడు రకాలుగా పుణ్యం చేసుకుంటాడు. ఒకటి వాచిక పుణ్యం. నోటిమాట ద్వారా పుణ్యాన్ని సంపాదించుకుంటాడు. ఒక మాట చేత కరుడుగట్టిన నేరస్థుడి మనసు మార్చి సత్ప్రవర్తనతో మెలిగేటట్లు చేయవచ్చు, అదే మాట అనే ఆయుధంతో బాగా బతుకుతున్న వాడి మనసును విరిచి చచ్చిపోవడానికి కూడా పురిగొల్ప వచ్చు. రెండవది మనసు–దీనితో మంచి సంకల్పాలు చేయవచ్చు. కలియుగంలో త్రికరణ శుద్ధిగా మంచి సంకల్పం చేస్తే వాడాపని చేసినట్లుగానే పరిగణించి పుణ్యాన్ని ఖాతాలో వేస్తారు. అలా జరగాలంటే ఈ మనసుకు ఒక శరీరం ఉండాలి కదా. అలా ఈ శరీరం చేత, మనసు చేత, వాక్కుచేత గతంలోని పాపాల నుండి ఉద్ధరణ పొందుతాడు. కాబట్టి సమస్త ప్రాణులకూ శరీరం కావాలి. వీటిలో ఒక్క మనుష్య శరీరం తప్ప మిగిలిన ఏ జీవికి కూడా శాస్త్రంతోకానీ, గురువుతో కానీ సంబంధం ఉండదు. జీవులన్నింటికీ షడూర్ములుంటాయి. ఇది తప్పదు. అంటే ఆకలి, దప్పిక, జర(వృద్ధాప్యం), మరణం, శోకం, మోహం, అజ్ఞానం. వీటిలో ఒక్క మనుష్యజన్మలో మాత్రం చింత, శోకం ఎక్కువగా ఉంటాయి.





బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

అన్ని ప్రాణులలో ఉన్నదీ సప్తధాతువులే–చర్మం, రక్తం, మాంసం, కొవ్వు, అస్థి, శుక్ల, మేధ. స్త్రీ పురుషుల విభాగంలో మనుష్యులలో ఇవన్నీ ఉంటాయి. అదనంగా మరేదీ ఉండదు. నవరంధ్రాలుంటాయి. రెండు కళ్ళు, రెండు చెవులు, రెండు ముక్కులు, నోరు, మల–మూత్ర ద్వారాలుంటాయి. ఇద్దరిలో ప్రాణ, అపాన, వ్యాన, ఉదాన, సమాన, నాగ, కూర్మ, కృకర, దేవదత్త, ధనుంజయలనే పది వాయువులు తిరుగుతూ జీవన వ్యాపారాన్ని చక్కబెడుతూ ఉంటాయి.

అన్ని శరీర ధర్మాలు ఒకటే అయినప్పుడు, ఆ శరీరాలకు షడూర్ములు ఒకటే అయినప్పుడు, అన్ని పదార్థాలూ ఒకటే అయినప్పుడు స్త్రీ పురుషులనే తేడా ఎందుకు వచ్చింది? స్త్రీపురుష శరీరాల్లో తేడా ఒక్కటే... స్త్రీ శరీరం పైభాగంలో కొవ్వు, మాంసం ఉబికి రెండు ముద్దలుగా ఏర్పడ్డాయి. కింది భాగంలో ప్రాణి బయటికి రావడానికి కావలసిన వ్యవస్థ ఏర్పాటు చేయబడింది. ఈ రెండు స్వల్ప శారీరక మార్పులు తప్ప మరే ఇతర భేదాలు లేనప్పుడు సృష్టిలో పరమాత్మ స్త్రీ పురుషులని రెండు విభాగాలు ఎందుకు చేయాల్సి వచ్చింది! దాని అవసరం ఆయనకు ఎందుకొచ్చింది!!

('స్త్రీ వైశిష్ట్యం' కొత్త సిరీస్ ప్రారంభం)

**ఆలయం.. ఆగమం**

## మూడు ప్రాంతాలు.. మూడు దేవళాలు





శిఖరాన్ని చూసి ఆ ఆలయం ఏంటో? అందులోని దేవతామూర్తి ఎవరో? అది ఏ సంప్రదాయానికి చెందినదో తెలుసుకోవచ్చు. భారతదేశమంతటా అనేక ఆలయాలున్నాయి. అవన్నీ విభిన్న ఆకృతుల్లో ఉన్నాయి. ఉత్తరాదిలో పొడవైన శిఖరం గల ఆలయాలు, దక్షిణాదిలో అష్టకోణాకార ఆలయాలు. మధ్యలో గుండ్రటి ఆలయాలు.. వీటి విభిన్నతకు మన ప్రాచీన శిల్పఋషులు కొన్ని కట్టుబాట్లు చేశారు. భారతదేశాన్ని గుణాన్ని బట్టి మూడు ప్రాంతాలుగా విభజించారు. ఆ గుణం కలిగిన ప్రాంతంలో ఆయా ఆకృతులు కలిగిన ఆలయాన్ని నిర్మించాలని చెప్పారు.

హిమాలయం నుండి వింధ్యపర్వతం వరకు ఉండే భూమిని సాత్త్వికభూమిగా పేర్కొంటూ అక్కడ బ్రహ్మకు ప్రతీకగా ఆలయం కింది భాగం నుండి శిఖరం వరకు నలుచదరంగా (నాలుగు పలకలుగా) నాగరశైలి ఆలయాన్ని నిర్మించాలని సంప్రదాయం. కాశీ, సోమనాథపూర్, ద్వారకా ఆలయాలు నాగరాలయాలకు ఉదాహరణ. వింధ్యపర్వతం మొదలు కృష్ణానది వరకు ఉండే ప్రదేశం రజస్తత్త్వభూమి అని చెప్పి అక్కడ రుద్రప్రతీకగా కింది నుండి పై వరకూ లేక శిఖరం మాత్రం గుండ్రంగా ఉండే వేసర దేవాలయం నిర్మించబడుతోంది. ఈ ఆలయానికి కోణాలుండవు. కోణార్క్, విజయవాడ, సింహాచలం ఆలయవిమానాలు వేసరజాతికి చెందినవి. కృష్ణానది నుండి కన్యాకుమారి వరకు తామసతత్త్వంగల భూమి కనుక అక్కడ



విష్ణుస్వరూపంగా ఎనిమిది పలకలుగల విమానంతో ద్రావిడాలయం నిర్మించాలని చెప్పబడింది. తిరుపతి, మధురై, కంచి ఆలయాలు ద్రావిడాలయాలకు ఉదాహరణలు. ఈ సంప్రదాయాన్ని పాటిస్తూ ఆలయాలను నిర్మించబట్టే ఈ వైవిధ్యం కనిపిస్తోంది. అలాగే ఆలయం విమానం పైన తూర్పు వైపు ఆలయంలోని ప్రధానమూర్తి విగ్రహం ఉంటుంది. విమానంపై ఉండే లాంఛనాలను చూసి అది ఏ ఆలయమో తెలుసుకోవచ్చు. ముఖ్యంగా తీర్థయాత్రలు చేసే భక్తులు ఈ విషయం తెలుసుకోవాలి.

**– కందుకూరి వేంకట సత్యబ్రహ్మాచార్య**
ఆగమ, శిల్పశాస్త్ర పండితులు


సంజయ్ దత్

## ఎదురు చూస్తున్నా

బాలీవుడ్ ఖల్ నాయక్ సంజయ్ దత్ కెరీర్‌లో 'మున్నాభాయ్ ఎమ్‌బీబీఎస్'(2003), 'లగే రహో మున్నాభాయి' (2006) చిత్రాలు ప్రత్యేకమైనవి. ఈ రెండు చిత్రాల్లో మంచి ఎమోషన్‌కు కాస్త కామిక్‌ను జోడించి హిట్స్ అందుకున్నారు సంజయ్‌దత్. ఈ రెండు సినిమాలకు రాజ్‌కుమార్ హిరాణీయే దర్శకుడు. మరి... ఈ మున్నా భాయ్ ఫ్రాంచైజీలో థర్డ్ పార్ట్ ఎప్పుడు వస్తుంది అన్న ప్రశ్నను సంజయ్‌దత్ ముందు ఉంచితే – ''మరో సీక్వెల్ రావాలని నేను కూడా దేవుణ్ని కోరుకుంటున్నాను. కానీ ఈ విషయం గురించి స్పందించాల్సింది దర్శకుడు రాజ్‌కుమార్ హిరాణీ. నేనైతే ఈ షూటింగ్ ఎప్పుడు స్టార్ట్ అవుతుందా అని ఎదురు చూస్తున్నాను'' అని చెప్పుకొచ్చారు. ఈ సీక్వెల్‌కి కథ రాస్తున్నానని గతంలో రాజ్‌కుమార్ పేర్కొన్నారు. మరి.. కథ ఎందాకా వచ్చింది? అనే విషయంలో క్లారిటీ లేకే సంజయ్ ఈ విధంగా చెప్పి ఉంటారు. ఇదిలా ఉంటే 'మున్నాభాయ్ ఎమ్‌బీబీఎస్' చిత్రాన్ని 'శంకర్‌దాదాఎమ్‌బీబీఎస్' (2004)గా, 'లగే రహో మున్నాభాయ్' చిత్రాన్ని 'శంకర్ దాదా జిందాబాద్' (2007)గా చిరంజీవి తెలుగులో రీమేక్ చేసిన సంగతి గుర్తుండే ఉంటుంది.


శర్వానంద్, కల్యాణీ ప్రియదర్శన్

## గ్యాంగ్‌స్టర్ గాయకుడాయెనే

నచ్చిన అమ్మాయి ఓర చూపు విసిరితే.. గాలికి తిరిగేవాడైనా గన్స్ చుట్టూ తిరిగే గ్యాంగ్‌స్టర్ అయినా ఒకటే. గాల్లో తేలిపోవడమే. అదే కన్ను కొట్టి చూస్తే? ఇంకా రాకెట్‌లో ఆకాశాన్ని అంటేస్తారు. ఇప్పుడు గ్యాంగ్‌స్టర్ అయిన శర్వా కూడా గాయకుడిగా మారిపోయి 'కన్ను కొట్టి చూసేనంట సుందరి...' అంటూ పాడుకున్నారు. సుధీర్ వర్మ దర్శకత్వంలో శర్వానంద్ హీరోగా తెరకెక్కిన చిత్రం 'రణరంగం'. కాజల్, కల్యాణీ ప్రియదర్శన్ హీరోయిన్లు. కామన్ మ్యాన్ గ్యాంగ్‌స్టర్‌గా ఎలా ఎదిగాడనే కథాంశంతో ఈ చిత్రం తెరకెక్కింది. ఈ సినిమాలో రెండోపాట ''కన్ను కొట్టి చూసెనంట సుందరి... మనసు మీటి వెళ్లెనంట మనోహరి..'ను రిలీజ్ చేశారు. కృష్ణచైతన్య రచించిన ఈ పాటను సంగీత దర్శకుడు కార్తీక్ రాడ్రిగ్రూజ్ ఆలపించారు. ఆగస్ట్ 15న రిలీజ్ కానున్న ఈ చిత్రాన్ని పీడీవి ప్రసాద్, సూర్యదేవర నాగవంశీ నిర్మించారు.

**వివాహం తర్వాత జరిగిన తన తొలి పుట్టినరోజు (18 జూలై) వేడుకలను ఘనంగా జరుపుకున్నారు బాలీవుడ్ బ్యూటీ ప్రియాంకా చోప్రా. అమెరికాలోని మియామీలో ఈ పుట్టినరోజు వేడుకలు జరిగాయి. భర్త నిక్ జోనస్, కజిన్ పరిణీతీ చోప్రాలతో పాటు ప్రియాంకా బంధుమిత్రులు పాల్గొన్నారు. అన్నట్లు... ఈ ఏడాదితో ప్రియాంక 37 వసంతాలను పూర్తి చేసుకున్నారు.**




బర్త్‌డే సెలబ్రేషన్స్‌లో నిక్, ప్రియాంక


అనుష్క

## సైగలే మాటలు

మాటల్లేవ్. ఓన్లీ సైగలే అంటున్నారు అనుష్క. అందుకే చేతులతో సైగలు చేస్తున్నారు. ఇదిగో ఇక్కడున్న ఫొటోలో చేతులు చూశారు కదా. ఇది అనుష్క నటిస్తున్న తాజా చిత్రం 'నిశ్శబ్దం' టైటిల్ పోస్టర్ లుక్. అనుష్క ఇండస్ట్రీలోకి వచ్చి పద్నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా టైటిల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సినిమాలో అనుష్క బదిర యువతి (చెవిటి మూగ) పాత్రలో నటిస్తున్నారని తెలిసింది. మరో హీరోయిన్ అంజలి పోలీసాఫీసర్ పాత్రలో నటిస్తున్నారు. హేమంత్ మధుకర్ దర్శకత్వంలో ఆర్. మాధవన్, మైఖేల్ మ్యాడసన్, షాలినీ పాండే ఇతర పాత్రలు పోషిస్తున్నారు. కోన వెంకట్, టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. వివేక్ కూచిభొట్ల సహ–నిర్మాత. ప్రస్తుతం అమెరికాలోని సియాటిల్‌లో ఈ సినిమా షూటింగ్ జరుగుతోంది. చిత్రీకరణ దాదాపు ముగిసిందని తెలిసింది. యునైటెడ్ స్టేట్స్‌లోనే పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలను కూడా ప్రారంభించారు. తెలుగు, తమిళం, హిందీ, ఇంగ్లీష్, మలయాళ భాషల్లో ఈ సినిమాను ఈ ఏడాది చివర్లో విడుదల చేయాలనుకుంటున్నారు. శ్రీనివాస్ అవసరాల, హంటర్ ఓ హారోమెయిన్, సుబ్బరాజు నటిస్తున్న ఈ చిత్రానికి గోపీ సుందర్ సంగీతం అందిస్తున్నారు.



టైటిల్ లోగో


ప్రియాభవానీ శంకర్

## ప్రియమైన బిజీ

న్యూస్ ప్రెజెంటర్‌గా కెరీర్‌ను స్టార్ట్ చేసిన ప్రియా భవానీ శంకర్ ప్రస్తుతం కోలీవుడ్‌లో మంచి జోష్ మీద ఉన్నారు. 'మేయాద మాన్' సినిమాతో సిల్వర్‌స్క్రీన్‌పై మెరిసిన ఈ బ్యూటీ గతేడాది 'కడైకుట్టి సింగమ్' (తెలుగులో 'చినబాబు') సినిమాతో తెలుగు ఆడియన్స్ కూడా పరిచయం అయ్యారు. ఇప్పుడు ఈ బ్యూటీ కోలీవుడ్‌లో భారీ ఆఫర్స్ దక్కించుకుంటున్నారు. ఇటీవలే కమల్‌హాసన్ 'ఇండియన్ 2'లో కీలక పాత్రకు ఊ కొట్టిన ప్రియ తాజాగా విక్రమ్ సరసన హీరోయిన్‌గా నటించే చాన్స్‌ను దక్కించుకున్నారట. ఈ చిత్రానికి అజయ్ జ్ఞానముత్తు దర్శకత్వం వహించనున్నారు. ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తారు. త్వరలో చిత్రీకరణ ప్రారంభం కానుంది. ఇక 'మాఫియా', 'వాన్' సినిమాలతో ఫుల్ బిజీగా ఉన్నారు ప్రియ.


మంజిమా మోహన్

## లాయర్ మంజిమా

ఇండియన్ పీనల్ కోడ్ సెక్షన్స్‌ను తెలుసుకునే పనిలో బిజీగా ఉన్నారు కథానాయిక మంజిమా మోహన్. కోర్టులో లాయర్‌గా వాదించనున్నారు. 'ఎఫ్.ఐ.ఆర్' (ఫైజల్ ఇబ్రహీమ్ రైజ్) అనే సినిమాలో ఆమె లాయర్‌గా కనిపించనున్నారు. మను ఆనంద్ దర్శకత్వంలో విష్ణు విశాల్ హీరోగా ఈ తమిళ చిత్రం తెరకెక్కుతోంది. ఇటీవల ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. అనుకోని పరిస్థితుల కారణంగా పోలీసుల చేతిలో చిక్కిన ఓ ముస్లిం యువకుడి నేపథ్యంలో ఈ సినిమా సాగుతుంది. జూనియర్ అడ్వకేట్‌గా మంజిమా నటిస్తున్నారు. ఈ సంగతి ఇలా ఉంచితే.. తెలుగులో నాగచైతన్య నటించిన 'సాహసం శ్వాసగా సాగిపో' చిత్రంలో మంజిమా మోహన్ కథానాయికగా నటించిన విషయం గుర్తుండే ఉంటుంది.

## అదే నిజమైన విజయం

**- సందీప్ కిషన్**



అన్యాసింగ్, సందీప్, తమన్, దయా పన్నెం, శివ చెర్రి

''రోడ్డు మీద నిలబడితే జనాలు పరిగెడుతూ వచ్చి 'సినిమా చూశాం. చాలా చాలా బాగుంది. ఫలానా సీన్ బాగుంది. చివర్లో మదర్ సెంటిమెంట్ బాగుంది' అని చెప్పారు. అదే నిజమైన విజయమని భావిస్తున్నాను. బ్లాక్‌బస్టర్, సూపర్‌హిట్ అనను. దాదాపు రెండేళ్ల తర్వాత మంచి హిట్ సాధించానని చెప్పగలను'' అని సందీప్ కిషన్ అన్నారు. కార్తీక్ రాజు దర్శకత్వంలో సందీప్ కిషన్ హీరోగా నటించిన చిత్రం 'నిను వీడని నీడను నేనే'. అన్యాసింగ్ కథానాయికగా నటించారు. విజి. సుబ్రహ్మణ్యన్, దయా పన్నెం, సందీప్ కిషన్ నిర్మించిన ఈ చిత్రం అనిల్ సుంకర సమర్పణలో ఈ నెల 12న విడుదలైంది. ఈ సినిమా థ్యాంక్స్ మీట్‌లో సందీప్ కిషన్ మాట్లాడుతూ– ''వైజాగ్ నుంచి ఒక పెద్దావిడ ఫోన్ చేశారు. మా అబ్బాయి లవ్ ఫెయిల్యూర్‌తో మూడు నెలల క్రితం ఆత్మహత్య చేసుకున్నాడు. ఒకవేళ ఈ సినిమా 3 నెలల కింద వచ్చి, మా అబ్బాయి చూసి ఉంటే ఆత్మహత్య చేసుకునే ముందు మా గురించి ఆలోచించేవాడేమో అని బాధపడ్డారు. నా కళ్ల వెంట నీళ్లు తిరిగాయి. మమ్మల్ని నమ్మి ఈ సినిమా కొన్న ప్రతి డిస్ట్రిబ్యూటర్ సేఫ్ అయ్యారని చెప్పగలను. నన్ను నమ్మి డబ్బులు పెట్టిన దయా, అనిల్ సుంకరగారు హ్యాపీగా ఉన్నారు'' అన్నారు. ''చాలామందికి ఇటువంటి కథతో సినిమా చేయడానికి ధైర్యం చాలదు. ఆ ధైర్యం చేసిన సందీప్‌ను మెచ్చుకోవాలి. ఇలాంటి డిఫరెంట్ సినిమాను నిర్మించడానికైనా సందీప్‌లాంటి హార్డ్‌వర్కర్ గెలవాలి'' అన్నారు తమన్. ''నిర్మాతగా మా తొలి సినిమా ఇది. సినిమాను ఇంత పెద్ద సక్సెస్ చేసిన తెలుగు ప్రేక్షకులకు థ్యాంక్స్'' అన్నారు దయా పన్నెం. ''ఈ సినిమా విజయంలో భాగస్వామ్యం కల్పించిన సందీప్ కిషన్‌కి థ్యాంక్స్'' అన్నారు నిర్మాత సుప్రియ. ''తెలుగు సినీ పరిశ్రమలోకి నాకు మంచి స్వాగతం లభించింది. ప్రేక్షకులు ఎంతో ప్రేమ చూపించారు'' అన్నారు అన్యా సింగ్. ఎగ్జిక్యూటివ్ నిర్మాతలు శివ చెర్రి, సీతారామ్ తదితరులు పాల్గొన్నారు.

## విదేశాల్లో వార్


హృతిక్

భూమి, సముద్రం, మంచుపై మాత్రమే కాదు గాలిలో కూడా ఫైట్ చేస్తున్నారట హృతిక్ రోషన్ అండ్ టైగర్ ష్రాఫ్. ఈ పవర్‌ఫుల్ ఫైట్స్‌ని పావెల్ జెన్నింగ్స్, ఫ్రాంజ్ స్పిల్హాస్, సా యంగ్ ఓహ్, పర్వేజ్ షేక్ ఈ నలుగురు హాలీవుడ్ స్టంట్‌మాస్టర్స్ కొరియోగ్రఫీ చేస్తున్నారు. సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వంలో హృతిక్ రోషన్, టైగర్ ష్రాఫ్ హీరోలుగా తెరకెక్కుతున్న సినిమా 'వార్'. ఇందులో వాణీ కపూర్ కథానాయికగా నటిస్తున్నారు. ఇటీవల ఈ సినిమా టీజర్‌ను కూడా విడుదల చేశారు. అదిరిపోయే యాక్షన్ సన్నివేశాలు అబ్బురపరిచేలా ఉన్నాయి టీజర్‌లో. ఇటీవల ఫిన్‌ల్యాండ్‌లోని ఆర్కిటిక్ సర్కిల్‌లో ఓ భారీ కార్ ఛేజింగ్ యాక్షన్ సీన్‌ను చిత్రీకరించారు. ఈ యాక్షన్ సన్నివేశాలను హాలీవుడ్ స్టంట్ కొరియోగ్రాఫర్ పావెల్ జెన్నింగ్స్ డిజైన్ చేశారు. ఇంతకు ముందు డార్క్ నైట్, జాక్ రేచర్, గేమ్ ఆఫ్ థ్రోన్స్ వంటి చిత్రాలకు వర్క్ చేశారు పావెల్. ఈ సీన్ కోసం హృతిక్, టైగర్ ముందుగా బాగా ప్రాక్టీస్ చేశారట. ఫిన్‌ల్యాండ్‌లోని ఆర్కిటిక్ సర్కిల్‌లో యాక్షన్ సీన్‌ను తెరకెక్కించిన తొలి బాలీవుడ్ మూవీ ఇదేనట. ఇండియా లొకేషన్స్‌తో పాటుగా ఆస్ట్రేలియా, పోర్చుగల్, ఇటలీ, స్విట్జర్లాండ్, స్వీడన్ దేశాల్లోని పదిహేను ముఖ్యనగరాల్లో ఈ సినిమా చిత్రీకరణను టీమ్ ప్లాన్ చేసినట్లు సమాచారం. 'వార్' చిత్రం అక్టోబర్ 2న విడుదల కానుంది.


రాశీ ఖన్నా

## రెండేళ్లు శ్రమించా

కెరీర్ స్టార్టింగ్‌లో బొద్దుగా ఉండేవారు రాశీ ఖన్నా. ఇప్పుడు స్లిమ్‌గా మారిపోయారు. ఈ మార్పు వెనక రెండేళ్ల శ్రమ ఉందట. ప్రస్తుతం 'నాకు నేనే నా బెస్ట్ వెర్షన్‌లా' అనిపిస్తున్నాను అంటున్నారామె. బాడీ ట్రాన్స్‌ఫర్మేషన్ గురించి రాశీ ఖన్నా మాట్లాడుతూ – ''నేను తరచూ వర్కవుట్స్ చేస్తూనే ఉంటాను. ఫలితాలు ఎప్పుడూ ఓవర్‌నైట్‌లో రావు. అలాగే కఠినమైన డైటింగ్‌ల మీద పెద్దగా ఆసక్తి చూపించను. కానీ ప్రస్తుతానికి చాలా ఫిట్‌గా అనిపిస్తున్నాను. ఇక్కడి వరకూ రావడానికి నాకు రెండేళ్ల సమయం పట్టింది. ప్రస్తుతం హ్యాపీగా, హెల్తీగా ఉన్నాను. వారంలో ఆరు రోజులు వ్యాయామం చేస్తాను'' అన్నారు. ప్రస్తుతం రాశీ ఖన్నా తెలుగులో 'వెంకీ మామ', తమిళంలో 'సంఘతమిళన్' సినిమాలతో బిజీగా ఉన్నారు.

## వెంటాడే ఫీల్‌తో..


కారుణ్య, శ్రీరామ్

శ్రీరామ్, కారుణ్య కత్రేన్ జంటగా నటిస్తున్న చిత్రం 'ఉత్తర'. లైవ్ ఇన్ సి క్రియేషన్స్, గంగోత్రి ఆర్ట్ క్రియేషన్స్ పతాకాలపై తిరుపతి ఎస్.ఆర్. దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందింది. ఈ చిత్రం ట్రైలర్ ఆవిష్కరణ కార్యక్రమంలో తమ్మారెడ్డి భరద్వాజ, రాజ్ కందుకూరి పాల్గొన్నారు. తమ్మారెడ్డి భరద్వాజ మాట్లాడుతూ– ''సురేశ్ బొబ్బిలి సంగీతం అంటే చాలా ఇష్టం. సినిమా కథలోని ఆత్మను తన సంగీతంతో పలికించే ప్రయత్నం చేస్తాడు'' అన్నారు. ''ట్రైలర్ కొత్త ఫీల్‌ని కలిగించింది. ప్రతిభ ఉన్నవాళ్లంతా కలిసి చేసిన ఈ సినిమా విజయం సాధించాలి'' అన్నారు రాజ్ కందుకూరి. ''ఈ సినిమాలో నన్ను హీరోగా సెలెక్ట్ చేసిన దర్శకునికి రుణపడి ఉంటాను. సినిమాలో కొత్తదనం ఉంటే ప్రేక్షకులు, ఇండస్ట్రీ అందరూ ఆదరిస్తారు. అలాంటి మంచి సినిమానే మేం చేశాం'' అన్నారు శ్రీరామ్. తిరుపతి మాట్లాడుతూ– ''సహజమైన పాత్రలతో సినిమా ఉంటుంది. సినిమా విడుదలైన కొన్ని రోజుల వరకు ఆ ఫీల్ ప్రేక్షకులను వెంటాడుతుంది'' అన్నారు. నిర్మాత శ్రీపతి గంగదాస్ మాట్లాడుతూ – ''తిరుపతి సినిమాను బాగా తీశారు. అనుకున్నట్లుగానే సినిమా బాగా రావడానికి కారణం టీమ్'' అన్నారు. ''మంచి పాత్ర చేశాను'' అన్నారు కారుణ్య.

## రెండు గంటల ప్రేమ


శ్రీపవార్, కృతి

శ్రీ పవార్ హీరోగా నటించి, దర్శకత్వం వహించిన చిత్రం '2 అవర్స్ లవ్'. కృతీ గార్గ్ హీరోయిన్. ఈ సినిమా ట్రైలర్‌ను నిర్మాత రాజ్ కందుకూరి విడుదల చేసి, మాట్లాడుతూ – ''2 అవర్స్ లవ్' అంటే రెండు గంటల పాటు ప్రేక్షకులను ప్రేమలోనే ఉంచే సినిమా అనుకుంటున్నాను. శ్రీ పవార్ బాగా చేశాడని ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది'' అన్నారు. హీరో, దర్శకుడు శ్రీ పవార్ మాట్లాడుతూ– ''చిన్నప్పటి నుంచి సినిమాలంటే ఆసక్తి. ముఖ్యంగా దర్శకత్వం గురించి ఆలోచించేవాడిని. నన్ను దర్శకత్వం వైపు ఇన్‌స్పైర్ చేసిన వ్యక్తి సుకుమార్‌గారు. కాబట్టి మా చిత్రాన్ని ఆయనకు డెడికేట్ చేస్తున్నాను. ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ అఖిల నా స్నేహితురాలు. కథ నచ్చడంతో సాఫ్ట్‌వేర్ ఫీల్డ్ అయినా కూడా నాకు సపోర్ట్ చేసింది. ఆమె భర్త ఎంతో సపోర్ట్ చేశారు. వారిద్దరికీ, మా అక్క, బావగారికి థాంక్స్'' అన్నారు. ''నిర్మాతగా నా తొలి ప్రయత్నం ఇది. కష్టపడి చేశాం. ప్రేక్షకులు ఆదరిస్తారని నమ్ముతున్నాం'' అన్నారు అఖిల గంజి.







## 18 రోజుల వ్యవధిలో హిమ దాస్ ఖాతాలో ఐదో స్వర్ణం

అంతర్జాతీయ వేదికపై భారత మహిళా అథ్లెట్ హిమ దాస్ తన పసిడి పతకాల వేట కొనసాగిస్తోంది. 18 రోజుల వ్యవధిలో హిమ దాస్ ఐదో స్వర్ణాన్ని సొంతం చేసుకొని ఔరా అనిపించింది. చెక్ రిపబ్లిక్‌లో శనివారం జరిగిన అంతర్జాతీయ అథ్లెటిక్స్ మీట్‌లో హిమ దాస్ 400 మీటర్ల రేసును 52.09 సెకన్లలో ముగించి విజేతగా నిలిచింది. భారత్‌కే చెందిన విస్మయ 52.42 సెకన్లతో రజతాన్ని దక్కించుకుంది. గత మూడు వారాల్లో హిమ దాస్ 200 మీటర్ల విభాగంలో నాలుగు స్వర్ణాలు గెల్చుకోగా, 400 మీటర్ల విభాగంలో ఆమెకిదే తొలి పసిడి పతకం.



# టైటిల్‌కు విజయం దూరంలో...



మరోసారి సాధికారిక ప్రదర్శనతో అలరించిన భారత బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు ఈ ఏడాది తొలిసారి ఓ అంతర్జాతీయ టోర్నీలో ఫైనల్‌కు చేరింది. సీజన్‌లో తొలి టైటిల్ లోటును తీర్చుకునేందుకు మరో విజయం దూరంలో నిలిచింది. ప్రతిష్టాత్మక ఇండోనేసియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-1000 టోర్నమెంట్‌లో ఈ ఆంధ్రప్రదేశ్ అమ్మాయి తుది సమరానికి అర్హత సాధించింది.

- ఇండోనేసియా ఓపెన్ ఫైనల్లో పీవీ సింధు
- సెమీస్‌లో ప్రపంచ మూడో ర్యాంకర్ చెన్ యుఫెపై విజయం
- నేటి ఫైనల్లో నాలుగో ర్యాంకర్ అకానె యామగుచితో అమీతుమీ

**మధ్యాహ్నం గం. 12.30 నుంచి స్టార్ స్పోర్ట్స్-1లో ప్రత్యక్ష ప్రసారం**

**జకార్తా:** నెల రోజులపాటు లభించిన విరామ సమయంలో పక్కా ప్రణాళికతో సాధన చేసిన భారత బ్యాడ్మింటన్ స్టార్ పూసర్ల వెంకట (పీవీ) సింధు అద్భుత ఫలితాలు సాధిస్తోంది. ప్రతిష్టాత్మక ఇండోనేసియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-1000 టోర్నమెంట్‌లో సింధు ఫైనల్లోకి దూసుకెళ్లింది. శనివారం జరిగిన మహిళల సింగిల్స్ సెమీ ఫైనల్లో ప్రపంచ ఐదో ర్యాంకర్ సింధు 46 నిమిషాల్లో 21-19, 21-10తో ప్రపంచ మూడో ర్యాంకర్ చెన్ యుఫె (చైనా)పై గెలిచింది. ఈ ఏడాది సింగపూర్ ఓపెన్, ఇండియా ఓపెన్‌లో సెమీఫైనల్లో వెనుదిరిగిన ఈ తెలుగమ్మాయి తాజా గెలుపుతో సీజన్‌లో తొలి టైటిల్ పోరుకు అర్హత సాధించింది. నేడు జరిగే ఫైనల్లో ప్రపంచ నాలుగో ర్యాంకర్ అకానె యామగుచి (జపాన్)తో సింధు ఆడుతుంది. ముఖాముఖి రికార్డులో సింధు 10-4తో యామగుచిపై ఆధిక్యంలో ఉంది. రెండో సెమీఫైనల్లో అకానె యామగుచి 21-9, 21-15తో ప్రపంచ నంబర్‌వన్, టాప్ సీడ్, డిఫెండింగ్ చాంపియన్ తై జు యింగ్ (చైనీస్ తైపీ)ను బోల్తా కొట్టించింది.

ఈ ఏడాది ఆస్ట్రేలియా ఓపెన్, స్విస్ ఓపెన్, ఆల్ ఇంగ్లండ్ ఓపెన్ టైటిల్స్ సాధించి జోరు మీదున్న చెన్ యుఫె ఆటలు సింధు ముందు సాగలేదు. తొలి గేమ్‌లో ఇద్దరూ నువ్వా నేనా అన్నట్లు పోరాడారు. నాలుగుసార్లు చెన్ యుఫె ఆధిక్యంలోకి వెళ్లినా దానిని నిలబెట్టుకోలేకపోయింది. సింధు 14-18తో వెనుకబడిన దశలో వరుసగా ఐదు పాయింట్లు నెగ్గి 19-18తో ఆధిక్యంలోకి వచ్చింది. ఆ తర్వాత చెన్ యుఫె ఒక పాయింట్ సాధించగా... ఆ వెంటనే సింధు రెండు పాయింట్లు గెలిచి గేమ్‌ను దక్కించుకుంది. రెండో గేమ్ ఆరంభంలో సింధు తడబడినట్లు కనిపించినా వెంటనే గాడిలో పడింది. 2-5తో వెనుకబడిన దశలో సింధు వరుసగా ఏడు పాయింట్లు గెలిచి 9-5తో ఆధిక్యంలోకి వచ్చింది. ఆ తర్వాత స్కోరు 10-8తో ఉన్నదశలో సింధు వరుసగా 8 పాయింట్లు సాధించి 18-8తో తిరుగులేని ఆధిక్యాన్ని సంపాదించింది. అదే జోరులో రెండో గేమ్‌తోపాటు మ్యాచ్‌ను సొంతం చేసుకుంది.

**3** ఇండోనేసియా ఓపెన్‌లో భారత్ తరఫున ఫైనల్ చేరిన మూడో ప్లేయర్‌గా సింధు నిలిచింది. గతంలో సైనా నెహ్వాల్ వరుసగా నాలుగుసార్లు (2009, 2010, 2011, 2012) ఫైనల్ చేరి మూడుసార్లు (2009, 2010, 2012) టైటిల్ గెలిచింది. పురుషుల సింగిల్స్‌లో కిడాంబి శ్రీకాంత్ 2017లో విజేతగా నిలిచాడు.

## విండీస్ పర్యటనకు ధోని దూరం

- స్వయంగా ప్రకటించిన మాజీ కెప్టెన్
- రెండు నెలలు ప్రాదేశిక సైన్యంలో పనిచేయనున్నట్లు వెల్లడి



**న్యూఢిల్లీ:** ఓవైపు రిటైర్మెంట్‌పై ఎడతెగని చర్చ నడుస్తుండగా... మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోని శనివారం ఒకింత ఆశ్చర్యకర ప్రకటన చేశాడు. మూడు టి20లు, మూడు వన్డేలు, రెండు టెస్టులు ఆడేందుకు ఆగస్టులో వెస్టిండీస్‌లో పర్యటించనున్న భారత జట్టు ఎంపికకు అందుబాటులో ఉండనని భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ)కి స్వయంగా తెలిపాడు. రాబోయే రెండు నెలలు తాను ప్రాదేశిక సైన్యం (టెరిటోరియల్ ఆర్మీ)లో పని చేయాలని భావిస్తున్నట్లు పేర్కొన్నాడు. వెస్టిండీస్ పర్యటనకు జట్టు ఎంపిక కోసం ఆదివారం ముంబైలో సెలక్టర్లు సమావేశం కానున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ధోని తన ప్రణాళిక వెల్లడించాడు. 'మేం మూడు విషయాలు స్పష్టం చేయదల్చుకున్నాం. ధోని ఇప్పుడే క్రికెట్ నుంచి రిటైరవ్వట్లేదు. అతడు ముందుగా అనుకున్న ప్రకారం సైన్యంలో పని చేసేందుకు రెండు నెలలు విరామం కోరాడు. ఈ విషయాన్ని మేం కెప్టెన్ విరాట్ కోహ్లి, చీఫ్ సెలక్టర్ ఎమ్మెస్కే ప్రసాద్‌కు తెలియజేశాం' అని బీసీసీఐ సీనియర్ అధికారి ఒకరు వివరించారు. ధోని... పదాతి దళం పారాచూట్ రెజిమెంట్‌లో గౌరవ లెఫ్టినెంట్ కల్నల్ హోదాలో ఉన్నాడు. కరీబియన్ పర్యటనకు ధోని ఎంపిక అనుమానంగా మారిన నేపథ్యంలో ఇప్పుడతడి విరామ నిర్ణయంతో బంతి సెలెక్టర్ల కోర్టులో పడింది. భవిష్యత్ అవసరాలకు తగిన జట్టును రూపొందించే ఆలోచనలో ఉన్న సెలక్టర్లు... ధోని విషయంలో కెప్టెన్ కోహ్లి ఉద్దేశం ఏమిటో తెలుసుకునే ప్రయత్నం చేయొచ్చని సమాచారం. 'సెలక్షన్ కమిటీ ఎప్పుడూ ఒక విషయంలో స్పష్టతతో ఉంటుంది. ఆటగాడు ఏ స్థాయివాడైనా అతడి విరమణ కోరే హక్కు వారికి లేదు. ఎంపిక సంగతికి వస్తే మాత్రం వారిదే తుది నిర్ణయం' అని బీసీసీఐ అధికారి తెలిపారు. అయితే, ధోని మరికొంత కాలం (బహుశా వచ్చే ఏడాది టి20 ప్రపంచ కప్ వరకు) కొనసాగాలని అనుకుంటే సెలక్టర్లకు చిక్కొచ్చి పడనుంది. ఈ వ్యవధిలో టీమిండియా పలు టి20 సిరీస్‌ల్లో 15 నుంచి 18 మ్యాచ్‌లు ఆడనుంది. వీటిలో ధోనికి అవకాశం ఇవ్వాల్సి ఉంటుంది. ప్రస్తుత సెలక్షన్ కమిటీ గడువు అక్టోబరుతో ముగుస్తోంది. అదే సమయంలో బీసీసీఐ కార్యవర్గ ఎన్నికలు సైతం జరుగనున్నాయి. అన్నిటికి మించి ఇప్పుడు అందరి దృష్టి ఆదివారం జట్టు సెలక్షన్ తర్వాత మీడియా సమావేశంలో చీఫ్ సెలక్టర్ ఎమ్మెస్కే ఏం మాట్లాడతాడు? అనే దానిపైనే ఉంది.

# తెలుగు టైటాన్స్ తడబాటు



తెలుగు టైటాన్స్ ప్లేయర్ సిద్ధార్థ్ దేశాయ్‌ను పట్టేసిన యు ముంబా ఆటగాళ్లు

ప్రొ కబడ్డీ లీగ్ కొత్త సీజన్ కూడా తెలుగు టైటాన్స్‌కు నిరాశాజనకంగా ఆరంభమైంది. సొంతగడ్డపై జరిగిన ఆరంభ పోరులో మాజీ చాంపియన్ యు ముంబాకు టైటాన్స్ తలవంచింది. కీలక సమయంలో పాయింట్లు సాధించడంలో విఫలమైన తెలుగు జట్టు... చివర్లో వరుస పాయింట్లతో ప్రత్యర్థికి చేరువగా వచ్చేందుకు ప్రయత్నించినా అప్పటికే ఆలస్యమైంది.

- టోర్నీ తొలి మ్యాచ్‌లోనే ఓటమి
- యు ముంబా గెలుపు బోణీ
- పైరేట్స్‌పై బుల్స్ విజయం
- ప్రొ కబడ్డీ లీగ్ ప్రారంభం

**నేటి మ్యాచ్‌లు**

బెంగళూరు బుల్స్ X గుజరాత్ ఫార్చూన్ జెయింట్స్
రాత్రి గం. 7.30 నుంచి

తెలుగు టైటాన్స్ X తమిళ్ తలైవాస్
రాత్రి గం. 8.30 నుంచి

స్టార్ స్పోర్ట్స్-1లో ప్రత్యక్ష ప్రసారం

**సాక్షి, హైదరాబాద్:** ప్రొ కబడ్డీ లీగ్ ఏడో సీజన్ తొలి మ్యాచ్‌లో ఆతిథ్య జట్టు తెలుగు టైటాన్స్‌కు చుక్కెదురైంది. గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో శనివారం జరిగిన మ్యాచ్‌లో యు ముంబా 31-25 పాయింట్ల తేడాతో టైటాన్స్‌ను ఓడించింది. తొలి అర్ధ భాగం ముగిసే సరికి 17-10తో ఆధిక్యంలో నిలిచిన ముంబా చివరి వరకు దానిని నిలబెట్టుకుంది.

### సమష్టి వైఫల్యం...

టైటాన్స్ ఆటలో ఆరంభం నుంచి కూడా దూకుడు కనిపించలేదు. స్కోరు 1-1తో ఆట మొదలైన తర్వాత సిద్ధార్థ్ ఖాళీ రైడ్‌తో వెనక్కి రావడం మొదలు మ్యాచ్‌లో చాలా వరకు అలాంటి స్థితే కనిపించింది. ముంబా కోర్టులో ఫర్హద్ దొరికిపోవడంతో 4-5తో తొలిసారి వెనుకంజ వేసిన టైటాన్స్ మళ్లీ కోలుకోలేదు. ఆ తర్వాత ముంబా ఆధిక్యం 8-5నుంచి 17-8 వరకు సాగింది. తొలి అర్ధ భాగం చివర్లో రాకేశ్, రోహిత్ రైడ్లతో రెండు పాయింట్లు సాధించిన తెలుగు టీమ్ పాయింట్ల ఆధిక్యాన్ని తగ్గించింది. తొలి అర్ధభాగంలో టైటాన్స్ ఒకసారి ఆలౌట్ అయింది. రెండో అర్ధభాగంలో మాత్రం టైటాన్స్ ప్రత్యర్థితో పోలిస్తే మెరుగైన ప్రదర్శన కనబర్చింది. మరోసారి ఆలౌట్ అయినా కూడా టైటాన్స్ మొత్తం 15 పాయింట్లు సాధించగా, ముంబా 14 పాయింట్లు మాత్రమే గెలుచుకుంది. ముఖ్యంగా చివరి పది నిమిషాల్లో టైటాన్స్‌కు వరుసగా పాయింట్లు వచ్చాయి. అయితే బలమైన డిఫెన్స్‌ను ప్రదర్శించిన ముంబా మ్యాచ్ తమ చేజారకుండా చూసుకుంది.

### సిద్ధార్థ్ విఫలం...

వేలంలో భారీ మొత్తానికి ధర పలకడంతో పాటు ఎన్నో అంచనాలతో తొలి మ్యాచ్ ఆడిన టైటాన్స్ ఆటగాడు సిద్ధార్థ్ దేశాయ్ నిరాశపర్చాడు. తొలి అర్ధ భాగంలో ఆరు సార్లు రైడింగ్‌కు వెళ్లిన అతను ఒక్క పాయింట్ కూడా సాధించలేకపోయాడు. మూడు సార్లు అతడిని ప్రత్యర్థి జట్టు పట్టేయగా, రెండు సార్లు ఉత్త చేతులతో తిరిగొచ్చాడు. ఒకసారైతే 'డు ఆర్ డై' రైడ్‌లో కూడా ఖాళీగా రావడంతో టైటాన్స్ పాయింట్ కోల్పోవాల్సి వచ్చింది. అన్యమనస్కంగా కనిపించిన అతడిని కోచ్ రెండో అర్ధభాగంలో తొలి తొమ్మిది నిమిషాలు డగౌట్‌లోనే కూర్చోబెట్టాడంటే అతని ఆట ఎలా సాగిందో అర్థమవుతోంది. ఎట్టకేలకు తన ఎనిమిదో ప్రయత్నంలో బోనస్ ద్వారా పాయింట్ సాధించిన అతను చివర్లో మాత్రం బాగా ఆడేందుకు ప్రయత్నించాడు. జట్టు సాధించిన ఆఖరి 10 పాయింట్లలో 5 దేశాయ్ రైడింగ్‌లో తెచ్చినవే ఉన్నాయి. టైటాన్స్ తరఫున గరిష్టంగా రజనీశ్ 8 పాయింట్లు సాధించగా, కెప్టెన్ అబోజర్ 2 టాకిల్ పాయింట్లకే పరిమితమయ్యాడు. ముంబా తరఫున అభిషేక్ అత్యధికంగా 10 పాయింట్లు సాధించాడు. ఇరు జట్ల మధ్య టాకిల్ పాయింట్లు సమంగా (10) ఉండగా రైడింగ్ పాయింట్లలో ముంబా 1 ఎక్కువగా సాధించింది. అయితే రెండు సార్లు ఆలౌట్ కావడంతో పోగొట్టుకున్న 4 పాయింట్లే తుది ఫలితంలో తేడాగా మారాయి.

మరో మ్యాచ్‌లో విజయంతో డిఫెండింగ్ చాంపియన్ బెంగళూరు బుల్స్ సీజన్-7లో శుభారంభం చేసింది. హోరాహోరీగా సాగిన ఈ మ్యాచ్‌లో బుల్స్ 34-32 స్కోరుతో పట్నా పైరేట్స్‌పై గెలుపొందింది. బెంగళూరు తరఫున పవన్ సెహ్రావత్ 9 పాయింట్లు స్కోరు చేయగా, పట్నా తరఫున పర్‌దీప్ నర్వాల్ 10, ఇస్మాయిల్ 9 పాయింట్లు సాధించారు.

# శివ థాపా పసిడి పంచ్

**ప్రెసిడెంట్స్ కప్ బాక్సింగ్ టోర్నీ**



**నూర్ సుల్తాన్ (కజకిస్తాన్):** 13 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ నాలుగు సార్లు ఆసియా చాంపియన్‌షిప్ పతక విజేత, భారత బాక్సర్ శివ థాపా కజకిస్తాన్ ప్రెసిడెంట్స్ కప్ టోర్నీలో భారత్‌కు తొలి స్వర్ణ పతకాన్ని అందించాడు. 63 కేజీల విభాగంలో శివ థాపా విజేతగా నిలిచాడు. అతనితో ఫైనల్లో తలపడాల్సిన ప్రత్యర్థి జకీర్ సఫియుల్లిన్ (కజకిస్తాన్) గాయం కారణంగా బరిలోకి దిగకపోవడంతో శివ థాపాకు వాకోవర్ లభించింది. స్వర్ణ పతకం ఖాయమైంది. 2006లో మొదలైన ప్రెసిడెంట్స్ కప్ టోర్నీలో భారత్‌కిదే తొలి పసిడి పతకం కావడం విశేషం. పురుషుల విభాగంలో భారత్‌కే చెందిన దుర్యోధన్ సింగ్ (69 కేజీలు) కాంస్యం, మహిళల విభాగంలో పర్వీన్ (60 కేజీలు) రజతం, సవీటి బొూరా (75 కేజీలు) కాంస్యం సాధించారు. ఓవరాల్‌గా భారత్ స్వర్ణం, రజతం, రెండు కాంస్యాలతో కలిపి మొత్తం 4 పతకాలతో టోర్నీని ముగించింది.

# ఓవర్ త్రో నిబంధనల సమీక్ష

**ఎంసీసీ యోచన**

**లండన్:** తాజాగా ముగిసిన ప్రపంచ కప్ ఫైనల్లో ఓవర్ త్రో నిబంధనలు తీవ్ర చర్చను రేకెత్తించిన నేపథ్యంలో... వాటిని సమీక్షించాలని మెరిల్‌బోన్ క్రికెట్ క్లబ్ (ఎంసీసీ) భావిస్తోంది. క్రికెట్‌లో నిబంధనలను పొందుపర్చే ఎంసీసీ ఈ మేరకు ఆలోచిస్తున్నట్లు స్థానిక మీడియా తెలిపింది. సంస్థకు చెందిన న్యాయ విభాగ ఉప సంఘానికి ఈ బ్యాధత అప్పగించనున్నట్లు సమాచారం. గత ఆదివారం ముగిసిన ఫైనల్లో ఫీల్డ్ అంపైర్లు ఓవర్ త్రో రూపంలో ఇంగ్లండ్‌కు ఆరు పరుగులు (2+4) ఇవ్వడం వివాదాస్పదమైంది. బ్యాట్స్‌మెన్ రెండో పరుగుకు ప్రయత్నించిన సందర్భంలో ఒకరినొకరు దాటలేదు కనుక నిబంధనల ప్రకారం ఐదు పరుగులు ఇవ్వడం సరైనదని ఐసీసీ ఎలైట్ ప్యానెల్ మాజీ అంపైర్ సైమన్ టౌఫెల్ పేర్కొన్న సంగతి విదితమే.

# పోరాడి ఓడిన భారత్ 'ఎ'

**అక్షర్ పటేల్ పోరాటం వృథా**

**కూలిడ్జ్:** విండీస్ 'ఎ' జట్టుపై 'హ్యాట్రిక్' విజయాలతో సిరీస్‌ను సొంతం చేసుకున్న భారత్ 'ఎ' జట్టుకు తొలి ఓటమి ఎదురైంది. భారత కాలమానం ప్రకారం శుక్రవారం అర్ధరాత్రి దాటాక ముగిసిన నాలుగో వన్డేలో భారత్ 'ఎ' ఐదు పరుగుల తేడాతో ఓడిపోయింది. ఛేదనలో ఆల్ రౌండర్ అక్షర్ పటేల్ (63 బంతుల్లో 81 నాటౌట్; 8 ఫోర్లు, ఒక సిక్స్) పోరాటం వృథా అయింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన వెస్టిండీస్ 'ఎ' నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్లు నష్టపోయి 298 పరుగులు చేసింది. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' రోస్టన్ చేజ్ (100 బంతుల్లో 84; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), డివోన్ థామస్ (95 బంతుల్లో 70; 4 ఫోర్లు, 4 సిక్స్‌లు), జొనాథన్ కార్టర్ (43 బంతుల్లో 50; 8 ఫోర్లు) రాణించారు. తొలి ఓవర్ ఐదో బంతికే విండీస్ ఓపెనర్ ఒట్లీ వికెట్‌ను తీసిన భారత పేసర్ ఖలీల్ అహ్మద్ మంచి ఆరంభం ఇచ్చినా భారత్ దానిని నిలబెట్టుకోలేక పోయింది. విండీస్ బ్యాట్స్‌మెన్ నిలకడగా ఆడుతూ వరుసగా మంచి భాగస్వామ్యాలను నెలకొల్పారు. భారత్ తరఫున ఖలీల్ అహ్మద్ (4 వికెట్లు), ఆవేశ్ ఖాన్ (3 వికెట్లు) ఆకట్టుకున్నారు. అనంతరం 299 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్ 50 ఓవర్లలో తొమ్మిది వికెట్లకు 293 పరుగులు చేసి పరాజయం పాలైంది. ఒకదశలో భారత్ 'ఎ' 160 పరుగులకే 6 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో అక్షర్ పటేల్ విండీస్ బౌలర్లపై ఎదురుదాడికి దిగాడు. వాషింగ్టన్ సుందర్ (52 బంతుల్లో 45; 3 ఫోర్లు)తో కలిసి ఏడో వికెట్‌కు 60 పరుగులు, ఖలీల్ అహ్మద్ (15 బంతుల్లో 15)తో ఎనిమిదో వికెట్‌కు 69 పరుగులు జోడించి భారత్ శిబిరంలో ఆశలు రేపాడు. మూడు బంతులతేడాలో ఖలీల్ అహ్మద్, నవదీప్ సైనిలు ఔటవ్వడంతో భారత్ కోలుకోలేకపోయింది. చివరి ఓవర్లో విజయానికి 9 పరుగులు కావాల్సిన నేపథ్యంలో భారత్ 'ఎ' కేవలం 3 పరుగులు మాత్రమే చేసి ఓడింది. విండీస్ తరఫున పావెల్, కీమో పాల్‌లు చెరో రెండు వికెట్లు తీసి జట్టు విజయంలో తమ వంతు పాత్రను పోషించారు. సిరీస్‌లో చివరి మ్యాచ్ ఆదివారం జరగనుంది.



అక్షర్ పటేల్

# మెయిన్ 'డ్రా'కు శ్రీజ



**కటక్:** కామన్వెల్త్ టేబుల్ టెన్నిస్ (టీటీ) చాంపియన్‌షిప్ మహిళల సింగిల్స్ విభాగంలో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న తెలంగాణ ప్లేయర్ ఆకుల శ్రీజ మెయిన్ 'డ్రా'కు అర్హత సాధించింది. శనివారం నిర్వహించిన క్వాలిఫయింగ్ పోటీల్లో గ్రూప్-6లో పాల్గొన్న శ్రీజ టాపర్‌గా నిలిచింది. తొలి మ్యాచ్‌లో శ్రీజ 11-7, 11-4, 11-6తో కొన్‌స్టాటినా (సైప్రస్)పై గెలిచింది. రెండో మ్యాచ్‌లో శ్రీజకు ఆమె ప్రత్యర్థి తెగీనా నకిబులె (ఉగాండా) నుంచి వాకోవర్ లభించింది. శ్రీజతోపాటు భారత్ నుంచి కృత్వికా సిన్హా రాయ్, సుతీర్థ ముఖర్జీ, మౌసుమి పాల్, ప్రాప్తి సేన్, సెలీనా సెల్వకుమార్, దివ్య దేశ్‌పాండే, సాగరిక ముఖర్జీ, అనూష కూడా మెయిన్ 'డ్రా'కు అర్హత పొందారు.

# సెమీస్‌లో పేస్ జంట



**న్యూపోర్ట్ (అమెరికా):** భారత టెన్నిస్ దిగ్గజం లియాండర్ పేస్ హాల్ ఆఫ్ ఫేమ్ ఏటీపీ-250 టోర్నమెంట్‌లో డబుల్స్ విభాగంలో సెమీఫైనల్లోకి దూసుకెళ్లాడు. పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో మూడో సీడ్ లియాండర్ పేస్-మార్కస్ డానియల్ (న్యూజిలాండ్) ద్వయం 6-4, 5-7, 14-12తో మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా)-రాబర్ట్ లిండ్‌స్టెట్ (స్వీడన్) జోడీపై గెలిచింది. 46 ఏళ్ల పేస్ 1995లో హాల్ ఆఫ్ ఫేమ్ టోర్నీలో తొలిసారి ఆడాడు. తాజా విజయంతో పేస్ జాన్ మెకన్రో (47 ఏళ్లు-2006 సాన్‌జోస్ టోర్నీ) తర్వాత ఏటీపీ టోర్నీలో సెమీఫైనల్‌కు చేరిన పెద్ద వయస్కుడిగా గుర్తింపు పొందాడు.

# భారత్ శుభారంభం



విష్ణు

**సుజౌ (చైనా):** ఆసియా జూనియర్ మిక్స్‌డ్ టీమ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భారత జట్టు శుభారంభం చేసింది. శనివారం జరిగిన గ్రూప్ 'సి' రెండు లీగ్ మ్యాచ్‌ల్లో భారత్ ఘన విజయం సాధించింది. తొలి మ్యాచ్‌లో 5-0తో మంగోలియాను ఓడించిన టీమిండియా... రెండో మ్యాచ్‌లోనూ 5-0తో మకావు జట్టుపై గెలిచింది. బాలుర డబుల్స్ విభాగంలో తెలంగాణ ప్లేయర్ పంజాల విష్ణువర్ధన్ గౌడ్ బరిలోకి దిగిన రెండు మ్యాచ్‌ల్లోనూ భారత్‌ను గెలిపించాడు. మకావుతో జరిగిన మ్యాచ్‌లో విష్ణువర్ధన్-ఇషాన్ భట్నాగర్ జంట 21-9, 21-9తో ఎన్జీ కా సెంగ్-పుయ్ చి చోన్ జోడీపై నెగ్గింది. మంగోలియాతో జరిగిన మ్యాచ్‌లో విష్ణువర్ధన్-ఇషాన్ జంట 21-10, 21-6తో సుమియాసురెన్-సంజిరిజావ్ ద్వయంపై విజయం సాధించింది.

# ఆ విజయం సమంజసంగా లేదు

**ప్రపంచ కప్ ఫైనల్ గెలుపుపై మోర్గాన్**



**లండన్:** ప్రపంచ కప్ ఫైనల్ మ్యాచ్ గెలుపుపై ఇంగ్లండ్ కెప్టెన్ ఇయాన్ మోర్గాన్ ఆసక్తికర వ్యాఖ్య చేశాడు. ఆద్యంతం సమంగా సాగిన మ్యాచ్‌లో ఈ విధంగా ఫలితం రావడం తనకూ సమంజసం అనిపించలేదని అతడు అన్నాడు. తుది సమరంలో మ్యాచ్, సూపర్ ఓవర్ స్కోర్లు టై అయినందున ఎక్కువ బౌండరీలు కొట్టిన జట్టును విజేతగా ప్రకటించారు. గెలుపు, ఓటమి పరిస్థితిని వర్ణించలేని స్థితిలో తాను ఉన్నానని మోర్గాన్ అన్నాడు. ఒకవేళ ఓడిపోయి ఉంటే తాము తీవ్రంగా కలత చెందేవారమని పేర్కొన్నాడు. అయినా, చివరకు విజయానికి తాము అర్హులమేనని ప్రకటించుకున్నాడు. గత రెండు రోజులుగా న్యూజిలాండ్ కెప్టెన్ విలియమ్సన్‌తో మాట్లాడుతూనే ఉన్నానని మోర్గాన్ తెలిపాడు. ఉత్కంఠభరిత మ్యాచ్‌ల్లో ఇటీవలి ప్రపంచ కప్ ఫైనల్‌కు ఏదీ సాటిరాదని అతడు అన్నాడు.

# ఎల్‌సీ ఇవ్వకుంటే కరెంట్ కట్!

- లోడ్ డిస్పాచ్ సెంటర్లకు కేంద్ర విద్యుత్ శాఖ ఆదేశం
- డిస్కంలకు పవర్ షెడ్యూలింగ్ చేయకండి
- ఆగస్టు 1 నుంచి విద్యుత్ కొనుగోళ్లకు ఎల్‌సీ తప్పనిసరి
- ఆందోళనలో విద్యుత్ పంపిణీ సంస్థలు

**సాక్షి, హైదరాబాద్:** కరెంటుకు కట్‌కటా ఏర్పడే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇప్పటికే తీవ్ర ఆర్థిక కష్టాల్లో ఉన్న దక్షిణ/ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)లు కొత్త నిబంధనలతో మరింత సంక్షోభంలో కూరుకుపోయే అవకాశాలున్నాయి. ఆగస్టు 1 నుంచి లెటర్ ఆఫ్ క్రెడిట్(ఎల్‌సీ) తప్పనిసరిస్తూ గత నెల 28న జారీ చేసిన ఉత్తర్వులను దక్షిణాది రాష్ట్రాల డిస్కంలు తీవ్రంగా వ్యతిరేకించినా, కేంద్ర విద్యుత్ శాఖ వెనక్కి తగ్గలేదు. ఈ నెల 16న చెన్నైలో సమావేశమైన ఆరు దక్షిణాది రాష్ట్రాల విద్యుత్ కమిటీ ముందస్తు ఎల్‌సీ జారీ చేయలేమని చేతులెత్తేసిన విషయం తెలిసిందే. ఈ ఉత్తర్వుల అమలు వాయిదా వేసుకోవాలని, లేనిపక్షంలో తీవ్ర సమస్యలు ఉత్పన్నమవుతాయని కేంద్రానికి విజ్ఞప్తి చేసింది. అయితే దీన్ని విద్యుత్ శాఖ బేఖాతరు చేసింది. ఎల్‌సీ జారీ చేయడంలో విఫలమైన డిస్కంలకు పవర్ షెడ్యూలింగ్ చేయరాదని ప్రాంతీయ లోడ్ డిస్పాచ్ సెంటర్లను ఆదేశిస్తూ ఈ నెల 17న మరో లేఖ రాసింది. కనీసం వారం రోజులకు అవసరమైన విద్యుత్ కొనుగోళ్లకు అయినా డిస్కంలు ముందస్తు ఎల్‌సీ జారీ చేయాలని కోరింది. విద్యుదుత్పత్తి కంపెనీల నుంచి అవసరమైన మేర విద్యుత్ కొనుగోళ్లు చేసేందుకు, ఆ మేర చెల్లింపులకు హామీ కల్పిస్తూ ముందుగానే ఎల్‌సీ జారీ చేసినట్లు రాతపూర్వకంగా తెలియజేసిన డిస్కంలకే విద్యుత్ సరఫరా చేయాలని ప్రాంతీయ లోడ్ డిస్పాచ్ సెంటర్లను ఆదేశించింది. ఎంత విద్యుత్ అవసరమైనా అంత మేర వ్యయాన్ని ముందుగానే ఈ ఖాతాల్లో జమ చేయాల్సి ఉంటుంది. ఎల్‌సీ జారీ చేయడం సాధ్యం కాని పక్షంలో, కనీసం ఒక రోజు ముందు విద్యుదుత్పత్తి కంపెనీలకు ఎలక్ట్రానిక్ రూపంలో నగదు బదిలీ చేసి మరుసటి రోజుకు అవసరమైన విద్యుత్‌ను కొనుగోలు చేసుకోవాలని సూచించింది. ఎల్‌సీ జారీ చేయకపోయినా, ఒకరోజు ముందు నగదు బదిలీ చేయకపోయినా సంబంధిత డిస్కంలకు విద్యుత్ సరఫరా చేయొద్దని స్పష్టం చేసింది. ఈ పరిస్థితిలో డిస్కంలు అత్యవసరంగా తాత్కాలిక ఒప్పందాల ద్వారా కానీ, పవర్ ఎక్స్ఛేంజీల నుంచి కానీ విద్యుత్ కొనుగోళ్లకు ప్రయత్నిస్తే అనుమతించరాదని కోరింది.

**రాష్ట్ర ప్రభుత్వమే ఆదుకోవాలి..**

ప్రస్తుత పరిస్థితిలో ఎల్‌సీని తప్పనిసరి చేస్తే రాష్ట్రంలో మళ్లీ విద్యుత్ కోతలు చూడాల్సి వస్తుందని రాష్ట్ర ఇంధన శాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. రాష్ట్ర అవసరాల మేరకు విద్యుత్ కొనుగోళ్లకు ముందస్తు చెల్లింపులు చేసే పరిస్థితిలో డిస్కంలు లేవని, రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే రూ.1,000 కోట్లు కేటాయించక తప్పదని ఓ సీనియర్ అధికారి 'సాక్షి'కి తెలిపారు.




# 'ఇస్మార్ట్' పోలీసు

## వర్మ 'ట్వీట్'కు తగిన 'ట్రీట్'

**సాక్షి, హైదరాబాద్:** ఆయనది యాక్షన్.. వారిది ఇస్మార్ట్ రియాక్షన్! ఆయనది ట్వీట్.. వారిది 'ట్రీట్'. ఆయన పోలీసులెక్కడున్నారంటే.. వారు చలానా రూపంలో ప్రత్యక్షమయ్యారు. ఆయనే సినీ దర్శకుడు రాంగోపాల్ వర్మ. ఆయన రూటే సెపరేటు.. రీల్‌లోనూ, రియల్‌గానూ ఆయనది వివా దా'స్పదం'. టీఎస్07 2552 బుల్లెట్ బైక్‌ను ఆర్‌ఎక్స్100 ఫేమ్ అజయ్ భూపతి డ్రైవ్ చేస్తుంటే లక్ష్మీస్ ఎన్టీఆర్ ఆగస్త్య, రాంగోపాల్ వర్మ వెనుక కూర్చొని ఉన్నారు. ఈ ఫొటోను వర్మ ట్వీట్ చేయడం వివాదాస్పదమైంది. తాము మూసాపేటలోని శ్రీరాములు థియేటర్‌లో 'ఇస్మార్ట్ శంకర్'సినిమా చూసేందుకు హెల్మెట్ లేకుండా, ట్రిపుల్ రైడింగ్ చేస్తూ వెళుతున్నామంటూ ట్వీట్ చేసిన కొంతసేపటికి... 'పోలీసులు ఎక్కడ ఉన్నారు... వాళ్లంతా థియేటర్‌లో సినిమాలు చూస్తున్నారని అనుకుంటున్నాను'అని మరో ట్వీట్ చేయడంతో సోషల్ మీడియాలో హాట్‌టాపిక్‌గా మారింది. అయితే, వర్మ ట్వీట్లను ఫాలో అయ్యే ఓ వ్యక్తి.. ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించడమే కాకుండా పోలీసులకే సవాల్ విసిరిసేలా చేసిన వ్యాఖ్యలను యధావిధిగా సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులకు ఫేస్‌బుక్ ద్వారా పంపి ఫిర్యాదు చేశారు. ఆ వెంటనే సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు 'మీరు పంపిన ఫొటో ఆధారంగా ఆ బైక్ నంబర్‌కు ఈ–చలానా విధిస్తున్నాం... మాతో చేతులు కలిపినందుకు ధన్యవాదాలు'అంటూ ఇస్మార్ట్‌గా ప్రతిస్పందించారు. ట్రిపుల్ రైడింగ్‌కు రూ.1200, హెల్మెట్ లేనందుకు రూ.135... మొత్తంగా రూ.1335 జరిమానాను సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు విధించారు. అయితే, పోలీసులు జారీ చేసిన ఈ–చలానా బైక్ యజమాని బడ్డె దిలీప్‌కుమార్‌కు వెళ్లింది.

# క్యూ కట్టి.. క్యూసెక్కులై..!

- అల్మట్టిలోకి మరో 14 టీఎంసీలు చేరితే నీటి విడుదల
- 129 టీఎంసీలకు ప్రస్తుతం 115 టీఎంసీల నిల్వ
- 26,299 క్యూసెక్కుల మేర కొనసాగుతున్న ప్రవాహం

**సాక్షి, హైదరాబాద్:** వరదలు క్యూకట్టి క్యూసెక్కులవుతున్నాయి. జలాశయాలు కళకళలాడుతున్నాయి. రోజురోజుకూ నిల్వలు పెరుగుతున్నయ్.. ఇక కాలువలు పారుడే! నదీజలాలు పరవళ్లు తొక్కుతున్నయ్.. ఇక నారుమళ్లు తడుసుడే! మరో 14 టీఎంసీలు వస్తే ఆల్మట్టి ప్రాజెక్టు నిండుకుండలా మారుతుంది. 10 టీఎంసీల నీరు చేరినా గేట్లు ఎత్తుడే. ఇక గట్లు దూకుడే! ఆల్మట్టి నిండితే దిగువ ప్రాజెక్టులకు వరదే వరద! కృష్ణా బేసిన్‌లోని మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. నారాయణపూర్ డ్యామ్ దాదాపుగా నిండింది.

**పశ్చిమ కనుమల్లో...**

పదిహేను రోజులుగా పశ్చిమ కనుమల్లో కురిసిన వర్షాలతో ప్రాజెక్టుల్లోకి ప్రవాహాలు పెరిగాయి. ముఖ్యంగా ఆల్మట్టిలోకి ఏకంగా 103 టీఎంసీల మేర కొత్తనీరు వచ్చి చేరింది. దీంతో ప్రాజెక్టు నిల్వ సామర్థ్యం 129 టీఎంసీలకుగానూ ప్రస్తుతం 115 టీఎంసీలకు చేరాయి. శనివారం ప్రాజెక్టులోకి 26,299 క్యూసెక్కుల మేర ప్రవాహం వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నిల్వ 125 టీఎంసీలకు చేరితే ప్రాజెక్టు గేట్లు ఎత్తే అవకాశం ఉంటుంది. మరో రెండ్రోజులూ కర్ణాటకలో వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ ప్రకటనల నేపథ్యంలో ఆల్మట్టికి ప్రవాహాలు పుంజుకోనున్నాయి. అదే జరిగితే నాలుగైదు రోజుల్లోనే ఆల్మట్టి నిండుకుండలా మారనుంది. ఇక దిగువన నారాయణపూర్ ప్రాజెక్టులో 37 టీఎంసీలనిల్వకుగానూ 34 టీఎంసీల మేర నిల్వలున్నాయి. ఎగువ నుంచి 2 వేల క్యూసెక్కుల మేర ప్రవాహం వస్తోంది. ఇప్పటికే కాల్వల ద్వారా 2,037 క్యూసెక్కుల నీటిని సాగు అవసరాలకుగాను కిందికి విడుదల చేస్తున్నారు. ఆల్మట్టి నిండి దిగువకు నీరు వదిలితే నారాయణపూర్ ప్రాజెక్టులోకి ప్రవాహాలు పెరగనున్నాయి. అక్కడ చేపట్టే విద్యుదుత్పత్తి ద్వారా నీటిని దిగువన ఉన్న జూరాలకు వదిలే అవకాశం ఉంది. ఇక తుంగభద్ర ప్రాజెక్టుకు వరద ఉధృతి తగ్గినా 5,890 క్యూసెక్కుల మేర ఇన్‌ఫ్లో వస్తోంది. ఈ ప్రాజెక్టు నిల్వ సామర్థ్యం 100 టీఎంసీలకుగానూ 16.11 టీఎంసీలు ఉన్నాయి. ఇది మినహాయిస్తే రాష్ట్ర పరిధిలోని ప్రాజెక్టుల్లో ఎక్కడా పెద్దగా ప్రవాహాలు కనిపించడం లేదు. కేవలం నాగార్జునసాగర్‌లోకి 2,567 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో మాత్రం స్థానిక వరదల నుంచి వచ్చి చేరుతోంది.

**గోదా'వర్రీ'..**

గోదావరి బేసిన్‌లోని రాష్ట్ర ప్రాజెక్టుల్లో ఎక్కడా ప్రవాహాలు కానరావడం లేదు. సింగూరులోకి 767 క్యూసెక్కులు, ఎల్లంపల్లిలోకి 345 క్యూసెక్కుల ప్రవాహం మాత్రం వస్తుండగా, ఎస్సారెస్పీ, మిడ్‌మానేరు, లోయర్‌మానేరు, నిజాంసాగర్‌లకు ఎలాంటి ప్రవాహాలు లేవు. ప్రాణహిత నదిలో సైతం శనివారం 9,700 క్యూసెక్కుల మేర మాత్రమే నీటి ప్రవాహాలు వచ్చాయి. ఎగువ చత్తీస్‌గఢ్‌లో భారీ వర్షాలు మొదలైన నేపథ్యంలో ఒకట్రెండు రోజుల్లో ప్రాణహితకు వరద ఉధృతి పెరిగే అవకాశం ఉంటుందని నీటి పారుదల వర్గాలు అంచనా వేస్తున్నాయి. అదే జరిగితే మేడిగడ్డ నుంచి నీటి ఎత్తిపోతల తిరిగి మొదలుకానుంది.




# రేపే చంద్రయాన్-2 ప్రయోగం

**శ్రీహరికోట (సూళ్లూరుపేట):** శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్)లోని రెండో ప్రయోగవేదిక నుంచి సోమవారం మధ్యాహ్నం 2.43 గంటలకు చంద్రయాన్–2ను ప్రయోగించేందుకు సర్వం సిద్ధం చేశారు. ఇస్రో బాహుబలి రాకెట్‌గా పేరుగాంచిన జీఎస్‌ఎల్‌వీ మార్క్3–ఎం1 ఉపగ్రహ వాహక నౌక ద్వారా ఈ ప్రయోగాన్ని నిర్వహించనున్నారు. 15వ తేదీ వేకువజామున ప్రయోగించాలనుకున్న చంద్రయాన్–2ను చివరి గంటలో రాకెట్‌లో మూడో దశలో సాంకేతిక లోపం తలెత్తడంతో ఆపేసిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి శాస్త్రవేత్తలు ఎంతో శ్రమించి.. వారం తిరగక ముందే సాంకేతిక లోపాన్ని సవరించి ప్రయోగానికి సిద్ధం చేశారు. శనివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఇస్రో చైర్మన్ డాక్టర్ కె.శివన్ ప్రయోగం పనులపై అన్ని సెంటర్ల డైరెక్టర్లతో ఎంఆర్ఆర్ సమావేశాన్ని నిర్వహించారు. ఆదివారం ఉదయం ఒకసారి లాంగ్ రిహార్సల్స్ నిర్వహిస్తారు. లాంచ్ ఆథరైజేషన్ బోర్డ్ ఆధ్వర్యంలో మరోమారు సమావేశమయ్యాక సాయంత్రం 6.43 గంటలకు కౌంట్‌డౌన్ నిర్వహించే అవకాశం ఉంది. అయితే.. ఆదివారం ఇస్రో చైర్మన్ డాక్టర్ కె.శివన్ షార్‌కు విచ్చేసిన తర్వాత ల్యాబ్ మీటింగ్ జరుగుతుందని షార్ అధికార వర్గాలు అంటున్నాయి. మొత్తానికి 3,850 కిలోల బరువు కలిగిన చంద్రయాన్–2 ఉపగ్రహాన్ని నింగిలోకి పంపేందుకు జీఎస్‌ఎల్‌వీ మార్క్3–ఎం1 రాకెట్ ప్రయోగవేదికపై సిద్ధంగా ఉంది.
























# ప్రైవసీ మాయం!



మీ ఫొటోను ఇష్టమొచ్చినట్టు వాడేసుకుంటామని మీతో ఎవరైనా అంటే ఏం చేస్తారు? హాట్.. అస్సలు కుదరదు అంటారు. అయినా అవతలి వాళ్లు ఇవన్నీ లెక్కచేయకపోతే? ఏముంది.. ఫేస్‌యాప్ తరహా వివాదం ఏర్పడుతుంది!

## ఫేస్ యాప్.. బాప్‌రే బాప్

**ఫేస్‌యాప్..** గత వారం రోజులుగా ప్రపంచమంతా మార్మోగుతున్న స్మార్ట్‌ఫోన్ అప్లికేషన్ పేరు ఇది. మీరో సెల్ఫీ దిగి ఈ యాప్‌లో పెడితే అది మీ ఫొటోను ఎడిట్ చేసి మీరు ముసలివాళ్లయ్యాక ఎలా ఉంటారో చూపిస్తుంది. అంతేదా.. సరదాగా ఉంటుంది. ఓసారి ప్రయత్నించి చూద్దాం అని మీరు అనుకుంటే మాత్రం సమస్యలు తప్పవంటున్నారు నిపుణులు. ఫేస్‌యాప్ ప్రైవసీ అంశాల నిబంధనలే ఇందుకు కారణమని చెబుతున్నారు. రష్యాకు చెందిన వైర్‌లెస్ ల్యాబ్ అనే సంస్థ అభివృద్ధి చేసిన ఫేస్‌యాప్‌ను మనం వాడటం అంటే.. మన ఫొటోలతోపాటు ఇతర సమాచారం మొత్తం ఆ కంపెనీ చేతుల్లో పెట్టడమే. ఆ కంపెనీ మీ సమాచారాన్ని ఎలాగైనా, ఎప్పుడైనా, ఎవరితోనైనా పంచుకునేందుకు మీరు అంగీకరించడమే. ఇలాంటి ప్రైవసీ నిబంధనలు ఇతర యాప్‌లలోనూ ఉన్నప్పటికీ మనకు ఇష్టం లేకపోతే ఆ సమాచారాన్ని తొలగించుకునే అవకాశం ఉంటుంది. ఫేస్‌యాప్‌తో మాత్రం ఇలా కుదరదు. ఒక్కసారి వాడామా.. ఇక జీవితకాలం ఆ సమాచారం ఆ కంపెనీ సొత్తు! వాస్తవానికి ఫేస్‌యాప్ అప్లికేషన్ అందుబాటులోకి వచ్చి రెండేళ్లు అవుతోంది. మనం వృద్ధులుగా మారితే ఎలా ఉం టుందో చూపే ఫీచర్ అప్పటి నుంచే ఉంది కూడా. న్యూరల్ నెట్‌వర్క్స్ అనే ఆధునిక టెక్నాలజీ సాయంతో జరిగే ఈ ప్రక్రియ మాటెలా ఉన్నా గత వారం రోజుల్లోనే దీనికి విపరీతమైన ప్రాచుర్యం లభించేందుకు మాత్రం చక్ షూమర్ అనే అమెరికా సెనెటర్ కారణమయ్యారు. ఫేస్‌యాప్‌లోని ప్రైవసీ నిబంధనలపై అందరూ జాగ్రత్త వహించాలని హెచ్చరిస్తున్నారు. ట్రంప్ ప్రభుత్వం ఈ అంశంపై విచారణ చేపట్టాలని కూడా ఆయన డిమాండ్ చేస్తున్నారు. వైర్‌లెస్ ల్యాబ్ రష్యాకు చెందింది కావడం.. అమెరికన్ల సమాచారాన్ని (ఫొటో, లొకేషన్ వంటివి) సేకరిస్తుండటం వల్ల భవిష్యత్తులో ఈ సమాచారం ప్రత్యర్థి దేశాలకు చేరితే ప్రమాదమని షూమర్ అంటున్నారు. అమెరికన్ ఎన్నికలను ప్రభావితం చేసేలా పనిచేసిందన్న కేంబ్రిడ్జ్ అనలిటిక్స్ సంస్థపై చెలరేగిన దుమారం సద్దుమణగక ముందే సోషల్ మీడియాపై ఇలాంటి మరో ఆరోపణ రావడం గమనార్హం.

– సాక్షి నాలెడ్జ్ సెంటర్

**కంపెనీ ఏమంటోంది?**

వినియోగదారులు ఎంపిక చేసిన ఫొటోలనే తాము న్యూరల్ నెట్‌వర్క్స్ సాయంతో ఎడిట్ చేసి పంపుతున్నామని, ఈ వ్యవహారం మొత్తం క్లౌడ్ కంప్యూటర్లలో జరుగుతున్న కారణంగా ఫొటోలు కొద్దికాలం అక్కడ నిల్వ ఉండొచ్చని వైర్‌లెస్ ల్యాబ్ అంటోంది. టెక్ క్రంచ్ అనే వెబ్‌సైట్‌తో సంస్థ ప్రతినిధి ఒకరు మాట్లాడుతూ ప్రతి 48 గంటలకు తాము సర్వర్ల నుంచి ఫొటోలను తొలగిస్తుంటామని స్పష్టం చేసింది. పైగా అందరూ అనుకుంటున్నట్లు తాము రష్యాకు చెందిన క్లౌడ్ సర్వర్లను వాడటం లేదని.. బదులుగా అమెరికా సర్వర్లనే వాడుతున్నామన్నారు. ఈ రకమైన ప్రైవసీ నిబంధనలు మనం ఇప్పటికే విస్తృతంగా ఉపయోగిస్తున్న అనేక ఇతర యాప్‌ల లోనూ ఉండటం కొసమెరుపు!

# అత్యధిక సామర్థ్యమున్న పంపు సెట్లు సిద్ధం

**జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు**

**సాక్షి, హైదరాబాద్:** మేడిగడ్డ ద్వారా తరలిస్తున్న గోదావరి జలాలను శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు, మల్లన్నసాగర్‌కు తరలించేందుకు అవసరమైన అత్యధిక సామర్థ్యం కలిగిన పంపు సెట్లు రామడుగు వద్ద సిద్ధంగా ఉన్నట్లు జెన్‌కో, ట్రాన్స్‌కో సీఎండీ దేవులపల్లి ప్రభాకర్‌రావు తెలిపారు. ఇందుకు అవసరమైన విద్యుత్ సరఫరా, పంపులకు సాంకేతిక ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు. కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో అత్యంత కీలకమైన రామడుగు పంపుహౌస్‌ను ప్రభాకర్‌రావు శనివారం సందర్శించారు. అత్యధిక సామర్థ్యంతో రామడుగులోనే పంపులు ఏర్పాటు చేశారు. ఒక్కొక్కటి 139 మెగావాట్ల సామర్థ్యం కలిగిన 7 పంపులను (మొత్తం 973 మెగావాట్లు) సమకూర్చారు. ఈ పంపులను ఆయన తనిఖీ చేశారు. కన్నెపల్లి నుంచి అన్నారం చేరిన గోదావరి నీరు, అక్కడి నుంచి సుందిళ్లకు వస్తోంది. సుందిళ్ల నుంచి ఎల్లంపల్లికి చేరుకుంటుంది. ఆ తర్వాత నందిమేడారం ద్వారా రామడుగుకు వస్తుంది. రామడుగు తర్వాత గోదావరి నీటిని దాదాపు 100 మీటర్లకుపైగా ఎత్తిపోసి రెండు రెగ్యులేటర్ల ద్వారా శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు, మిడ్‌మానేరుకు పంపుతారు. త్వరలోనే రామడుగు దాకా నీళ్లు వచ్చే అవకాశం ఉండటంతో లిఫ్టింగ్‌కు కావాల్సిన ఏర్పాట్లు పరిశీలించారు.









Published and Printed by K. Ramachandra Murthy, Editorial Director on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., Editor: V. Murali, Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792